


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 220 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 20 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 220 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 20 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta, Bapatla, Visakhapatnam, Kakinada, Ongole, Kadapa,, SPSR Nellore, Circulated by :Srikakulam, manyam, Vizianagaram, East Godavari, Eluru, Guntur, Tirupati, Chittor, Kurnool, Anantapur



## మధ్యలోకి వస్తే ఖబడ్దార్.. మళ్లీ వెంటబడి ఓడిస్తాం

### మంత్రి శ్రీధర్ బాబుకు కవిత మాస్ వార్నింగ్

- సింగరేణి బాయిబాట కార్యక్రమంలో పాల్గొన్న కవిత
- కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసా
- కార్మికులను కలవకుండా పోలీసులు ఆంక్షలు పెడుతున్నారని మండిపాటు

హైదరాబాద్ పెన్ పవర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబడ్దార్. గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి ఓడించాం.

- మిగతా 2లో

- హైదరాబాద్‌లో జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం
- పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- జీహెచ్ఎంసీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ బలోపేతంపై జనసేన దృష్టి



# తెలంగాణపై పవన్ కల్యాణ్ ఫోకస్..

## మణికొండలో జనసేన కొత్త ఆఫీస్



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయం స్ఫూర్తితో జనసేన పార్టీ తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించే దిశగా కీలక అడుగు వేసింది. పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. మణికొండలోని మల్కం చెరువు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన

- మిగతా 2లో



## విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపిస్తున్నాం

హైదరాబాద్ పెన్ పవర్: విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు.

- మిగతా 2లో



## సంధ్య థియేటర్ ఘటన.. అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

హైదరాబాద్ పెన్ పవర్: సంధ్య థియేటర్ ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. సోమవారం విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఏ11 నిందితుడిగా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకు నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. సంధ్య థియేటర్ ఘటనలో ఇప్పటి వరకు 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. నిందితుల వ్యక్తిగత హాజరు

- మిగతా 2లో

## రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా నవ భారత నిర్మాణం జరగాల్సి ఉంది

- రాహుల్ జన్మదినం సందర్భంగా గాంధీ భవన్ లో కేక్ కట్ చేసిన మహేశ్ గౌడ్
- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాహుల్ లక్ష్యమని వెల్లడి
- కార్పొరేట్ పెత్తందారుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శ



- మిగతా 2లో

## హైదరాబాద్‌లో త్వరలో భూగర్భ రోడ్లు

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరంలో త్వరలోనే భూగర్భ (టన్నెల్) రోడ్లను నిర్మించడం ద్వారా కార్యాలయాలకు రాకపోకలను సులభతరం చేయనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) భాగస్వామ్యంతో క్వాంటం కంప్యూటింగ్ కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఖాజాగూడ ఎస్ఏఎస్ ఐ టవర్‌లో శుక్రవారం ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా, బోవర్ స్కూల్ ఆఫ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన

- మిగతా 2లో





## ఫుట్‌పాత్‌పై నడక ప్రాథమిక హక్కు: సుప్రీంకోర్టు కీలక తీర్పు

- ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు ప్రకటన
- మోటారు వాహనాల కన్నా పాదచారులకే అధిక ప్రాధాన్యం
- ఫుట్‌పాత్‌ల నిర్మాణం, నిర్వహణ స్థానిక సంస్థల బాధ్యత అని స్పష్టీకరణ
- కర్ణాటకలో బాలుడి మృతి ఘటనపై విచారణ సందర్భంగా కీలక తీర్పు

పెన్ పవర్ డెస్క్: దేశంలో పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక కీలక తీర్పును వెలువరించింది. సక్రమంగా నిర్మించి, నిర్వహించే ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మోటారు వాహనాల రాకపోకల కంటే పాదచారుల హక్కులకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ధర్మాసనం తేల్చి చెప్పింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఏ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి)

- మిగతా 2లో

## మోదీ 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారు



- సంగారెడ్డిలో రాహుల్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించిన జగ్గారెడ్డి దంపతులు
- రాహుల్ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారన్న జగ్గారెడ్డి
- దేశం కోసం మోదీ ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పగలరా అని ప్రశ్న

- మిగతా 2లో



## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన... జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

- తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సన్నాహాలు
- జూన్ 25 నుంచి ఇంటింటికి వచ్చి వివరాల సేకరణ
- సుమారు 25 ఏళ్ల తర్వాత జరుగుతున్న అతిపెద్ద కసరత్తు
- సన్నద్ధతపై అధికారులతో సీఈఓ సుదర్శన్ రెడ్డి సమీక్ష

పెన్ పవర్ డెస్క్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) – 2026' కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి

- మిగతా 2లో

## సీఎం చంద్రబాబును కలిసిన సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులు

- విజయవాడ యువకుడు సాయి కృష్ణ అదృశ్యంపై సీఎం చంద్రబాబు స్పందన
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వ అండ ఉంటుందని హామీ
- కేసుపై ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తు జరుగుతోందని వెల్లడి
- దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- మే 9 నుంచి కనిపించకుండా పోయిన సాయి కృష్ణ



- మిగతా 2లో

## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..



- ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక ఒప్పందం
- కొనసాగింపుగా స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా-ఇరాన్ చర్చలు
- ఒప్పందం అమలు, పర్యవేక్షణపై ఈ చర్చలు
- అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన వాయిదా పడినట్లు వైట్‌హౌస్ ప్రకటన
- సాంకేతిక, లాజిస్టిక్ కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- దాంతో చర్చలు కూడా వాయిదా

- మిగతా 2లో

## ఫొటో కోసం ప్రాధేయపడాల్సిన అవసరం లేదు.. ట్రంప్‌నకు మెలోని కౌంటర్

పెన్ పవర్ డెస్క్: ఫ్రాన్స్ వేదికగా జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోని తనతో ఫొటో దిగడానికి ఉబలాట పడ్డారంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

- మిగతా 2లో



# తెలంగాణపై పవన్ కల్యాణ్ ఫోకస్..

- మొదటి పేజి తరువాయి
ఈ కార్యాలయంలో తొలుత సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పవన్ కల్యాణ్ పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యాలయంలోకి ప్రవేశించారు. అక్కడ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి జనసేన శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.
రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అవసరమైతే ఒంటరిగానే బరిలోకి దిగుతామని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. పార్టీలోకి చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక జాయినింగ్స్ కమిటీని కూడా నియమించనున్నారు.

## ఎడిటర్ వ్యూ

## కవిత పోటీ ప్లాన్ అదేనా? పట్టు నిలుపుకునేందుకు అదే మార్గమట

తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విస్తృతంగా పర్యటిస్తున్నారు. కొంత తన పట్టు నిలుపుకునేందుకు కొన్ని చోట్ల మాత్రమే ఆమె ఎక్కువగా ఫోకస్ పెట్టినట్లు అర్థమవుతుంది. ప్రధానంగా గతంలో తెలంగాణ జాగృతి బలంగా ఉన్న ప్రాంతాల్లో టీఆర్ఎస్ ను విస్తరించాలన్న నిర్ణయం కనపడుతుంది. కరీంనగర్ జిల్లా, నిజామాబాద్ జిల్లాలోనే ఎక్కువ పట్టుంది. ముఖ్యంగా సింగరేణి కార్మికులలో కొంత కవితకు పట్టు ఉంది. బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు ఆమె గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరించడంతో చాలా మంది కార్మిక నేతలతో ఉన్న సంబంధాలను ఆమె మెరుగు పర్చుకుంటూ తెలంగాణ రక్షణ సేనను బలపర్చే ప్రయత్నం చేస్తున్నట్లు కనపడుతుంది.

### తెలంగాణ రక్షణ సేనను...

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ కు గురైన కల్వకుంట్ల కవిత సొంతంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని పెట్టుకున్నారు. ప్రజల్లోకి వెళుతున్నారు. బొగ్గుబావిలను సందర్శిస్తున్నారు. బాయిబాట అంటూ పెద్దపల్లి జిల్లాలో పర్యటిస్తున్న ఆమెకు కార్మిక సంఘాల నేతలు స్వాగతం పలుకారు. కార్మికులతో సమావేశమవుతున్నారు. వారితో సమావేశమై వారికున్న సమస్యలపై చర్చిస్తున్నారు. వారి ప్రధాన డిమాండ్లను తెలుసుకున్న అనంతరం ప్రభుత్వం పై వత్తిడి పెంచేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించే పనిలో కల్వకుంట్ల కవిత ఉన్నారని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ముందు పట్టు నిలుపుకుంటే కనీస స్థానాల్లో విజయం సాధించవచ్చన్నది కవిత ఆలోచనగా తెలుస్తోంది.

### అన్ని చోట్ల పోటీ చేసి...

అన్ని చోట్ల పోటీ చేసి ఇబ్బంది పడే కన్నా బలమున్న ప్రాంతాల్లోనే ఫోకస్ పెట్టాలని కల్వకుంట్ల కవిత భావిస్తున్నారు. దీంతో పాటు తన అత్త గారిల్లున్న నిజామాబాద్ ప్రాంతంలోనూ అంతో ఇంతో తనకు పట్టుందని భావిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. తాను కూడా నిజాబాద్ జిల్లా నుంచి పోటీ చేసేందుకు కల్వకుంట్ల కవిత సమాయత్తమవుతున్నారు. దీంతో పాటు సిద్ధిపేట నుంచి కూడా పోటీ చేస్తానని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. కరీంనగర్ జిల్లాతో పాటు ఖమ్మం, వరంగల్ జిల్లాలోనూ తన పార్టీ అభ్యర్థులను పోటీ చేయించే యోచనలో ఉన్నారు. అయితే కల్వకుంట్ల కవిత పార్టీ అయిన తెలంగాణ రక్షణ సేన వల్ల బీఆర్ఎస్ కే ఎక్కువ నష్టం చేకూరే అవకాశముందని భావిస్తున్నారు.

## మోదీ 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తన మార్క్ పొలిటికల్ కామెంట్స్‌తో మరోసారి వార్తల్లో నిలిచారు. సంగారెడ్డి వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగ్గారెడ్డి, ఆయన భార్య ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు.సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ లాంటి జాతీయ స్థాయి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నాడు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చినవేనని జగ్గారెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ కష్టపడి నిర్మించిన ఇలాంటి ప్రభుత్వ ఆస్తులను... నేటి బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రైవేటీకరణ చేస్తూ లూటీ చేస్తోందని మండిపడ్డారు."నెహ్రూ పాలనను బ్రేక్ చేశామని బీజేపీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. రాహుల్ గాంధీ ముత్తాత (నెహ్రూ), నానమ్మ (ఇందిరా గాంధీ), తండ్రి (రాజీవ్ గాంధీ), తల్లి (సోనియా గాంధీ) ఈ దేశం కోసం ఏం త్యాగాలు చేశారో, ఎలాంటి సంస్థలు నిర్మించారో నేను ఆధారాలతో సహా వివరిస్తా. మరి గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీ దేశానికి ఏం చేశారో బీజేపీ నేతలు సమాధానం చెబుతారా?" అని సూటిగా ప్రశ్నించారు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని... ఈ లెక్కన దేశ యువతకు ఇప్పటివరకు ఏకంగా 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారంటూ జగ్గారెడ్డి మండిపడ్డారు. దేశం బాగుపడాలన్నా, నిరుద్యోగం అంతమవ్వాలన్నా రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేవలం ప్రెస్‌మీట్‌లకే పరిమితం కాకుండా.. రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకల జ్ఞాపకార్థం జగ్గారెడ్డి దంపతులు దాదాపు 350 మంది పాఠశాల చిన్నారులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

## ఫుట్‌పాత్‌పై నడక ప్రాథమిక హక్కు: సుప్రీంకోర్టు కీలక తీర్పు

- మొదటి పేజి తరువాయి
(దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా సంచరించే హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కు)లలో భాగంగానే ఫుట్‌పాత్‌పై నడిచే హక్కు కూడా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. గౌరవప్రదమైన జీవనానికి సురక్షితమైన ఫుట్‌పాత్‌లు అత్యవసరమని, వాటిని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జస్టిస్ నరసింహ తన తీర్పులో వివరించారు.
కర్ణాటకలో చోటుచేసుకున్న ఒక విషాద ఘటన ఈ తీర్పునకు నేపథ్యంగా నిలిచింది. పాఠశాలకు వెళుతున్న ఒక బాలుడిని లారీ ఢీకొట్టడంతో అతడు మరణించాడు. ఆ ప్రాంతంలో సరైన ఫుట్‌పాత్ లేకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తేలింది. ఈ కేసులో బాధితుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని సుప్రీంకోర్టు రూ.11.44 లక్షలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది.దేశంలోని నగరాల్లో ఫుట్‌పాత్‌లు సక్రమంగా లేకపోవడం, ఆక్రమణలకు గురికావడం లేదా పూర్తిగా అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను కోర్టు ప్రస్తావించింది. దీనిని ఒక నాగరికతా సమస్యగా న్యాయస్థానం అభివర్ణించింది. రహదారులు ఉన్న ప్రతిచోటా ఫుట్‌పాత్‌లను నిర్మించి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, పంచాయతీలదేనని గుర్తు చేసింది. పాదచారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సూచించింది. ఈ చారిత్రాత్మక తీర్పు భవిష్యత్తులో పట్టణ ప్రణాళిక విధానాలపై గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా నవ భారత నిర్మాణం జరగాల్సి ఉంది

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లిలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం 'గాంధీ భవన్'లో వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భారీ కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాంధీ భవన్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ... దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, సమాన అవకాశాలు కల్పించడమే రాహుల్ గాంధీ ప్రధాన రాజకీయ లక్ష్యమని అన్నారు. "దేశంలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల వంటి కీలక సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ. దేశవ్యాప్తంగా వివిధ ఉద్యోగ నియామక పరీక్షల్లో తరచూ జరుగుతున్న పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు దక్కాలంటే కేంద్ర ప్రభుత్వ విధానాల్లో స్పష్టమైన మార్పు రావాలి" అని చెప్పారు.
రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, యువత సాధికారతతో కూడిన నవ భారత నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కేవలం కొద్దిమంది కార్పొరేట్ పెత్తందారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగుల హక్కుల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడుతుందని స్పష్టం చేశారు. దేశ ప్రజలకు మరింత సేవలందించేందుకు రాహుల్ గాంధీకి భగవంతుడు దీర్ఘాయుష్షును, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## మధ్యలోకి వస్తే ఖబడ్దార్.. మళ్లీ వెంటబడి ఓడిస్తాం

- మొదటి పేజి తరువాయి
మళ్లీ అదే పునరావృతమైతే వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం" అంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆమె మాస్ వార్నింగ్ ఇచ్చారు.బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు.
అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ... కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు.
"అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు. మ్యాన్ చైర్ మీద 45 నిమిషాల పాటు ప్రయాణించడం వల్ల కార్మికులు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. సింగరేణిలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. జేఎంఇటీ లో ఉన్న వారికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను సింగరేణి కార్మికులను కలవకుండా ఉండేందుకు గత నాలుగు రోజులుగా పోలీసులు ఆంక్షలు పెడుతూ అడ్డుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసలు సింగరేణి పరిధిలోకి పోలీసులకు అనుమతే లేదని, గేట్ మీటింగ్‌కు వస్తే కార్మికుల జీతాలు కట్ చేస్తామని యాజమాన్యం బెదిరించడం దుర్మార్గమన్నారు. ఒక్క కార్మికుడి జీతం కట్ చేసినా తాను ఇక్కడే గని ముందే ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ (సమీా) ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో త్వరలో భూగర్భ రోడ్లు

- మొదటి పేజి తరువాయి
'హైదరాబాద్ ఎకనామిక్ ఫోరం 2026' సదస్సులో ఆయన ప్రసంగించారు. "ఆలోచనలను ఆచరణలోపెట్టే కేంద్రంగా హైదరాబాద్ మారింది. టీహబ్, టీవర్క్స్ ఇందుకు దన్నుగా నిలుస్తున్నాయి. నగరానికి చెందిన అంకుర సంస్థ అంతరిక్షంలోకి ఏఐ లేబొరేటరీని పంపనుంది. దేశానికి హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యం. డేటా ఎక్స్ఛేంజ్ ప్లాట్‌ఫాంను పరిచయం చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. తీవ్రపోటీ ఉన్నప్పటికీ నిరుడు 70 జీసీసీలను రాష్ట్రానికి తెచ్చాం. ఈ ఏడాది లక్ష్యం 100 జీసీసీలు. రాబోయే దశాబ్దాలకు పునాదులు వేస్తూ భారత్ ఫ్యూచర్‌సిటీలో ఏఐ సిటీకి 200 ఎకరాలు కేటాయించాం. సాంకేతికత, లైఫ్‌సైన్సెస్ సమ్మిళితానికి నగరం అత్యంత అనుకూలమైంది. ప్రపంచానికి మూడోవంతు వ్యాక్సిన్‌లు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయి" అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. 'సేఫ్ బార్డర్స్– ద ఇన్విజిబుల్ ఎకనామిక్ డ్రైవర్ ఫ్రం ఇన్వెస్ట్‌మెంట్ ఫ్లో' అంశంపై ఆర్మీ విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ సతీష్ దువా మాట్లాడారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ సర్వేష్ సింగ్, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వీసీ ప్రీతిరెడ్డి, ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా సంస్థ ఛైర్మన్ జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

## విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపిస్తున్నాం

- మొదటి పేజి తరువాయి
గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.
"తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి.
విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం.
విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## సంధ్య థియేటర్ ఘటన.. అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

- మొదటి పేజి తరువాయి
తర్వాత కేసు విచారణ ప్రారంభం కానుంది.
ఇప్పటికే 23 మందిని నిందితులుగా చేర్చి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు.

## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..

అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. ఈ చర్చల్లో ఖతార్, పాకిస్థాన్ కూడా పాల్గొనాల్సి ఉంది. ఈ విషయాన్ని స్విట్జర్లాండ్ విదేశాంగ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. చర్చల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని, దానికి సంబంధించిన సన్నాహక పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రస్తుతానికి దీనిపై మరింత సమాచారం ఇవ్వలేమని పేర్కొంది. మరోవైపు, ఇరాన్‌తో సాంకేతిక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేపట్టాల్సిన పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. అయితే, చర్చల కోసం సన్నాహాలు కొనసాగుతున్నాయని, ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందం అమలు లక్ష్యంగా తదుపరి దశ చర్చలు ప్రారంభించడంపై ఇరుపక్షాలు దృష్టి సారించాయని తెలిపింది. "లాజిస్టిక్స్ పరమైన అంశాలు ఎప్పుడూ సులభంగా ఉండవు" అని వైట్‌హౌస్ ప్రతినిధి పేర్కొన్నారు. అంతకుముందు, వైట్‌హౌస్‌లో మాట్లాడిన వాన్స్.. ఈ వారాంతంలోనే చర్చలు ప్రారంభం కావచ్చని అంచనా వేశారు. అయితే, ఇరాన్ నుంచి ప్రతినిధులు బయటకు రావడం అంత సులభం కాదని, సమన్వయం సవాలుగా మారిందని ఆయన అంగీకరించారు. అమెరికా బృందానికి తానే నాయకత్వం వహించనున్నట్టు స్పష్టం
చేశారు. ఇప్పటికే కుదిరిన రాజకీయ ఒప్పందాన్ని ఆచరణలో పెట్టడం, దాని అమలు, పర్యవేక్షణ, నిబంధనలపై స్పష్టత కోసం ఈ చర్చలు జరగాల్సి ఉంది. "మేము మాటలను నమ్మం. చేతలను, ప్రవర్తనను మాత్రమే విశ్వసిస్తాం" అని వాన్స్ పేర్కొంటూ, చర్చల్లో అమెరికా వైఖరి ఎలా ఉండబోతోందో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించనప్పటికీ, వీలైనంత త్వరగా చర్చలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన... జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

- మొదటి పేజి తరువాయి
గురువారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన మరియు చిరునామా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు.
2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఫొటో కోసం ప్రాధేయపడాల్సిన అవసరం లేదు.. ట్రంప్‌నకు మెలోని కౌంటర్

- మొదటి పేజి తరువాయి
వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. ఆయన వ్యాఖ్యల్ని మెలోని ఖండించారు. తానెప్పుడూ ఫొటో కోసం ప్రాధేయపడలేదని పేర్కొన్నారు. ఇలా చెప్పుకోవడం ట్రంప్‌నకు ఇదేం కొత్తకాదంటూ మండిపడ్డారు.ఇటాలియన్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన జీ7 శిఖరాగ్ర సమావేశంలో జార్జియా మెలోని తనతో ఫొటో దిగడానికి వేడుకున్నారని ట్రంప్ అన్నారు. ఆమె పట్టుబట్టడంతో జాలిపడి ఫొటో దిగడానికి అంగీకరించానని పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ఆమె తోసిపుచ్చారు. తాను గానీ, ఇటలీ దేశం గానీ ఎవరినీ బతిమిలాడవని స్పష్టం చేశారు. మిత్రదేశాల పట్ల ట్రంప్ ఇలా ప్రవర్తించడంపై విచారం వ్యక్తం చేశారు.ట్రంప్ వ్యాఖ్యలు తమ ప్రధానిని అవమానించేలా ఉన్నాయని పేర్కొంటూ ఆ దేశ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజాని తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆయన జూన్ 21, 22 తేదీల్లో అమెరికాలో పర్యటించాల్సి ఉంది. గతంలో పోప్ వ్యవహారంలోనూ ట్రంప్, మెలోని మధ్య విభేదాలు తలెత్తాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని వ్యతిరేకించిన పోప్ వ్యాఖ్యలను ట్రంప్ తప్పుబడుతూ.. వామపక్ష తీవ్రవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదంటూ మెలోని ఖండించారు. ఇరాన్ విషయంలో తన చర్యలను విమర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్.. ఆమెకు ధైర్యం లేదని విమర్శించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# నల్గొండ జిల్లాలో రూ.15 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్



**నల్గొండ పెన్ పవర్::** నల్లగొండలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ ఏసీబీ వలకు చిక్కాడు. భూ సర్వే నివేదిక జారీకి లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్?ను ాజదీ అరెస్ట్ చేసింది. మొత్తం రూ.35 వేల లంచం కోరినట్లు ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర వివరించారు. ముందుగానే రూ.20 వేల అడ్వాన్స్ తీసుకున్నాడు. రూ.15 వేల లంచం తీసుకుంటుండగా ాజదీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నల్లగొండ కలెక్టరేట్ సమీపంలో ఏసీబీ పన్నిన వలకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చిక్కడం గమనార్హం. నిందితుడి వద్ద నుంచి రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.ఏసీబీ అధికారులు ఆర్డీఓ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. విధుల నిర్వహణలో అక్రమ ప్రయోజనం పొందినట్లు నిర్ధారణ అయింది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అరెస్ట్ చేసింది. నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో అధికారులు హాజరుపరచనున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయాలని సూచించింది. అవినీతిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ హెచ్చరించింది.

# పవన్ కళ్యాణ్ వచ్చినా.. కమల కళ్యాణ్ వచ్చినా బాధ లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో తెలంగాణ జనసేన ఆఫీసు ప్రారంభించిన సంగతి తెలిసిందే. శుక్రవారం ( జూన్ 19 ) మణికొండలో నూతనంగా నిర్మించిన జనసేన ఆఫీసును ప్రారంభించారు పవన్ కళ్యాణ్. ఈ క్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ వచ్చినా.. కమల కళ్యాణ్ వచ్చినా బాధ లేదని అన్నారు. పవన్ కళ్యాణ్ కు ఎవరితో ఏం ప్రాబ్లం ఉందో తమకు సంబంధం లేదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. సామరస్యంగా తెలంగాణకు వస్తే తన ఇంట్లోనే భోజనాలు పెట్టిస్తానని.. రాజకీయాలు చేస్తామంటే కుదరదని అన్నారు మహెష్ కుమార్.ఏపీలో అధికారం చేపట్టిన జోష్ లో ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ దూకుడు పెంచారు. తెలంగాణలో పార్టీని బలోపేతం లక్ష్యంగా అడుగులేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లోని మణికొండలో నూతనంగా నిర్మించిన జనసేన ఆఫీసును ప్రారంభించారు. శుక్రవారం ( జూన్ 19 ) ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పార్టీ ఆఫీసును ప్రారంభించారు పవన్ కళ్యాణ్.త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా పార్టీ ఆఫీసును ప్రారంభించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో జనసేన ఉనికిని చాటుకునేందుకు, క్షేత్రస్థాయిలో క్యాడర్ ను సమాయత్తం చేసేందుకు తానే రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని ఇప్పటికే ప్రకటించారు పవన్ కళ్యాణ్. ఈ క్రమంలో తెలంగాణ క్యాడర్ కు పవన్ ఎలాంటి దిశానిర్దేశం చేయనున్నారన్నది ఆసక్తిగా మారింది.

## మాతృభాష పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి: గవర్నర్



**హైదరాబాద్ పెన్ పవర్:** మాతృభాష పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 50 మంది టీచర్లకు 2 వారాలు ఆంగ్ల భాషా ప్రావీణ్యతలో శిక్షణ ఇచ్చారు. ఆ టీచర్లతో లోక్‌భవన్‌లో గవర్నర్ శుక్రవారం ముచ్చటించి.. ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. శిక్షణ కోసం గవర్నర్ నిధి నుంచి రూ.12.80 లక్షలు మంజూరు చేశారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్, ఇఫ్లూ వీసీ ఆచార్య నాగరాజు పాల్గొన్నారు.

# వంద మంది అంబేడ్కర్‌లు తయారు కావాలి

- మీరు చదువుకోండి.. మీ అన్నగా వసతులు కల్పిస్తా: రేవంత్
- గత పాలకులు విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శ
- గవర్నర్‌తో కలిసి యంగ్ ఇండియా స్టూడెంట్స్ కిట్ల పంపిణీ
- డ్రగ్స్ లేని తెలంగాణను ఆవిష్కరిద్దామని ప్రతిజ్ఞ చేయించిన శివప్రతాప్ శుక్లా




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న దళిత, గిరిజనబిడ్డలు ఉద్యోగాలతో సంతృప్తి చెందకుండా నాయకులుగా ఎదగాలి. వంద మంది అంబేడ్కర్‌లుగా తయారు కావాలి. మీరు చదువుకోండి.. మీ అన్నగా నేను అన్ని వసతులు కల్పిస్తా. : రాష్ట్ర భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణ భాషా ప్రయుక్త లేదా పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటైన రాష్ట్రం కాదని.. విద్య, ఉపాధి అవకాశాల కోసం అరవై ఏళ్లు విద్యార్థులు పోరాడితే వచ్చిన రాష్ట్రమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా విద్యావ్యవస్థను మారుస్తున్నామని, కేవలం బాధ్యతగానే కాకుండా భావోద్వేగంతో పనిచేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన యంగ్ ఇండియా స్టూడెంట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ“గత పాలకులు విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు. దీన్ని మార్చేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 27.50 లక్షల మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు కార్యాచరణ రూపొందించాం. పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్న లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను నమూనాగా ప్రారంభించాం. విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించేందుకు నేనే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నా. ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో తెలంగాణ చరిత్రను తిరగరాద్దాం. విద్యతో పాటు అద్భుత సాంకేతిక నైపుణ్యాలతో మన తలరాతల్ని మార్చుకుందాం. ఏఐ విప్లవంతో వేల సంఖ్యలో ఉద్యోగాలు పోతున్నా..సాంకేతిక నిపుణులకు ఎలాంటి ముప్పు లేదు. నైపుణ్యాలకు పదును పెట్టండి. ఆంగ్లంతో పాటు జర్మన్, జపనీస్, కొరియన్ భాషలు నేర్చుకోండి. ఐటీ రంగంలో సిలికాన్ వ్యాలీకి దీటుగా నిపుణులను సృష్టిద్దాం. ఇక్కడే యూనికార్న్‌లు వచ్చేలా చేద్దాం. విద్యతో పాటు క్రీడల్లోనూ తెలంగాణ బిడ్డలు రాణించేందుకు అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించనున్నాం. ఒలింపిక్స్‌లో

-4 లో

# రాహుల్ పీఎం, రేవంత్ మరోసారి సీఎం కావడం ఖాయం



- స్టేషన్ ఘన్ పూర్ లో ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు
- కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ కేక్ కట్ చేసిన కడియం శ్రీహరి
- కేసీఆర్ కు ప్రజలు ఎలాంటి గుణపాఠం చెప్పారో అందరం చూశామని వ్యాఖ్య
- మోద ప్రభుత్వానికి కూడా అదే రీతిలో బుద్ధి చెబుతారన్న శ్రీహరి

-4 లో

## 429 మండలాల్లో.. ‘నై’రుతి


### ఇంకా విస్తరించని రుతుపవనాలు

### 25 జిల్లాల్లో లోటు వర్షపాతం

**హైదరాబాద్ పెన్ పవర్:** మృగశిర కార్తె చివరిదశకు చేరుతున్నా.. ముసురుకోని వానలు ఉసూరనిపిస్తున్నాయి. దుక్కులు చేసిన రైతులు ఆకాశంవైపు చూస్తున్నారు. సూర్యుడు నిప్పులు చెరుగుతూనే ఉన్నాడు. వడగాలులు

-4 లో





# వంద మంది అంబేడ్కర్‌లు తయారు కావాలి

-3 పేజి తరువాయి
రాష్ట్రం నుంచి బంగారు పతకం సాధించాలన్నది నా కల. దాన్ని సాకారం చేయాల్సిన బాధ్యత మీపై (విద్యార్థులపై) ఉంది. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. గవర్నర్ శివప్రతాప్ శుక్లా మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటాం" అని మాట్లాడారు.

**మన విద్యార్థులకు ప్రపంచంతోనే పోటీ: భట్టి**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రపంచంతోనే పోటీపడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 27.5 లక్షల మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయడం దేశ చరిత్రలోనే మైలురాయన్నారు. స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు, బూట్లు వస్తువులు కాదని... తల్లిదండ్రుల హోదాలో పిల్లలకు ప్రేమతో ఇస్తున్న కానుకలని తెలిపారు. పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లల విద్య కోసం ప్రభుత్వం కృషి చేస్తోంటే... ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని.. వాటిని చూస్తే నవ్వొస్తోందన్నారు. ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, మల్లు రవి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, హనుమంతరావు, షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, జుల్ఫికర్ అలీ, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, కాలేజియేట్ కమిషనర్ శ్రీదేవసేన, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. పాఠశాల విద్యలో ఉన్నత ఫలితాలు సాధించిన పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షను గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్‌రెడ్డి సత్కరించారు. జిల్లాల విద్యాశాఖ అధికారులు, ప్రతిభ చూపిన, ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ పాఠాలు నేర్పించే అన్నా–అక్కా మెంటార్‌షిప్ పథకాన్ని ఈ వేదికపై నుంచే గవర్నర్, సీఎంలు ప్రారంభించారు. కార్యక్రమంలో దాదాపు 15వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**క్రీడా సదుపాయాల అభివృద్ధికి రూ.50.73 కోట్లు**

రాష్ట్రంలో క్రీడారంగాన్ని బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి రూ.50.73 కోట్ల వ్యయంతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో పాటు పలు క్రీడా అకాడమీలను ప్రారంభించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) ఛైర్మన్ శివసేనారెడ్డి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. రూ.36.65 కోట్లతో వివిధ జిల్లాల్లోని మినీ స్టేడియాల నిర్మాణానికి, స్టేడియాల ఆధునికీకరణ, క్రీడా వసతుల అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.14.08 కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలో బాలబాలికల క్రీడా శిక్షణ కోసం ఏర్పాటు చేసిన వివిధ అకాడమీలను ప్రారంభించారు. శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల్లో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో కొందుర్గ్ మండల కేంద్రంలో రూ.10 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం, సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డా.బీఆర్.అంబేడ్కర్ స్టేడియం ఆధునికీకరణకు రూ.10 కోట్లు, నారాయణపేట జిల్లా సర్వమండల కేంద్రంలో రూ.4 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. వనపర్తి జిల్లా ఆత్మకూరులో రూ.4 కోట్లతో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులు, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్‌లకు కూడా శంకుస్థాపన చేశారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో రూ.3.50 కోట్లతో, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రూ.2.65 కోట్లతో మినీ స్టేడియాలు, నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో రూ.2.50 కోట్లతో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవాల్లో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలోని బాలికల కోసం రూ.5.70 కోట్లతో, బాలుర కోసం రూ.5.70 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఫిఫా–ఐఫా' తెలంగాణ టాలెంట్ అకాడమీలు, అలాగే అథ్లెటిక్స్, హాకీ అకాడమీలు ప్రారంభమయ్యాయి. ఎల్బీ స్టేడియంలో బాలుర కోసం రూ.58.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ అకాడమీ, రూ.49 లక్షలతో ఏర్పాటు చేసిన హ్యాండ్‌బాల్ అకాడమీని కూడా సీఎం ప్రారంభించారు.

రాష్ట్రంలోని పాఠశాలలు, సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, వసతిగృహాల విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం యంగ్‌ఇండియా స్టూడెంట్స్ కిట్స్ ఇచ్చింది. వాటిలో ఏమి ఉన్నాయంటే...

**పాఠశాల విద్యార్థులకు:** టెక్స్ట్‌బుక్స్,నోట్‌బుక్స్, స్కైబ్లూ, నేవీబ్లూ యూనిఫాం, బ్లాక్‌షూ, బ్లాక్ సాక్స్, టై, బెల్టు

**గురుకుల విద్యార్థులకు:** టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, మెరూన్ చెక్స్, మెరూన్ యూనిఫాం, వైట్‌యూనిఫాం, స్కూల్‌బ్యాగు, బ్లాక్‌షూ, బ్లాక్‌సాక్స్, వైట్‌షూ, వైట్ సాక్స్, టై, బెల్ట్, ఐడీ, స్టేషనరీ కిట్, పీటీడ్రెస్, నైట్‌డ్రెస్, ట్రాక్‌సూట్, ఉలెన్ బ్లాంకెట్, బెడ్‌షీట్, కార్పెట్, టవల్, ట్రంక్‌బాక్సు, ప్లేటు, గ్లాస్, కటోరా, స్పూన్, హ్యాండిల్ కప్

**వసతిగృహాల విద్యార్థులకు:** స్టేషనరీ కిట్, పీటీడ్రెస్, నైట్‌డ్రెస్, ట్రాక్‌సూట్, ఉలెన్‌బ్లాంకెట్, బెడ్‌షీట్, కార్పెట్, టవల్, ట్రంక్‌బాక్సు, ప్లేటు, గ్లాస్, కటోరా, స్పూన్, హ్యాండిల్ కప్.

**విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య వంద ఒప్పందాలు**

ఉన్నత విద్యారంగాన్ని పరిశ్రమలతో అనుసంధానించడంలో భాగంగా శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో 'పరిశ్రమలు– విద్యా సహకార గ్యాలరీలు' ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు పరిశ్రమలు ఆయా విద్యాసంస్థలతో 100 ఒప్పందాలు చేసుకున్నాయి. చదువు ఒక్కటే కాకుండా విద్యలో పారిశ్రామిక భాగస్వామ్యాన్ని కల్పించడం ఈ గ్యాలరీల ముఖ్య లక్ష్యమని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. కళాశాల, సాంకేతిక విద్యాశాఖల కృషి ఫలితంగా పరిశ్రమలు, సెక్టార్ స్కిల్ కౌన్సిళ్లు, సీఐఐ, ఐఐటీ హైదరాబాద్, ఐఎస్‌బీ, సైయెంట్ ఫౌండేషన్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదిరినట్లు తెలిపారు. ఒప్పందాలతో విద్యార్థులకు ఉపకార వేతనాలతో కూడిన పారిశ్రామిక శిక్షణ, అప్రెంటిస్‌షిప్ లభిస్తాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్యాలరీని సందర్శించి పారిశ్రామికవేత్తలు, విద్యాశాఖ అధికారులను అభినందించారు. సైయెంట్ ఫౌండేషన్ అధినేత బీవీఆర్ మోహన్‌రెడ్డి, సీఐఐ ప్రతినిధి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించండి: గవర్నర్**

"తెలంగాణలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న మనం... డ్రగ్స్ లేని రాష్ట్రాన్ని ఆవిష్కరిద్దాం.. తల్లిదండ్రులు, విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణకు సహకరించాలి. విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల సరఫరాను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు పలకాలి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలకు ఎప్పుడూ అండగా ఉంటాం. ఏవైనా పొరపాట్లు చేస్తే హెచ్చరిస్తాం. విద్యార్థులకు ఇస్తున్న కిట్‌లోని వస్తువులు వారి ఆత్మగౌరవాన్ని పెంచనున్నాయి" అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములమవుతామని సభకు హాజరైన వారితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

**వాట్సప్‌లో పాఠశాల విద్యాసేవలు**

సాంకేతికతను వినియోగించుకొని...సేవలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులకు అందించనున్నారు. మీసేవ సహకారంతో వాట్సప్ ద్వారా ఇకపై నేరుగా ఫోన్లకు చేరనుంది. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు.

ఈ వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 18 లక్షల మందికిపైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను వాట్సప్ ద్వారా పొందనున్నారు. విద్యా పురోగతి, పరీక్షల సమాచారం, విద్యా సామగ్రి పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, పాఠశాల, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. దీన్ని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో పాఠశాల
విద్యాశాఖతో కలిసి మీ సేవ విభాగం అభివృద్ధి చేసింది. రాష్ట్ర పక్షి పాలపిట్టను డిజిటల్ మస్కట్‌గా పరిచయం చేస్తున్నట్లు మీ సేవ విభాగం కమిషనర్ రవికిరణ్ తెలిపారు. పాలపిట్ట యానిమేషన్ వీడియోల ద్వారా సమాచార వ్యాప్తి జరగనుంది. ప్రస్తుతం హాల్ టికెట్ల డౌన్‌లోడ్, మార్కుల మెమోలు, పరీక్షా ఫలితాలు తదితర వాటిని వాట్సప్ ద్వారా మీసేవ విభాగం సేవలు అందిస్తోంది. వాట్సప్ నంబరు: 8096958096.

# రాహుల్ పీఎం, రేవంత్ మరోసారి సీఎం కావడం ఖాయం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ కేక్ కట్ చేసిన కడియం.. దేశ, రాష్ట్ర రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.రాబోయే రోజుల్లో దేశానికి రాహుల్ గాంధీ పీఎం కావడం, ఇటు తెలంగాణలో రేవంత్ రెడ్డి మరోసారి సీఎం కావడం వంద శాతం పక్కా అని కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు."తెలంగాణలో మాకు ఇక ఎదురే లేదు, తిరుగే లేదు అన్నట్లు అహంకారంతో వ్యవహరించిన కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు ఎలాంటి గుణపాఠం చెప్పారో మనమంతా చూశాం. రానున్న రోజుల్లో కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వానికి కూడా దేశ ప్రజలు అదే రీతిలో బుద్ధి చెప్పడం ఖాయం" అని అన్నారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను రాహుల్ గాంధీ ఒంటరిగా ఎండగడుతున్నారని కొనియాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితో దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు, అణగారిన వర్గాల బాధితులకు అండగా ఉంటూ పార్లమెంట్‌లో రాహుల్ గళం విప్పుతున్నారని ప్రశంసించారు.

# 429 మండలాల్లో.. 'నై'రుతి

-3 పేజి తరువాయి
వీస్తున్నాయి. నైరుతి రుతు పవనాలు విస్తరించకపోవడం, ఆశించిన వర్షాలు కురవకపోవడంతో రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు కఠినంగా మారుతున్నాయి. శుక్రవారం నాటికి 28% లోటు వర్షపాతం కొనసాగుతోంది. ఈ నెల 8న రుతు పవనాలు రాష్ట్రాన్ని తాకినా పది రోజులుగా ఆశించినంత ముందుకు కదలడం లేదు. ఈసారి జులై మినహా వానాకాలంలో మెరుగైన పరిస్థితులు కష్టమేనని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో తీవ్ర లోటు వర్షపాతం కొనసాగుతోంది. సాధారణంగా వానలు ఆలస్యమైనా జూన్ రెండోవారం ముగిసేసరికి పరిస్థితి సాధారణ స్థాయికి చేరుకుంటుంది. 2015, 2021ల్లోనూ నైరుతి ముందుగానే పలకరించినా వర్షాలు ఆలస్యమయ్యాయి. ఈ ఏడాది భిన్న పరిస్థితులు నెలకొని... 25 జిల్లాల్లో లోటు వర్షపాతం కనిపిస్తోంది. రాష్ట్రంలో జూన్ 19 నాటికి సాధారణ వర్షపాతం 76.3 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా 54.6 మి.మీ. నమోదయింది.

11 జిల్లాల్లో తీవ్రమైన లోటు ఉంది. అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో 74% లోటు ఉంది. ఈ జిల్లాలో 19వ తేదీ నాటికి 91.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 23.6 మి.మీ. మాత్రమే కురిసింది. అలాగే వరంగల్(70 శాతం), హనుమకొండ(70), సిద్దిపేట(64), నిర్మల్(63), ఆదిలాబాద్(63), యాదాద్రి భువనగిరి(62), నిజామాబాద్(56), మహబూబాబాద్(55), జగిత్యాల(55), మంచిర్యాల(50) జిల్లాల్లోనూ తీవ్రమైన లోటు ఉంది. ఖమ్మం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ, నారాయణపేట, సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలే కురిశాయి.

**జులైలో మాత్రమే ఆశాజనకం!**

ఈ వానాకాలంలో రాష్ట్రంలో 20% లోటు తప్పదని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. జూన్‌లో సగటున 130.3 మి.మీ., జులైలో 227.4, ఆగస్టులో 215.8, సెప్టెంబరులో 167.1 మి.మీ. వర్షం కురవాలి. అయితే ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో ఈదఫా వర్షాలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. భారత వాతావరణశాఖ తెలిపిన ప్రకారం... "తెలంగాణలో జులైలో వానలు కొంతమేరకు బాగానే ఉంటాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లలో మాత్రం లోటు ఏర్పడుతుంది. నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, గద్వాల, నాగర్‌కర్నూల్ పరిసర జిల్లాల్లో 30% లోటు నమోదు కావచ్చు" అని అధికారులు పేర్కొంటున్నారు.

# అభివృద్ధి చేద్దాం.. ఆదాయం పెంచుదాం


**హైదరాబాద్ పెన్ పవర్:** భూముల అభివృద్ధి.. విక్రయం ద్వారా రాబడి మరింత పెంచుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో ఉప్పల్ భగాయత్, బుద్వేల్, మోకిల ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వానికి ఆశించినదానికన్నా ఎక్కువే రాబడి వచ్చింది. ఇదే ఒరవడిలో మరికొన్ని చోట్ల ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ మానిటైజేషన్ విధానాలను అమలు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇటీవల జరిగిన సమావేశంలో మంత్రి మండలి ఉప కమిటీ నిర్ణయించింది. బాహ్య వలయ రహదారి(ఓఆర్ఆర్) జంక్షన్లకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేసి రాబడి పెంచుకోవాలన్న కోణంలో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

**ఎక్కడెక్కడ భూములున్నాయి?**

ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలను యంత్రాంగం సిద్ధం చేస్తోంది. రైతుల అధీనంలో ఉన్న భూములను సేకరించి అభివృద్ధి చేసి, దానిలో 60 శాతం వాటా చొప్పున ఎకరానికి 1,741 చదరపు గజాలు కేటాయిస్తారు. 40 శాతం హెచ్ఎండీఏ ఖాతాలో చేరుతుంది. భూసేకరణలో భాగంగా ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో అయితే ఒక్కోచోట 50 ఎకరాలు, వెలుపల ప్రాంతంలో అయితే 100 ఎకరాలు, ఆ పైన సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. మరోవైపు ఎక్కడెక్కడ ఎసైన్డ్, ఇనాం, లావణి తదితర ప్రభుత్వ భూములున్నాయనే వివరాలను యంత్రాంగం గుర్తిస్తోంది. సాగులో ఉన్న వాటి జోలికి పోకుండా పడావు పెట్టిన భూములపైనే ఎక్కువ దృష్టిసారిస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వ భూములు ఉన్న చోట వాటికి సమీపంలో ఉన్న పట్టా భూముల యజమానులను కూడా సంప్రదిస్తున్నారు. ఓఆర్ఆర్ వెంబడి ఉన్న జిల్లాల్లో పూలింగ్ విధానాన్ని అమలు చేయాలని చూస్తున్నారు.

ఎసైన్డ్ భూములపై కలెక్టర్లు సమాచారం సిద్ధం చేయాలని ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘం ఆదేశించింది. ఖరీదైన భూములున్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో నాలుగు వేల ఎకరాల వరకు అభివృద్ధి చేయాల్సిన రకానికి చెందినవి ఉన్నట్లు గుర్తించారు. ఓఆర్ఆర్ వెంబడి కొత్తగా మూడు ప్రాజెక్టులు చేపట్టడానికి కసరత్తు చేస్తున్నారు. చౌటుప్పల్, కందుకూరు, శంకర్‌పల్లి తదితర ప్రాంతాల్లో 11 వేల ఎకరాల లభ్యత ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## రాయదుర్గం భూములపై చిక్కుముడి



**హైదరాబాద్ పెన్ పవర్** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో సర్వే నంబరు 83/1లో హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో ఉన్న 5.09 ఎకరాల భూమిపై చిక్కుముడి పడి జటిలమైంది. ఆ భూమి తమకు విక్రయించారంటూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించడంతో.. ఇది చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే ఈ భూమే ఇటీవల అత్యధికంగా ఎకరా రూ.237 కోట్లకు అమ్ముడుపోయింది. ఈ–వేలం ద్వారా టీజీఐఐసీ ఈ భూమిని విక్రయించింది. ఇప్పుడు వివాదం కోర్టుకెక్కడంతో.. ఈ–వేలంలో కొనుగోలు చేసిన సంస్థకు కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. ఈ భూములు ప్రభుత్వానికే చెందుతాయంటూ టీజీఐఐసీ బలమైన వాదన వినిపిస్తోంది. 2010లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ భూమిని ఎస్‌బీఐకి కేటాయించింది. ఆ సంస్థ కార్యాలయం, ఇతర భవనాల నిర్మాణం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయనే ఆలోచనతో ప్రభుత్వం రాయితీ ధరకు ఈ భూమిని ఎస్‌బీఐకి కేటాయించినట్లు టీజీఐఐసీ చెబుతోంది. భూమి తమ స్వాధీనంలోనే ఉందని, ఔట్‌రైట్ సేల్ తర్వాత ప్రభుత్వం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని.. వేలం వేసేలా కేటాయింపు నిబంధనల్లో ఎటువంటి క్లాజ్ లేదని ఎస్‌బీఐ వాదిస్తోంది. ప్రభుత్వ అధికారుల వాదన మాత్రం వేరుగా ఉంది. కేటాయింపు నిబంధనల ప్రకారం.. ఎస్‌బీఐ రెండేళ్లలో ఆ భూమిలో కార్పొరేట్ కార్యాలయం నిర్మించాల్సి ఉందని వారు చెబుతున్నారు. ఆ భూమిని కేటాయింపు ఉద్దేశానికి అనుగుణంగా వినియోగించలేదని, అందుకే టీజీఐఐసీ దాన్ని రద్దు చేసి.. వేలం వేసిందని అధికార వర్గాలు అంటున్నాయి. 2011లోనే విక్రయ ఒప్పంద పత్రాల అప్పగింత, నిర్మాణాన్ని ప్రారంభించేందుకు వీలుగా షోకాజ్ నోటీసులు జారీ చేసినా.. ఎస్‌బీఐ ఎలాంటి నిర్మాణాలను ప్రారంభించకుండా.. 2016లో గడువు పొడిగించాలంటూ ప్రభుత్వానికి నివేదించింది. ఎస్‌బీఐ ఈ భూమిని నిబంధనల ప్రకారం వినియోగించనందున.. సదరు కేటాయింపును రద్దు చేయడానికి అనుమతించాలని టీజీఐఐసీ 2019లో, 2020లో ప్రభుత్వానికి నివేదించింది. 2020 జులై 2న ప్రాజెక్టు అమలు కోసం ఎస్‌బీఐకి చివరి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. ఉత్తర ప్రత్యుత్తరాల అనంతరం.. ఎస్‌బీఐకి చేసిన భూ కేటాయింపులను 22.01.2021న టీజీఐఐసీ రద్దు చేసింది. ఈ రద్దును ఉపసంహరించుకోవాలని ఎస్‌బీఐ వెంటనే ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ క్రమంలో కోర్టులో కేసు నడుస్తోంది. ఉస్మాన్‌సాగర్, గండిపేటల్లో ప్రత్యామ్నాయ భూమిని ప్రతిపాదించగా.. ఎస్‌బీఐ తిరస్కరించింది. అయితే ఈ భూములపై హైకోర్టు ఎలాంటి స్టే మంజూరు చేయలేదని, అందుకే తాము వేలం వేశామని టీజీఐఐసీ చెబుతోంది. సమస్య పరిష్కారం కాకుండా.. ఆ భూములను ఎలా వేలం వేస్తారని ఎస్‌బీఐ ప్రశ్నిస్తోంది. దీంతో రాయదుర్గంలోని ఖరీదైన భూముల వ్యవహారం చిక్కుల్లో పడింది.

## కాకరవాయిలో భూ సర్వే పూర్తి



**హైదరాబాద్ పెన్ పవర్** క్షేత్రస్థాయి భూ సమస్యలన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం పైలట్ గ్రామంగా ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో చేపట్టిన భూ సర్వే ప్రక్రియ పూర్తయింది. 1936లో రాష్ట్రంలో గొలుసులతో సర్వే చేశారు. నాటి నుంచి నేటి వరకు అప్పటి సర్వే ఆధారిత పటాలు, దస్త్రాల ఆధారంగానే భూ పరిపాలన కొనసాగుతోంది. ఈ 90 ఏళ్లలో భూమి అనేక తరాల చేతులు మారింది. చేతి రాత దస్త్రాలు కొనసాగిన సమయంలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. ఆ సమాచారమే డిజిటల్/పోర్టల్‌లో నిక్షిప్తమైంది. క్షేత్రస్థాయిలోనూ భూమి హద్దుల సమస్యలు, ఆక్రమణలు, వివాదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఒకేసారి కాకుండా దశలవారీగా సమస్యలకు చరమగీతం పాడేందుకు ప్రభుత్వం సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో కాకరవాయిలో చేపట్టిన సర్వే పూర్తయింది.

**ఎలా చేశారంటే..**

కాకరవాయిలో 3,800 ఎకరాల భూమి, రెండు వేల మంది రైతులు ఉన్నారు. రెవెన్యూ సదస్సుల్లో సమస్యలపై ఈ గ్రామం నుంచే 600 దరఖాస్తులు వచ్చాయి. దీంతో పైలట్ సర్వేకు ఈ గ్రామాన్ని ఎంపికచేసి మే 15న ఏడు బృందాలతో ప్రక్రియ ప్రారంభించారు. ఏడు ఆధునిక రోవర్లతో అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. గుర్తించిన అంశాలను సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖకు పంపించి మాతృదస్త్రాల్లో ఉన్న వివరాలతో పోల్చుతున్నారు. తుది నివేదిక సిద్ధం చేసిన తర్వాత ప్రభుత్వ అనుమతితో కొత్త సర్వే పటాన్ని ఖరారు చేయనున్నారు.

**భూధార్‌కు మార్గం..**

కాకరవాయిలో సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడం, యాజమాన్య హక్కులు గందరగోళం వంటి సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. సాదాబైనామాలతో కొనుగోలు చేసినా హక్కులు రానివారూ ఉన్నారు. ఇలాంటి సమస్యలే రాష్ట్రమంతటా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ తరహాలో భూ ఆధార్(భూధార్) సంఖ్యతో కార్డును ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశం. గతేడాది భూ భారతి చట్టం(ఆర్వోఆర్– 2025)తో రిజిస్ట్రేషన్– మ్యుటేషన్‌కు భూమి సర్వే పటం(సబ్ డివిజన్) జత చేయడాన్ని తప్పనిసరి చేశారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే పటం ఆధారంగా రిజిస్ట్రేషన్– మ్యుటేషన్ పూర్తి చేసి భూధార్ సంఖ్యను జారీ చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. దీనికోసమే లైసెన్స్‌డ్ సర్వేయర్లు, గ్రామ పాలనాధికారుల ఎంపికను ప్రభుత్వం చేపట్టింది.

# చేనేత కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి వినతిపత్రం అందజేసిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ పెన్ పవర్:** వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5,000 మంది చేనేత కార్మికులు గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వస్త్రోత్పత్తి రంగానికి వెన్నెముకగా నిలుస్తున్నారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు,గురుకుల విద్యాసంస్థలు మరియు ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన బెడ్‌షీట్లు,కార్పెట్లు, యూనిఫాంలు తదితర వస్త్ర ఉత్పత్తులను నిరంతరంగా సరఫరా చేస్తూ వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నారు.

ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ఉపాధి, సంక్షేమం మరియు చేనేత రంగ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలని,వారి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

వినతిపత్రం అందజేశారు.

చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించడం ద్వారా వేలాది మంది చేనేత కార్మికుల ఉపాధిని పరిరక్షించవచ్చని మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# ఓయూలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఎన్ఎస్యుఐ జాతీయ నాయకులు కోట దుర్గ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోట దుర్గ రాజ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ రానున్న రోజుల్లో ప్రధానమంత్రి అవడం ఖాయం అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త, ఎన్ఎస్యుఐ నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే అది కేవలం రాహుల్ గాంధీ వల్లనే సాధ్యమవుతుందన్నారు...

# తుర్కయంజాల్లో రెవెన్యూ అధికారులపై మహిళ దౌర్జన్యం.. తీవ్ర కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్డీవో ఆదేశాల మేరకు వివాదాస్పద భూమిని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన అబ్దుల్లాపూర్మెట్ ఆర్ఐ, జీపీవోలపై మహిళ దాడి కి దిగింది. ఆర్ఐ ప్రేమ్ కుమార్ గల్లా పట్టుకుని బండబూతులు తిడుతూ లాక్కెళ్ళింది. “మీరు అధికారులని గ్యారంటీ ఏంటి?” అంటూ ఆర్ఐ గుర్తింపు కార్డును లాక్కుని దుర్భాషలాడిన వైనం. అబ్దుల్లాపూర్ మెట్ మండలం తుర్కయంజాల్ లోని సర్వే నంబర్ 338లో ఉన్న 1810 గజాల భూమిపై వివాదం వుంది.

వివాదాస్పద భూమిని ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేయడంతో రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. ఎంత నచ్చజెప్పినా వినకుండా: తాము ఉన్నతాధికారుల ఆదేశాలతోనే వచ్చామని మొత్తుకున్నా వినకుండా మహిళ రెచ్చిపోయింది. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐ ప్రేమ్ కుమార్ ఫిర్యాదు చేసారు. తనను కులం పేరుతో దూషించారంటూ ఆదిబట్ల పోలీసులకు జీపీవో హన్మంతు ఫిర్యాదు చేసారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

.

# ఓయూ లో విద్యార్థుల నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించి యువత భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు టి కే శివకుమార్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా నిరుద్యోగ హామీలను గుర్తుచేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరుద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత తరపున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూనే... ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీల వివరాలతో కూడిన హార్డ్ డిస్క్ ను రాహుల్ గాంధీకి బహుమతిగా పంపిస్తున్నట్లు తెలిపారు. బహుమతి అందిన తర్వాతనైనా హామీలను గుర్తు చేసుకుని తెలంగాణ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు...

# బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి సదస్సు గోడ పత్రిక ఆవిష్కరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 22వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి సదస్సును నిర్వహించనున్నారు. సదస్సుకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించారు. బీఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ముఖ్యఅతిథిగా హాజరై గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా విఫలమైందని మండిపడ్డారు. ముఖ్యంగా 10 సంవత్సరాలలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికై ఈనెల 22వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో ఠాగూర్ ఆడిటోరియంలో బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఓయూ విద్యార్థి సదస్సును విద్యార్థులు, విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు...

# సీఎం ప్రజావాణి “ లో ప్రజల సమస్యల పరిష్కారం బాగుంది ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కితాబు

**హైదరాబాద్ పెన్ పవర్:** బేగంపేట్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరుగుతున్న “ సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి “ ని భువనగిరి ఎం.పీ. చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణిలోని ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి డెస్క్ అధికారులతో కిరణ్ కుమార్ రెడ్డి ఇంటరాక్ట్ అయ్యారు. ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును, ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం తీరును చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రజావాణిలో ప్రజల సమస్యలు 74 శాతం పరిష్కారం కావడం పట్ల చామల కిరణ్ కుమార్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింత పక్కాగా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రజావాణి అధికారులకు సూచించారు. సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, వివిధ శాఖల అధికారులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి సీఎం ప్రజావాణి అమలు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ ఐ సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి, పద్మా రాణి కర్రి, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి: మంత్రి సీతక్క

**హైదరాబాద్ పెన్ పవర్:** చాంద్రాయణగుట్టలో అంగన్వాడీ–కమ్–పాలన కేంద్రం ప్రారంభం చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని అరుంధతి నగర్‌లో అంగన్వాడీ కేంద్రం–కమ్–పాలన (డే కేర్) కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి, వారి అభ్యాస ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా..బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తొలి పాలన కేంద్రాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సంరక్షణ, పోషకాహారం, ఆటల ద్వారా అభ్యాసం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ నర్సరీల్లో చేర్పించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రజల ఇంటి వద్దకే నాణ్యమైన సేవలను తీసుకువచ్చిందన్నారు.

అంగన్వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులందరికీ సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ డే కేర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, పిల్లల సంరక్షణ కోసం మహిళలు తమ ఉద్యోగాలు, ఉపాధిని వదులుకోవాల్సిన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు చిన్నారుల సంరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పాలన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు చిన్నారులను ఈ కేంద్రాల్లో ఉంచి వారి సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆటవస్తువులు, అభ్యాస సామగ్రి, పోషకాహారం అందుబాటులో ఉంచామని చెప్పారు.



చిన్నారి జీవితంలోని మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఆ దశలో మెదడు ఎదుగుదలతో పాటు శారీరక, మానసిక వికాసం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అందుకే గర్భధారణ దశ నుంచి తొలి రెండు సంవత్సరాల వరకు తల్లులు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు, సంరక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.

అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేస్తూ పిల్లలకు విద్యతో పాటు పోషకాహారం, అల్పాహారం కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ నర్సరీలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతూ 57 రకాల ఆటవస్తువులు, యూనిఫాంలు, నాణ్యమైన ప్రీ–స్కూల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.మహిళల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ. 61 వేల కోట్లకు పైగా రుణాలు అందించామని తెలిపారు. లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు బలంగా ఉన్నట్లే పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, టీనేజ్ బాలికల కోసం ప్రత్యేక మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలనతో పాటు నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, “అమ్మకు అక్షరమాల” కార్యక్రమం ద్వారా ఇప్పటికే ఆరు లక్షల మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని చెప్పారు.పాలన కేంద్రాల్లో చిన్నారుల సంరక్షణ, పోషకాహారం, ప్రారంభ అభ్యాసం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. “మీ పిల్లలను మాకు అప్పగిస్తే, మీరు నిశ్చింతగా మీ పనులు చేసుకొని రావచ్చు. ప్రతి చిన్నారికి సురక్షిత బాల్యం, ప్రతి తల్లికి భరోసా కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం” అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, ఎస్బీఐ ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కవ్వంపల్లి ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**కరీంనగర్: పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ లో కాంగ్రెస్ పక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. ఈ దిశగా పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో గట్టి కృషి చేయాలన్నారు. దేశ రాజకీయాల్లో విలువలతో కూడిన నాయకత్వానికి రాహుల్ గాంధీ ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో దేశానికి దూరదృష్టి కలిగిన, ప్రజల సంక్షేమం పట్ల అంకితభావంతో పనిచేసే నాయకత్వం అవసరమని, ఆ లక్షణాలన్నీ రాహుల్ గాంధీలో మెండుగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశంలోని యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజల మధ్యకు తీసుకెళ్లిన నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సమానత్వం సందేశాన్ని బలంగా చాటారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను

గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త

అంకితభావంతో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి, రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరెపల్లి రాజేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, జగన్, వినోద్ సింగ్,నర్సింహ,ఓం ప్రకాశ్, చంద్రయ్య, చంద్రశేఖర్ తోపాటు పలు జిల్లా అధ్యక్షులు, బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మద్దెల వెంకట సతీష్ బాబు బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరసరావుపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మద్దెల వెంకట సతీష్ బాబు గురువారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ పథకాలు, సేవలను సామాన్య ప్రజలకు అందించేలా చూడాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఆసుపత్రిలో వైద్యంతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం డాక్టర్ సతీష్ బాబు మాట్లాడుతూ, పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రాంత ప్రజలకు ఏరియా ఆసుపత్రి కీలక వైద్య కేంద్రంగా సేవలందిస్తోందన్నారు. ప్రతిరోజూ వందలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన రోగులు ఆసుపత్రికి వస్తున్నారని, వారికి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రోగికి సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రి సేవల ప్రమాణాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ముఖ్యంగా గర్భిణీ విభాగంలో సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గర్భిణీలకు అవసరమైన వైద్య సేవలు, సలహాలు, పర్యవేక్షణను సమర్థవంతంగా అందిస్తామన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల విస్తరణ, రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పన, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెడతానని డాక్టర్ సతీష్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే వీపులు సున్నం చేస్తాం: సీఎం రేవంత్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ భూముల రక్షణ, కబ్జాల నిరోధానికి ఏర్పాటు చేసిన 'హైడ్రాపై కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా పేద ప్రజలను కాదని, పెద్ద కబ్జాదారులను లక్ష్యంగా చేసుకుంటుందని స్పష్టం చేశారు.

ఎల్బీనగర్‌లో పదేళ్లుగా అభివృద్ధి లేదని, గుర్రంగూడ ఎకో పార్కును కబ్జా చేయాలని చూసినా 424 ఎకరాల భూమిని కాపాడామని తెలిపారు. దేవుడి భూములను కూడా వదలడం లేదని, ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే వీపులు సున్నం చేస్తామని హెచ్చరించారు.

# మ్యారేజ్ పై వార్ ఎఫెక్ట్...

హైదరాబాద్, జూన్ 19, (న్యూస్ పల్స్)
తెలుగు రాష్ట్రాల్లో శుభకార్యాల సీజన్ మళ్లీ మొదలైంది. అధిక జేష్ట మాసం ముగిసింది. దీంతో శుభకార్యాలు మొదలయ్యాయి. జూలై 9 వరకు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు సంబంధించి అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. దాదాపు నెల రోజుల తర్వాత మళ్లీ శుభకార్యాల సీజన్ మొదలైంది. ఈనెల 15 నుంచి జూలై 9 వరకు పరిమిత శుభ ముహూర్తాలు ఉండడంతో.. వివాహాలు, గృహప్రవేశాలకు ముహూర్తాలు డిసైడ్ చేస్తున్నారు. జూలై 15 నుంచి ఆషాడమాసం, గురు మూఢం ప్రారంభం అవుతుంది. మళ్లీ ఆగస్టు 15 వరకు ముహూర్తాలు లేవు. మళ్లీ శ్రావణమాసంలోనే ముహూర్తాలు ఉన్నాయి.జూలై 9లోపు వేలాది వివాహాలు నిశ్చయం అయినట్లు తెలుస్తోంది తెలుగు రాష్ట్రాల్లో. జూన్ తో పాటు జూలై నెలలో ఈ ముహూర్తాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా జూన్ 19, 20, 21, 22, 24, 25, 26, 27, 28 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మరోవైపు జూలైలో 1, 6, 7, 9 తేదీలు కూడా ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. పరిమిత ముహూర్తాలు కావడంతో అటు పురోహితులు, ఫంక్షన్ హాల్, క్యాటరింగ్ కు విపరీతమైన డిమాండ్ ఉంది. ముఖ్యంగా పురోహితులను ముందే మాట్లాడుకుంటున్నారు.మార్కెట్లో అన్ని రకాల ధరలు పెరిగాయి. దానికి కారణం యుద్ధం గా చూపుతున్నారు.



ఇప్పుడు వివాహాలకు సంబంధించిన అన్ని రకాల ధరల పెరుగుదలకు యుద్ధం కారణమని చెబుతున్నారు. డెకరేషన్ తో పాటు ఇతర ఖర్చులు కూడా పెరిగాయి. డీజిల్ తో పాటు పెట్రోల్ ధరలు పెరగడంతో వాహనాల కిరాయి పెంచేశారు. నిత్యవసర వస్తువులతో పాటు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు పెరగడంతో.. క్యాటరింగ్ నిర్వాహకులు తమ ధరలను పెంచేశారు. ఇక ప్లేటు భోజనం ధర కూడా పెరిగింది. గతంలో ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసేవారు. ఇప్పుడు పది లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. శుభకార్యాలు అంటేనే ప్రధానంగా బంగారం కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. కానీ సామాన్యులు కొనలేని స్థితిలో బంగారం ధరలు ఉన్నాయి. సాధారణంగా ఒక వివాహానికి ఐదు నుంచి పది తులాల బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఆ లెక్కన కూడా దాదాపు 20 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుంది వివాహాలకు. ఇలా ఎలా చూసుకున్నా శుభకార్యాలకు సైతం యుద్ధం ఎఫెక్ట్ తప్పడం లేదు.

# ప్రమాదకరంగా క్యాట్ ఫిష్

**మహబూబ్ నగర్, జూన్ 19 (న్యూస్ పల్స్)**
ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే క్యాట్‌ఫిష్ పెంపకంపై ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ వనపర్తి జిల్లాలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా అక్రమ చెరువులు వెలిసినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. వీటికి కుళ్లిన చికెన్ వేస్టేజీని ఆహారంగా వేస్తుండటంతో చుట్టుపక్కల పొలాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. తక్కువ ఖర్చుతో కోట్లు సంపాదించవచ్చుననే ఆశతో ఏపీకి చెందిన కొందరు వ్యాపారులు ఇక్కడ చేపలను పెంచి విజయవాడ, వైజాగ్, బెంగళూరులకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు తెచ్చిపెడుతుందనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాట్‌ఫిష్ (ఆఫ్రికన్ మాగుర్) పెంపకంపై దేశవ్యాప్తంగా కఠినమైన నిషేధం విధించాయి. అయితే.. చట్టాల పట్ల ఏమాత్రం భయం లేకుండా, అధికారుల కళ్లు గప్పి వనపర్తి జిల్లాలో క్యాట్ ఫిష్ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆసరాగా చేసుకుని.. కేవలం ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా క్యాట్‌ఫిష్ పెంపకం చెరువులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లోనూ ఈ రకమైన నిషేధిత చేపల చెరువులు జోరుగా సాగుతున్నాయి. గతంలో మత్స్యశాఖ అధికారులు నామమాత్రంగా కొన్ని చెరువులను ధ్వంసం చేసి చేతులు దులుపుకోవడంతో నిర్వాహకులు మళ్లీ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు.వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, పెబ్బేరు మున్సిపాలిటీల పరిధిలోని చికెన్ సెంటర్ల నుంచి సేకరించే వ్యర్థాలను ఈ క్యాట్‌ఫిష్‌లకు ప్రధాన ఆహారంగా వాడుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రం నుంచే ప్రతిరోజూ దాదాపు 15 మెట్రిక్ టన్నుల చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు, ఆ చెత్తను మున్సిపల్ యార్డులకు తరలించకుండా ఈ అక్రమ పెంపకందారులకు అమ్మేస్తున్నారు. సాధారణ దాణా కంటే ఈ కుళ్లిన మాంసాన్ని తినడం వల్ల క్యాట్‌ఫిష్‌లు చాలా తక్కువ కాలంలోనే ఊహించని విధంగా బరువు పెరుగుతాయి. ఇతర రకాల చేపలేవీ ఈ మాంస వ్యర్థాలను ముట్టవు. అయితే.. టన్నుల కొద్దీ చికెన్ వ్యర్థాలను చెరువుల వద్ద కుప్పలుగా వేస్తుండటంతో చుట్టుపక్కల ప్రాంతాలు నరకప్రాయంగా మారుతున్నాయి. తీవ్రమైన దుర్వాసనతో ఊపిరి పీల్చుకోలేకపోతున్నామని, పంట పొలాల్లో పనులు చేసుకోలేకపోతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అక్రమ దందాను నడిపిస్తోంది పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు బడా ఆక్వా వ్యాపారులని సమాచారం. వనపర్తిలోనే పదుల సంఖ్యలో చెరువులను లీజుకు తీసుకుని స్థానిక యంత్రాంగాన్ని మేనేజ్ చేస్తూ వీరు కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. సాధారణ చేపలు మార్కెట్లో కిలో రూ. 150 వరకు పలుకుతుండగా.. ఈ క్యాట్‌ఫిష్‌లను హోల్‌సేల్‌గానే కిలో రూ. 100 పైచిలుకు ధరకు అమ్ముతున్నారు. ఇక్కడ పెంచిన చేపలను విజయవాడ, విశాఖపట్నం, రాయలసీమ జిల్లాలతో పాటు బెంగళూరు మహానగరానికి భారీ కంటైనర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. క్యాట్‌ఫిష్‌లను తినడం వల్ల మానవులలో క్యాన్సర్, కాలేయ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి టాస్క్‌ఫోర్స్ రంగాన్ని రంగంలోకి దింపి ఈ చెరువులను శాశ్వతంగా మూసివేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు


# నోరు తెస్తున్న తంటా
# తలనొప్పిగా మారుతున్న రేవంత్ మాటలు



**హైదరాబాద్, జూన్ 19, పెన్ పవర్:**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమర్థుడైన వ్యూహకర్త, అంతకుమించి అద్భుతమైన వాగ్ధాటి గల నేత అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నా, తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టినా.. ప్రత్యర్థులపై తన మాటల ఈటెలతో విరుచుకుపడటంలో ఆయన శైలే వేరు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ చాతుర్యానికి, వాక్చాతుర్యానికి సమతూగగల ఏకైక నేతగా రేవంత్ రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, ఇటీవల కాలంలో ఆయన చేస్తున్న కొన్ని వ్యాఖ్యలు, ప్రసంగాలు ఊహించని విధంగా మిస్ ఫైర్ అవుతూ సొంత పార్టీకే ఇరకాటాన్ని తెచ్చిపెడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దూకుడు స్వభావంతో ప్రత్యర్థులను అణచివేయాలని చూసే క్రమంలో కొన్నిసార్లు వివాదాస్పద పోలికలను తెరపైకి తెస్తున్నారు. హైడ్రా విషయంలో హిట్లర్ ప్రస్తావన తీసుకురావడం జాతీయ స్థాయిలో కలకలం రేపింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రి, క్రూరత్వానికి మారుపేరైన హిట్లర్ స్ఫూర్తిగా హైడ్రాను ఏర్పాటు చేశానని చెప్పడం అటు ప్రతిపక్షాలు, ఇటు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అధిష్టానం సైతం అప్రమత్తమై నష్టనివారణ చర్యలు చేపట్టాల్సి వచ్చింది. చివరికి ఈ వ్యాఖ్యలపై సీఎం వివరణ ఇచ్చుకుంటూ నాలిక్కరుచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా మాట్లాడే క్రమంలో రేవంత్ రెడ్డి కొన్నిసార్లు ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వివాదాన్ని రాజేస్తున్నారు. కేంద్ర నిధుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడం వరకు సరే.. కానీ, దానిని తీవ్రమైన ప్రాంతీయ వాదంగా మార్చడం వల్ల ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ పార్టీగా దేశవ్యాప్తంగా ఓట్లు రాబట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌కు, ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తోంది. ప్రాంతీయ పార్టీల తరహాలో సీఎం మాట్లాడటం జాతీయ పార్టీ సిద్ధాంతాలకే సమస్యగా మారుతోంది.రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటల్లో అత్యంత వివాదాస్పదమైనది బీహార్ వలస కార్మికులు, అక్కడి నేతలపై చేసిన వ్యాఖ్యలు. బీహారీ డీఎన్ఏ ను ప్రస్తావిస్తూ ఆయన చేసిన కామెంట్స్ జాతీయ మీడియాలో హెడ్‌లైన్స్‌గా మారాయి. ఈ వ్యాఖ్యలతో అటు బీహార్‌తో పాటు ఉత్తర భారత దేశంలో కాంగ్రెస్ మిత్రపక్షాలైన ఆర్జేడీ, జేడీయూ వంటి పార్టీలు కూడా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఇండియా కూటమిని బలోపేతం చేయాలని మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రయత్నిస్తుంటే.. రేవంత్ వ్యాఖ్యలు ఆ కూటమి ఐక్యతనే దెబ్బతీసేలా ఉన్నాయని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకున్నారు. తెలంగాణ సరిహద్దులు దాటి పక్క రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కూడా రేవంత్‌కు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరాన్ని ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో దుమారం రేపాయి. తెలంగాణ అభివృద్ధిని చూపిస్తూ పొరుగు రాష్ట్రాన్ని తక్కువ చేసి మాట్లాడటం వల్ల ఏపీలోని కాంగ్రెస్ క్యాడర్‌కు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే ఏపీలో ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు మరింత నష్టం చేకూరుస్తున్నాయని అక్కడి నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేసే వరకు పరిస్థితి వెళ్లింది.రేవంత్ రెడ్డి కంఫర్ట్ జోన్ ఎప్పుడూ తెలంగాణ సెంటిమెంట్, రైతులు, పేదల సంక్షేమం, కేసీఆర్ మార్క్ పాలనపై విమర్శల చుట్టూనే ఉంటుంది. ఈ పిచ్‌పై రేవంత్ సిక్సర్లు కొట్టగలరు. కానీ, ఎప్పుడైతే ఆయన ఈ పరిధి దాటి అంతర్జాతీయ, జాతీయ సామాజిక సమీకరణాలు,

ఇతర రాష్ట్రాల సంస్కృతులపై మాట్లాడుతున్నారో అప్పుడే సెల్ఫ్ గోల్స్ అవుతున్నాయి. కేసీఆర్‌ను ఢీకొట్టే క్రమంలో తన మాటల పదును తగ్గకూడదనే తాపత్రయమే ఆయన్ని అనవసర పరిధి దాటిన రాజకీయాల్లోకి నెడుతోందని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఖరిపై ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ క్యాడర్‌లోనూ అంతర్గత మథనం మొదలైంది. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలు, పారిశ్రామిక అభివృద్ధి, హైదరాబాద్ గ్లోబల్ ఇమేజ్‌ను పెంచడం వంటి కీలక బాధ్యతలు సీఎంపై ఉన్నాయి. ఇలాంటి తరుణంలో అనవసరమైన వ్యాఖ్యలతో జాతీయ మీడియాలో ప్రతికూల వార్తల్లో నిలవడం కంటే.. రాష్ట్ర పాలనపైనే పూర్తి దృష్టి పెట్టాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నాయి.

## పటాన్ చెరు పట్టణంలో హైడ్రా దూకుడు.




**సంగారెడ్డి పెన్ పవర్:** పటాన్ చెరు పట్టణంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ఆధారిటీ ( ఐలా) సంబంధించిన 1599 గజాల స్థలానికి హైడ్రా అధికారులు కంచె వేసారు. ఆదే స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ, కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని నిలుపు చేసి చుట్టు కంచ వేసారు. గురువారం ఉదయమే ఈ స్థలంలో నిర్మిస్తున్న గుడిని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పరిశీలించారు. తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## ఆశ్రయ్-ఆకృతి పాఠశాలలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పాల్గోన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**హైదరాబాద్ పెన్ పవర్:** శుక్రవారం నాడు జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్ కాలనీలో ఆశ్రయ్-ఆకృతి పాఠశాలలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
దివ్యాంగ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వారికి కేక్ తినిపించి జన్మదిన వేడుకలను ఆనందంగా జరిపారు. వినికిడి, మాటల సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఆశ్రయ్ ఆకృతి సంస్థ అందిస్తున్న సేవలను ఎమ్మెల్యేఅభినందించారు.విద్య, వైద్యం, స్కిల్ డెవలప్మెంట్ రంగాల్లో సంస్థ విశేష సేవలు అందిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది చిన్నారులకు ఈ సంస్థ ద్వారా సహాయం అందుతోందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సంస్థ అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరింత ప్రోత్సాహం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సమాజంలోని ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రయ్ ఆకృతి ఫౌండర్ డాక్టర్ డి.పి.కే. బాబు, డైరెక్టర్ శశికళ, ప్రిన్సిపల్ సారిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# మానేరు జలాశయాల్లో భారీగా తగ్గిన నీటి నిల్వలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మానరు జలాశయాల్లో నీటి నిల్వలు భారీగా తగ్గిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న మానేరు జలాశయాల్లో ఆందోళనకర స్థాయికి నీటినిల్వలు చేరాయి. అప్పర్ మానేరులో 2 టీఎంసీకు గాను 0.661 టీఎంసీలు, మిడ్ మానేరులో 27.5 టీఎంసీకు గాను 7.4 టీఎంసీలు, లోయర్ మానేరులో 24 టీఎంసీలకు గాను 6 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో, ఖరీఫ్ సీజన్ వేళ రైతులు కలవరపడుతున్నారు. దీనికి తోడు ఎల్నినో ప్రభావంతో వర్షాలు తగ్గే సూచనలు కనిపిస్తుండటంతో సాగునీరు, తాగునీటి నీటికి తీవ్ర ఇబ్బందులు తప్పవని అంచనా వేస్తున్నారు.

# కస్టోడియల్ మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్ పెన్ పవర్:**
పోలీసుల అదుపులో జరుగుతున్న మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు నిచ్చింది. కస్టడీలో కొట్టి చంపడం పోలీసుల అధికారక విధి కాదని స్పష్టం చేసింది. నిందితులైన పోలీసులను శిక్షించడానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరం లేదు. సభ్య సమాజంలో కస్టడీ మరణం ఘోరమైన నేరమని వ్యాఖ్యానించింది.ఒక కస్టోడియల్ మృతి కేసులో పోలీసుల పిటిషన్ ను కొట్టివేస్తూ జస్టిస్ గజేంద్రసింగ్ తీర్పు వెలువరుస్తూ, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, రికార్డులు ఫోర్జరీ చేయడం పోలీసుల విధి నిర్వహణ కిందకు రావని పేర్కొన్నారు.

## సింగరేణి పైన బీజేపీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి
## సింగరేణిపైన మాట్లాడే నైతిక అర్హత బీజేపీకి లేదు
## ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణిలో పర్యటించే హక్కు బీజేపీ కి లేదు. సింగరేణి పైన బీజేపీ చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మండిపడ్డారు.
బొగ్గు బ్లాక్ లను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ సింగరేణికి వెళ్తోంది. బీజేపీ ఎంత దౌర్భాగ్య స్థితిలో ఉందో దీని వల్ల అర్థమౌతోంది. సింగరేణి పైన బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.
రాజకీయ రహస్య మిత్రులు ఇద్దరు. సింగరేణి చుట్టు రాజకీయాలు చేస్తున్నారు. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తున్న విధానంపైన బీజేపీ సమాధానం చెప్పాలి. సింగరేణి ని ప్రైవేటీకరణ కు బీజేపీ ప్రభుత్వ ప్రయత్నాలపైన కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి. బొగ్గు గనుల ను ప్రైవేటీకరణ చేస్తున్న బీజేపీకి బొగ్గుల నిల్వలపైన మాట్లాడే అర్హత ఉంది. సింగరేణి ప్రైవేటికరణను అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ. సింగరేణిని ఆదుకుంటున్నది కాంగ్రెస్ పార్టీ. బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. సింగరేణి భక్షకులను కార్మికులు నమ్మరు. మీలాంటి వాళ్లను కార్మికులు నమ్ముతారనుకోవడం పిచ్చి భ్రమ.. అందుకే చిల్లర రాజకీయాలు మానండని అన్నారు.

# రాజేంద్రనగర్లో కారులో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** బుద్వేల్ పిడిపి చౌరస్తా వద్ద కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫ్లైఓవర్ కింద రద్దీ ప్రాంతంలో ఘటనతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఇంజిన్ భాగంలో ప్రారంభమైన మంటలులలో కారు పూర్తిగా దగ్ధమైయింది. దట్టమైన పొగలతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ను క్లియర్ చేసారు. కారులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంజిన్ ఓవర్హీట్ లేదా షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానం.

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** జులై 1 నుంచి 4వ తేదీ వరకు కర్నూలు నగరంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని కోరుతూ పల్నాడు జిల్లా గురజాల పట్టణంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం నందు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చేటువంటి హామీలు అమలు చేయకుండా రాష్ట్రమంతా ఏదో పెద్ద చేశామన్న ఆనందంలో సంబరాలు చేసుకుంటున్నారు అని అన్నారు మాకు కావాల్సింది సంబరాలు కాదు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వంద రోజుల్లో పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చే నేటికి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇంతవరకు జీవో నెంబర్ 77 రద్దు చేయలేదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ పైన మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు శిథిలావ్యవస్థలోకి చేరాయి అన్నారు విద్యార్థులు చదువుకుంటున్న సందర్భంలో పైన గోడలకు ఉన్నటువంటి పెచ్చులు ఊడి విద్యార్థుల తలలు పగిలేతట్టువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో కనబడతా ఉంది వాటి మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..

## ఎదురెదురుగా ఢీకొట్టుకున్న రెండు మారుతి కార్లు

## ముగ్గురు మృతి, ముగ్గురికి గాయాలు

**నల్గొండ పెన్ పవర్:** పెద్దావూర మండలం, రామన్నగూడెంలో ఎదురెదురుగా రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జున సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## గర్భిణీ చితాభస్మంలో బయటపడ్డ కత్తెర

### వైద్యుల నిర్లక్ష్యానికి తల్లి, బిడ్డ మృతిచెందిన ఘటనలో వెలుగులోకి కీలక అంశాలు

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:** వైద్యుల నిర్లక్ష్యానికి తల్లి, బిడ్డ మృతిచెందిన ఘటనలో వెలుగులోకి కీలక అంశాలు వెలుగుచూసాయి. గుండాల మండలం శంభునిగూడెం గ్రామంలో వనజ(20) అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సు సాధారణ కాన్పు చేసింది. నర్సు అవగాహన రాహిత్యం వల్ల శిశువు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి మరణించింది.అయితే తల్లీబిడ్డలకు కర్మకాండ నిర్వహించాక, తల్లి చితాభస్మం సేకరిస్తుండగా అందులో శస్త్ర చికిత్సకు వాడే కత్తెర బయటపడడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తల్లి, బిడ్డ ప్రాణాలు కోల్పోయారనేందుకు ఇదే నిదర్శనం అంటూ కుటుంబ సభ్యుల ఆగ్రహం వ్యక్తం చేసారు. మరోవైపు ఆసుపత్రిలో సాధారణ ప్రసవమే జరిగిందని, కత్తెర ఎలా వచ్చిందో తమకు తెలియదని వైద్యాధికారులు చెబుతున్నారు.

# అధికారంలో ఉన్నవాళ్లను కంగారు పెడుతుందేంటీ..?

**హైదరాబాద్, జూన్ 19, పెన్ పవర్:** సమస్యల పరిష్కారం కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్ దగ్గరకు ఎందుకు క్యూ కడుతున్నారు,,? ఇంకా మూడేళ్ళ పాలన మిగిలి ఉండగానే ఏంటీ పరిస్థితి మనం ప్రతి రోజు అర్జీలు తీసుకుంటున్నాఎందుకు ఇలా జరుగుతోంది ఎక్కడ తేడా కొడుతోంది? ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కూటమి వర్గాల్లో ఈ తరహా చర్చలు పెరిగిపోతున్నాయట. సమస్యలు ఉంటే పరిష్కారం కోసం అధికారంలో ఉన్నవాళ్ళ దగ్గరికి రావాలిగానీ ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడిని కలిసి విన్నవించుకోవడం ఏంటంటూ కూటమి నాయకులు ఆలోచనలో పడ్డట్టు తెలుస్తోంది. ఇప్పటికి అయ్యింది.. రెండేళ్ళు మాత్రమే. ఇంకా మూడేళ్ళ పాలన మిగిలే ఉంది. అయినా సరే ఇంత త్వరగా ఎందుకు రియాక్ట్ అవుతున్నారు, వాళ్లకు జగన్ ఎందుకు గుర్తుకు వస్తున్నాడంటూ ప్రభుత్వ పెద్దలు తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. మొన్నటిదాకా అధికారంలో ఉన్న పార్టీ, ప్రస్తుతం పోరుబాట పడుతోంద కాబట్టి ఏవో చిన్నా చితకా ఇబ్బందుల గురించి చెప్పుకుంటే సరేగానీ రకరకాల సమస్యల పేరుతో బాధితులంతా వరుసబెట్టి జగన్‌ను ఎందుకు కలుస్తున్నారంటూ ఆరా తీయడం మొదలైందని చెప్పుకుంటున్నారు.ముందు అమరావతి రైతులు, తర్వాత ఆరోగ్య శ్రీ నిధులపై ఆశా యూనియన్, డీఎస్సీ 2026 పరీక్ష రాసి ఉద్యోగాలు రాని అభ్యర్థులు, రాజమండ్రి కల్తీ పాల బాధితులు, తాజాగా ఆక్వా రైతులు ఇలా సమస్యలు ఉన్నవారంతా వరుసగా జగన్‌ను కలవడం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. అటు డీఎస్సీ విషయంలో వైసీపీ దూకుడుగా వెళ్తోందా.. అనే చర్చ కూడా కూటమిలో జరుగుతోందట. ప్రతి వారం.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు, లోకేష్ అర్జీలు తీసుకుంటున్నారని... అదే విధంగా మంత్రులు ఎవరో ఒకరు అందుబాటులో ఉంటున్నారని..అయినాసరే ఇదేం పరిస్థితి అని మాట్లాడుకుంటున్నట్టు సమాచారం. ఒకవేళ జగన్ పిలిపించుకుని మాట్లాడుతున్నారని అనుకుందామనుకున్నా.. ఇలా వరసగా అంతా వెళ్లడాన్ని మాత్రం ప్రత్యేకంగానే చూడాలంటున్నాయి కూటమి వర్గాలు.రెండేళ్ళకే పరిస్థితి ఇలా ఉంటే.. ముందు ముందు ఇంకెలా మారుతుందన్న చర్చలు సైతం నడుస్తున్నాయి. వైసీపీ నిర్వహించి వెన్నుపోటుకు రెండేళ్ళ కార్యక్రమం విజయవంతం అయిందని కూడా కూటమిలో గుసగుసలాడుకుంటున్నారట. వైసీపీ క్యాడర్ పెద్ద సంఖ్యలో బయటకు రావడం, కొన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమం సక్సెస్ అవడం తమకు ఇబ్బందేనని మాట్లాడుకుంటున్నట్టు సమాచారం. ఒకవైపు ప్రతిపక్షం నిర్వహించిన కార్యక్రమం సక్సెస్ అవడం, మరోవైపు వివిధ వర్గాల బాధితులు జగన్‌ను కలవడం కూటమి నేతల్ని ఆలోచనలో పడేస్తోందట. జగన్ దగ్గరకు ఇలాగే బాధితులు క్యూ కడుతుంటే. సమస్యల పరిష్కారం సంగతి తర్వాతగానీ అసలు రాష్ట్రంలో ఇన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయా అన్న చర్చ మొదలవుతుందని, అంతిమంగా అది తమకు నష్టం చేస్తుందన్నది కూటమి నాయకుల భయంగా తెలుస్తోంది

# బీఆర్ఎస్ అప్ డేటెడ్...

**హైదరాబాద్, జూన్ 19, పెన్ పవర్:** బీఆర్ఎస్ కోసం ఎన్నికల వ్యూహకర్తని నియమించుకోవాలన్న ప్రతిపాదన వచ్చిందా? ఆ విషయమై పార్టీలో గట్టి చర్చే జరిగిందా? సీనియర్ లీడర్స్ ఎలాంటి ప్రతిపాదన చేశారు? అందుకు కేసీఆర్ ఏమన్నారు? అందుసు సంబంధించి గులాబీ దళంలో జరుగుతున్న డిస్కషన్స్ ఏంటి? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్ళ సమయం ఉంది. ప్రతిపక్ష పార్టీలు ఇప్పట్నుంచే ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఎలక్షన్ ప్లానింగ్ మొదలు పెట్టేశాయి. ఈ సందర్భంగానే ఎన్నికల వ్యూహకర్తల ప్రస్తావన ఆసక్తికరంగా మారింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో ఈ విషయమై హాట్ హాట్ చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని పట్టు మీదున్న గులాబీ పార్టీ అందుకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ట్రెండ్‌కు తగ్గట్టు పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఒక కీలకమైన వ్యూహకర్తను నియమించుకోవడానికి ప్లాన్ చేశారట సీనియర్స్, ముఖ్య నాయకులు అంతా కలిసి.ముందు వాళ్ళలో వాళ్లు మాట్లాడుకుని ఒక అవగాహనకు వచ్చి.. ఫైనల్‌గా ఇదే విషయాన్ని అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్టు తెలుస్తోంది. వాళ్ళు మనకు మించిన వ్యూహకర్తలా అని అన్నట్టు చెప్పుకుంటున్నారు. పార్టీ నేతల ప్రతిపాదనను కేసీఆర్ తిరస్కరించడానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నట్టు చెబుతున్నారు పార్టీ నేతలు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు పోరాటం చేయడం, ఆ తర్వాత పదేళ్లు అధికారంలో ఉండటంతో పాటు టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాల్లోకి కూడా వెళ్ళేలా ప్లాన్ చేశారు కేసీఆర్. వివిధ రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడంతోపాటు కేంద్రంలో అధికారం దిశగా పావులు కదిపారాయన. అంత కీలకమైన అలాంటి సమయంలోనే ఎలాంటి వ్యూహకర్తని పెట్టుకోలేదు, ఇప్పుడు మనం వ్యూహకర్తని అంటూ నియమించుకుంటే ఇక ఏదీ మన చేతిలో ఉండదు, పార్టీ మొత్తం వాళ్ళు చెప్పినట్టే నడవాల్సి ఉంటుంది. పార్టీ చేసే కార్యక్రమాలు, పోరాటాల దగ్గర నుంచి ఎన్నికల ముందు సర్వేలు చేసి టికెట్లు ఇచ్చే వరకు ఏదీ మన చేతిలో ఉండదు. పూర్తి బాధ్యతలు స్ట్రాటజిస్ట్‌కు అప్పచెబితేనే వాళ్లు ఆ పని చేస్తారు. అలా ఏదీ మన చేతిలో లేనప్పుడు వాళ్లతో మనకు అవసరం లేదని అన్నట్టు తెలుస్తోంది. ఒక్కరితో మొదలైన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసే వరకు పోరాడడం, పదేళ్ల పాటు అధికారంలో ఉండే విధంగా వ్యూహాలు రూపొందించిన తాను కొత్తగా ఎవరో మరో వ్యక్తి వచ్చి చెబితే కార్యక్రమాలు చేయాలా అంటూకేసీఆర్ సున్నితంగా తిరస్కరించినట్టు చెబుతున్నారు. ఇక అధికారంలోకి రావడానికి రెండో అంశాన్ని కూడా కేసీఆర్ నేతలకు వివరించినట్టు తెలుస్తోంది. ఇప్పుడు పవర్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని,ఆ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, తాము అధికారంలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను గుర్తు చేయడంలాంటి వాటితోనే తేలిగ్గా గెలుస్తామని చెప్పినట్టు తెలిసింది. అయితే గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే... ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కొన్ని రోజులపాటు సేవలు అందించారు. అప్పుడు పీకే చెప్పిన కార్యక్రమాలు నచ్చకపోవడంతో కేసీఆర్ ఆయన్ని దూరం పెట్టేశారట. అయితే అది బీఆర్ఎస్ అధికారంలో స్వింగ్ లో ఉన్న టైం అని, కానీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి కాంగ్రెస్, బీజేపీలను ఎదుర్కోవాలంటే వ్యూహకర్త అవసరం అన్న వాదనని సీనియర్ నేతలు కొందరు సమర్థిస్తున్నారట. మరికొంతమంది మాత్రం కేసీఆర్ లాంటి రాజకీయ ఉద్దండుడు గులాబీ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నప్పుడు మరొకరితో పనేముందని క్లారిటీగా చెబుతున్నారట. మొత్తం మీద ఎన్నికల వ్యూహకర్త విషయమై గులాబీ దళంలో గట్టి చర్చే జరుగుతోంది.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** మినిస్టర్ క్వార్టర్స్ లో కాంగ్రెస్ అగ్ర నాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే ఒక రాజకీయ నాయకుడు గా మానవతా హృదయం కలిగిన రాహుల్ గాంధీ కు జన్మదిన శుభాకాంక్షలు. భారత్ జోడోయాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా అందరూ కలిసి ప్రజాస్వామికంగా ఉండాలని నఫ్రత్ చోడో భారత్ జోడో అని ఎటువంటి విద్వేషాలతో బతకద్దని పిలుపునిచ్చిన వ్యక్తి. రాహుల్ గాంధీ గారు బావి భారత జన్ జడ్ ఆకాంక్షల ఘనంగా ప్రధాని కావాలి. రాహుల్ గాంధీ గారు భారతదేశానికి దిశా దశ మారుస్తారు. జిత్నే అబాది ఉత్నే ఇసెదరి అని దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ఆశతో ఎదురు చూస్తున్న సందర్భంలో రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ గారికి జన్మదిన సందర్భంగా వారికి ఆ భగవంతుడు అన్ని రకాల శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. ..

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కల్తీ నియంత్రణకు కొత్త ఫోర్స్

**హైదరాబాద్, జూన్ 19, ( పెన్ పవర్:** ప్రస్తుతం మార్కెట్‌లో ఏ వస్తువు చూసినా కల్తీమయంగా మారిపోయింది. తినే తిండి దగ్గరి నుంచి తాగే నీటి వరకు అన్నీ కల్తీలు చేస్తున్నారు. ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులను కల్తీ చేసి.. కొందరు కేటుగాళ్లు భారీగా సొమ్మును వెనకేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ వస్తువులోనూ కల్తీ జాడలు ఉండటంపై సర్కార్ సీరియస్‌గా పరిగణించింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న కల్తీలకు చెక్ పెట్టేందుకు ఏకంగా ఒక స్పెషల్ ఫోర్స్‌ను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నిత్యావసర వస్తువుల కల్తీ ముఠాల ఆటకట్టించేందుకు ఈ స్పెషల్ ఫోర్స్ చర్యలు చేపట్టనుంది.హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆక్రమణలు, చెరువులు కుంటల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ.. పెను సంచలనం సృష్టిస్తూ.. కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రా .. డ్రగ్స్, గంజాయి సహా మత్తు పదార్థాల ముఠాల పాలిట శత్రువుగా మారిన ఈగల్ ఫోర్స్ లాగానే వస్తువుల్లో కల్తీని నియంత్రించేందుకు ఒక పవర్‌ఫుల్ స్పెషల్ ఫోర్స్ ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టింది. అయితే ఈ స్పెషల్ ఫోర్స్ కేవలం తనిఖీలు మాత్రమే చేయకుండా.. కల్తీ కేటుగాళ్లపై సెర్చ్ అండ్ సీజ్ ఆపరేషన్లు నిర్వహించడం, వారికి భారీగా జరిమానాలు విధించేలా విశేషమైన అధికారాలను కట్టబెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు.రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, పోలీస్ శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేయనున్న ఈ స్పెషల్ ఫోర్స్‌కు ఒక సీనియర్ ఐపీఎస్ అధికారిని బాస్‌గా నియమించే ఆలోచనను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ స్పెషల్ ఫోర్స్ ఏర్పాటుకు సంబంధించి.. ఇప్పటికే సమగ్ర ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఏ రకంగా ఉక్కుపాదం మోపుతోందో.. అదే విధంగా కల్తీ దందాపైనా దూకుడుగా వ్యవహరించేలా ఈ కొత్త ఫోర్స్‌ను తయారు చేయనున్నారు.ప్రస్తుతం ఉన్న ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌లో తక్కువ మంది సిబ్బంది ఉండటంతోపాటు.. వారికి నామమాత్రపు అధికారాలు ఉండటంతో కల్తీగాళ్ల ఆటకట్టించడంలో సఫలం కాలేకపోతున్నారు. అదే సమయంలో కల్తీ చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని నిందితులు తప్పించుకుంటున్నారు. ఇలాంటివి దృష్టిలో పెట్టుకుని.. ఆ స్పెషల్ ఫోర్స్‌కు సర్వాధికారాలు కల్పించాలని సర్కార్ భావిస్తోంది. మార్కెట్లో దొరికే పాలు, నూనెలు, మసాలాల దగ్గరి నుంచి హోటళ్లలో లభించే ఆహార పదార్థాల వరకు ప్రతి ఒక్క వస్తువుపై ఈ ఫోర్స్ నిరంతర నిఘా పెట్టనుంది.ఈ స్పెషల్ ఫోర్స్‌కు ఆయా వస్తువుల శాంపిల్స్ సేకరించే అధికారం మాత్రమే కాకుండా.. నేరుగా ఆ వస్తువుల తయారీ కేంద్రాలపై దాడులు చేయడం.. ఆ వస్తువులు, సంబంధిత హోటల్‌ను కూడా సీజ్ చేసేలా చట్టపరంగా అధికారాలు ఇవ్వనున్నారు. కల్తీకి పాల్పడే వారి లైసెన్సులను రద్దు చేయడంతోపాటు వారికి రూ.కోట్లల్లో పెనాల్టీలు విధించి.. ఇంకోసారి అలాంటి కల్తీలకు పాల్పడకుండా చూసేలా రూల్స్‌ను కఠినతరం చేస్తున్నారు. ఈ కల్తీల వెనుక ఎంతటి పెద్ద వారి అండదండలు ఉన్నా.. వదిలిపెట్టకూడదనే స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు.కల్తీ వస్తువుల నిందితులపై నాన్ బెయిలెబుల్ కేసులు పెట్టేలా ఆ స్పెషల్ ఫోర్స్‌కు ప్రత్యేక న్యాయ విభాగాన్ని కూడా అనుసంధానం చేయనున్నారు. ఈ క్రమంలోనే ఈ స్పెషల్ ఫోర్స్‌ను ఎలా తయారు చేయాలి.. దానికి నిధుల కేటాయింపు, చట్టపరమైన అధికారాలకు సంబంధించి సుదీర్ఘ చర్చ జరిపి రిపోర్ట్‌ను రెడీ చేశారు. త్వరలోనే ఆ రిపోర్ట్‌కు కేబినెట్ ఆమోద ముద్ర వేసి.. అమల్లోకి తీసుకువచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# రేవంత్ ట్రాప్ లో కిషన్





**హైదరాబాద్, జూన్ 19, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిల మధ్య సాగుతున్న మాటల యుద్ధం కేవలం పైకి కనిపిస్తున్న రాజకీయ విమర్శ మాత్రమే కాదు.. దాని వెనుక అత్యంత వ్యూహాత్మకమైన, లోతైన పొలిటికల్ అండ్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ దాగుంది. కేంద్రంలో క్యాబినెట్ మంత్రిగా, రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దిక్కుగా ఉన్న కిషన్ రెడ్డిని రేవంత్ రెడ్డి పదే పదే టార్గెట్ చేయడం, ఆయనపై బీఆర్ఎస్ ముద్ర వేయడం వెనుక సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్ ప్రకారం అడుగులు వేస్తున్నారు.సాంకేతికంగా చూస్తే కిషన్ రెడ్డికి కేటీఆర్ మాట వినాల్సిన అవసరం అస్సలు లేదు. కిషన్ రెడ్డి దిల్లీలో కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉన్నారు, పైగా రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే సీఎం రేసులో ఉండే అత్యంత సీనియర్ నేత. అయినప్పటికీ, రేవంత్ రెడ్డి ఆయనను కేటీఆర్ చెప్పినట్లే ఆడుతున్నారు అని విమర్శించడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ బలహీనపడుతున్న తరుణంలో, కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోంది. ఈ తరుణంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని, వాటి మధ్య చీకటి ఒప్పందం ఉందనే భావనను ప్రజల్లో బలంగా నాటడం ద్వారా రెండు పార్టీలను ఒకే దెబ్బకు బలహీనపరచాలనేది రేవంత్ రెడ్డి పొలిటికల్ ప్లాన్.ఇక పరిపాలనా కోణంలో చూస్తే.. రేవంత్ రెడ్డి ఇక్కడ అత్యంత చాకచక్యంగా రివర్స్ సైకాలజీ ని ప్రయోగిస్తున్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెద్ద ప్రాజెక్టుల అనుమతులు కేవలం సామరస్యపూర్వక చర్చలతో రావడం లేదని రేవంత్ భావిస్తున్నారు. అందుకే, తెలంగాణకు చెందిన ఏకైక కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి.. ఆయనే దిల్లీలో ఒత్తిడి తెచ్చి మన ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు అని పబ్లిక్‌గా నిందలు వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కిషన్ రెడ్డి డిఫెన్స్‌లో పడతారు. తనపై పడ్డ తెలంగాణ ద్రోహి అనే నిందను తొలగించుకోవడానికి అయినా, కిషన్ రెడ్డి స్వయంగా చొరవ తీసుకుని దిల్లీ పెద్దలతో మాట్లాడి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తీసుకురావాల్సిన పరిస్థితిని రేవంత్ కల్పిస్తున్నారు.హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ, ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రూ. 13,600 కోట్ల రీఫైనాన్సింగ్ లోన్, ఎన్‌ఓసీ వ్యవహారంలో ఈ వ్యూహం స్పష్టంగా కనిపించింది. మెట్రో ప్రాజెక్టు టేకోవర్ , లోన్ మంజూరులో కొన్ని సాంకేతిక ఇబ్బందులు, కేంద్ర-రాష్ట్రాల మధ్య నిబంధనల పేచీలు వచ్చాయి. అయితే రేవంత్ రెడ్డి ఆ సాంకేతిక సాకులను పక్కనపెట్టి.. కిషన్ రెడ్డి స్వయంగా కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి ఈ లోన్ రాకుండా అడ్డుకున్నారని, దీని వెనుక కేటీఆర్ కుట్ర ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. దీనివల్ల సాంకేతిక లోపం కాస్తా, రాజకీయ వివాదంగా మారి.. కిషన్ రెడ్డి ఆ లోన్ క్లియర్ చేయించాల్సిన నైతిక ఒత్తిడిలోకి వెళ్లారు.ఈ మైండ్ గేమ్‌లో రేవంత్ రెడ్డి విన్-విన్ పొజిషన్‌లో ఉన్నారు. ఒకవేళ రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణల ఒత్తిడికి లొంగి, కిషన్ రెడ్డి దిల్లీలో మాట్లాడి మెట్రో లోన్ ఎన్‌ఓసీ లేదా నిధులు ఇప్పించారనుకోండి.. చూశారా, మేము నిలదీస్తేనే దిల్లీ దిగొచ్చింది, ప్రాజెక్టు సాధించాం అని కాంగ్రెస్ క్రెడిట్ కొట్టేస్తుంది. అలా కాకుండా కేంద్రం మొండికేసి లోన్ ఆపేస్తే.. బీజేపీ, బీఆర్ఎస్ కలిసే హైదరాబాద్ అభివృద్ధిని, మెట్రో విస్తరణను అడ్డుకున్నాయి అని రాబోయే ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పొలిటికల్ మైలేజ్ సాధించవచ్చు. ఎలా చూసినా కిషన్ రెడ్డిని రేవంత్ తన వ్యూహాత్మక పద్మవ్యూహంలో బంధించేశారు. కేవలం మెట్రో మాత్రమే కాదు.. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ నిధుల విషయంలోనూ రేవంత్ రెడ్డి ఇదే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ను అద్భుతంగా చెప్పుకునే బీజేపీ నేతలు, హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని రేవంత్ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కిషన్ రెడ్డిని విలన్‌గా చిత్రీకరించడం ద్వారా.. కేంద్రం నుంచి రావాల్సిన క్లియరెన్స్‌లను వేగవంతం

చేయడమే సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న అసలు దౌత్యం.రేవంత్ రెడ్డి విసురుతున్న ఈ పొలిటికల్ గూగ్లీలను తిప్పికొట్టడం కిషన్ రెడ్డికి అంత సులభం కావడం లేదు. కేవలం నేను అడ్డుకోలేదు.. ఇవన్నీ సాంకేతిక సమస్యలు అని ప్రెస్ మీట్లు పెట్టి వివరణ ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి పూర్తి స్పష్టత వెళ్లడం లేదు. రేవంత్ రెడ్డి ప్లాన్ నుంచి కిషన్ రెడ్డి బయటపడాలంటే.. మాటల సమాధానం కంటే చేతల సమాధానమే ముఖ్యం. కేంద్ర మంత్రిగా తనకున్న పవర్‌తో తెలంగాణకు రావాల్సిన మెట్రో అనుమతులు, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిధులను స్వయంగా దిల్లీ నుంచి తెచ్చి, రేవంత్ రెడ్డి కంటే ముందే తానే ప్రెస్ మీట్ పెట్టి ప్రకటించడం ద్వారానే కిషన్ రెడ్డి ఈ రాజకీయ చక్రబంధం నుంచి బయటపడగలరని అనుకోవచ్చు.

# నంద్యాలలో తమ్ముళ్లు తగువలాట

**కర్నూలు, జూన్ 19 పెన్ పవర్:** నంద్యాల జిల్లాలోని సగానికిపైగా నియోజకవర్గాల్లో టీడీపీ నేతల మధ్య నిత్యం వివాదాలు నడుస్తున్నాయి. నియోజకవర్గ వ్యవహారాలైనా, అధికారిక కార్యక్రమాలైనా, పార్టీ ప్రోగ్రామ్స్ అయినా సరే... రచ్చ జరక్కపోతే... ఆ కార్యక్రమం నిర్వహించిన ఫీల్ ఉండటం లేదని సొంత పార్టీలోనే సెటైర్స్ పడుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. తాజాగా జరిగిన నంద్యాల జిల్లా స్థాయి పార్టీ సమావేశాన్నే ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు. ఆ సందర్భంగా వినిపించిన కోవర్ట్ వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరైన ఈ సమావేశానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అటెండ్ అవలేదు. పైగా పార్టీలో కోవర్ట్‌లు ఉన్నారని ఆమె అనడం కలకలం రేపింది. జిల్లాకు చెందిన మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి వంటి నేతలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. కానీ... సమావేశానికి గైర్హాజరైన భూమా అఖిల బయట మీడియాతో చేసిన వ్యాఖ్యలు రచ్చకు దారితీశాయి. ఆ సమావేశంలో పాల్గొనకపోవడం సంతోషంగా ఉందని అన్నారామె. పార్టీ కోసం నిజాయితీగా పనిచేసే కార్యకర్తలను పక్కనబెట్టి, కోవర్టులను ముందుకు తీసుకువచ్చి మాట్లాడించడం కార్యకర్తలకు ఆమోదయోగ్యం కాదని అన్న మాటలు ఎవర్ని ఉద్దేశించి అన్న చర్చలు నడుస్తున్నాయి.ఈ పరిస్థితిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని కూడా హెచ్చరించారు అఖిలప్రియ. పార్టీలో ఒకవైపు కష్టపడే నాయకులు, కార్యకర్తలు ఉంటే మరోవైపు కోవర్టులు ఉన్నారని అన్నారు మాజీ మంత్రి. పార్టీ కోసం పని చేయని వ్యక్తులు స్టేజీలపైకి ఎక్కి మైకులు పట్టుకుని మాట్లాడటం సరికాదన్నారామె. పని చేసే వాళ్లు, చేయని వాళ్లు ఒకే వేదిక మీదికి వస్తే విలువ ఏముంటుందన్నది అఖిల క్వశ్చన్. రాయలసీమలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూప్ రాజకీయాలు ఉన్నాయని, ఈ పరిస్థితిని సరిదిద్దాలని అధిష్టానానానికి సూచించారు. పార్టీ అధినాయకత్వం కోవర్టులను గుర్తించి తప్పక చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం ఉందంటూ ముక్తాయింపునిచ్చారు. దీంతో... మాజీ మంత్రి ఎవర్ని ఉద్దేశించి అంత తీవ్ర వ్యాఖ్యలు చేశారు? ఆమె టార్గెట్ ఎవరంటూ రకరకాల చర్చలు నడుస్తున్నాయి. వేదిక మీద మాజీ మంత్రితో విభేదించే నాయకులు పలువురు ఉండటంతో...వారిలో ఎవర్ని ఉద్దేశించి కోవర్ట్ వ్యాఖ్యలు చేశారన్నది ఆసక్తి కరంగా మారింది. ఆ విషయంలో ఎవరి విశ్లేషణలు వారికి ఉన్నా... ఎక్కువ మంది మాత్రం ఏవీ సుబ్బారెడ్డిని ఉద్దేశించే అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారట.అఖిలకు , ఏవీకి మధ్య విబేధాలు, వివాదాలు, కొట్లాటలు, కేసుల గురించి అందరికీ తెలిసిందే. ఆయన పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ ఏ ప్రోటోకాల్ ప్రకారం ఆయన్ని వేదికపై మొదటి వరుసలో కూర్చోబెట్టారంటూ టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితను ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీ పంపిన జాబితాలో ఆయన పేరు వుందని, అందుకే కార్యక్రమానికి, వేదికపైకి పిలిచామని చెప్పారట చరిత. అటు ఇన్ఛార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా సమావేశంలో

మాట్లాడుతూ పార్టీ గ్రూపు రాజకీయాలను ప్రస్తావించారు. అందరిని కలుపుకొని వెళ్లాలని, గ్రూపు రాజకీయాలు పెట్టుకుంటే పార్టీతో పాటు వ్యక్తిగతంగా మీరు కూడా నష్టపోతారని అన్నట్టు తెలిసింది. ఆ సంగతి ఎలాఉన్నా... అఖిల ప్రియ కోవర్ట్ వ్యాఖ్యల చుట్టూనే ఎక్కువ డిస్కషన్ నడుస్తోంది. ఏవీ సుబ్బారెడ్డి అంతలా ఏం చేశారంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్‌లు పెడుతున్నారట చాలామంది నేతలు. కొద్ది రోజుల క్రితమే మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి మంత్రి ఫరూక్‌పై ఆటో నగర్ విషయంలో సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఇపుడు భూమా అఖిల ఏవీ సుబ్బారెడ్డిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానంటున్నారు. ఈ రకంగా మొత్తమ్మీద నంద్యాల టీడీపీలో వరుస వివాదాలు పెరుగుతుండగా..... అధిష్టానం ఎలా డీల్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# మిత్రపక్షాల మధ్య లొల్లి

**అనంతపురం, జూన్ 19 పెన్ పవర్:** శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో అధికార కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య పొలిటికల్ వార్ ఇప్పుడు తారస్థాయికి చేరింది. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరు అభివృద్ధి పనులతో పాటు వివిధ ప్రభుత్వ పనుల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి గళమెత్తడం స్థానికంగా తీవ్ర దుమారం రేపింది. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా విచారణ జరిపించాల్సిన యంత్రాంగం కంటే.. స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలే ఎక్కువగా రియాక్ట్ అవుతూ కౌంటర్లకు దిగడం ఇక్కడ విచిత్రమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది.నిజానికి, విష్ణువర్ధన్ రెడ్డి తన ప్రకటనల్లో ఎక్కడా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేరు గానీ, లేదా నిర్దిష్టంగా టీడీపీ నేతల పేర్లు గానీ ప్రస్తావించలేదు. కేవలం పనుల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే డిమాండ్ చేశారు. కానీ, ఎమ్మెల్యే అనుచరులు, టీడీపీ వర్గాలు ఈ ఆరోపణలు తమకే వర్తిస్తాయన్నట్లుగా ఫీలయ్యారు. అంతటితో ఆగకుండా, విష్ణువర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. పనులు సవ్యంగా జరిగితే విచారణకు వెనుకాడాల్సిన అవసరం లేదని, కానీ ఇలా పోలీసులను ఆశ్రయించడం చూస్తుంటే ఏదో దాస్తున్నారనే అనుమానాలు పెరుగుతన్నాయంటున్నారు. కదిరి కూటమి రాజకీయాల్లో మరో విచిత్రమైన ట్రెండ్ నడుస్తోంది. స్థానికంగా ప్రజా సమస్యలపై, ఇతర అక్రమాలపై బీజేపీ నేతలు గొంతెత్తితే చాలు.. వారిపై వెంటనే వైసీపీ కోవర్ట్ అనే ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ నేతలంటున్నారు. నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే ఉన్నంత మాత్రాన, మిత్రపక్షంగా ఉన్న బీజేపీ అసలు ఏ కార్యక్రమాలు చేయకూడదా? ప్రజా పక్షాన నిలబడకూడదా? అని బీజేపీ క్యాడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కలిసి పోరాడి, ఇప్పుడు అధికారంలోకి రాగానే తమ ఉనికిని పూర్తిగా దెబ్బతీయాలని చూడటం ఏ రకమైన కూటమి ధర్మమని కమలదళం ప్రశ్నిస్తోంది.ఇటీవల జరిగిన కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు, రథోత్సవం వేళ కూడా ఈ ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరు రచ్చకెక్కింది. ఏటా సాంప్రదాయబద్ధంగా రథోత్సవంలో పాల్గొనే విష్ణువర్ధన్ రెడ్డిని కట్టడి చేసేందుకు ఎమ్మెల్యే కందికుంట పోలీసుల ద్వారా హౌస్ అరెస్ట్ చేయించారనే ఆరోపణలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే కదిరి వేదికగా టీడీపీ కార్యకర్తలకు.. కమలనాథులకు మధ్య ఇంత పెద్ద గ్యాప్ రావడం రాష్ట్ర కూటమి నేతలను కలవరపరుస్తోంది. వార్ ఇలాగే కొనసాగితే, అది కేవలం కదిరికే పరిమితం కాకుండా రాయలసీమ వ్యాప్తంగా కూటమి ఐక్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కదిరి రాజకీయం ముందు ముందు ఏ మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

# కాకినాడ పామాయిల్ తోటలో మిస్టరీ!

## రెండేళ్ల జ్ఞానేశ్వరి ఏమైంది? ఆ 35 నిమిషాల్లో ఏం జరిగింది?

**కాకినాడ, జూన్ 19: పెన్ పవర్:** నిశ్శబ్దంగా ఉన్న ఆ పామాయిల్ తోటలు ఇప్పుడు ఒక తీరని వేదనను, అంతుచిక్కని మిస్టరీకి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కన్నవారి కళ్ల ముందే ఆడుకుంటూ కనిపించకుండా పోయిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి ఉదంతం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. కేవలం 35 నిమిషాల గ్యాప్‌లో ఆ పసిపాప ఎటు వెళ్లింది. ప్రాణ స్నేహితుడిలా వెంట వెళ్లిన పెంపుడు కుక్క మౌనంగా తిరిగి వచ్చి ప్రాణాలు ఎందుకు వదిలింది? అనే ప్రశ్నలకు సమాధానాలు చిక్కడం లేదు. కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్. అగ్రహారంలో జూన్ 6న మొదలైన ఈ అన్వేషణ... నేటికి ఓ కొలిక్కి రావడం లేదు. డ్రోన్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, వందలాది మంది పోలీసులు రంగంలోకి దిగినా ఫలితం శూన్యం. ఈ క్రమంలో పోలీసులు చేస్తున్న ఒక వింత ప్రయోగం ఇప్పుడు అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పాపను అడవి జంతువులు ఏమైనా తీసుకెళ్లాయా అనే కోణంలో మాంసం నింపిన బొమ్మలతో ఆపరేషన్ మొదలు పెట్టారు. జూన్ 6వ తేదీన తల్లిదండ్రులు గణేష్, భవానితో కలిసి పామాయిల్ తోటకు వెళ్లింది చిన్నారి జ్ఞానేశ్వరి. తల్లిదండ్రుల మధ్య జరిగిన సమన్వయలోపం కారణంగా ఆ పసిపాప ఒంటరిగా మిగిలిపోయింది. పోలీసులు నిర్ధారించిన దాని ప్రకారం సరిగ్గా 35 నిమిషాల వ్యవధిలో బాలిక మాయమైంది. సమాచారం అందిన వెంటనే యంత్రాంగం అలెర్ట్ అయినప్పటికీ, ఆ దట్టమైన తోటల్లో పాప



ఆచూకీ దొరకలేదు. ఈ కేసులో అత్యంత విషాదకరమైన, మిస్టరీగా మారిన అంశం వారి పెంపుడు కుక్క. పాపా వెంట వెళ్లిన ఈ కుక్క జూన్ 9న ఒంటరిగానే ఇంటికి చేరింది. ఇంటికి వచ్చినప్పటి నుంచి ఆహారం తీసుకోకుండా వింతగా ప్రవర్తించింది. దీనికి జీపీఎస్ ట్రాకర్ అమర్చి పాపా ఎక్కడ ఉందో కనుగొనే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. సుమారు 80 కిలోమీటర్లు ఆ తోటల చుట్టూ తిరిగి ఆ కుక్క, చివరకు జూన్ 13న మరణించింది. వైరల్ ఇన్ఫెక్షన్ లేదా నాలుగు రోజులు ఆహారం లేకపోవడం వల్ల అది చనిపోయి ఉంటుందని భావించారు. పాపను అడవి జంతువులు ఏమైనా ఎత్తుకెళ్లాయా అన్న అనుమానంతో అధికారులు ఒక షాకింగ్ ఆపరేషన్ చేపట్టారు. తోటలో ఒక ఇనుప బోను ఏర్పాటు చేసి అందులో చిన్నారిని పోలిన రెండు బొమ్మలను ఉంచారు. ఆ బొమ్మల లోపల మాంసం ముక్కలను నింపి, జంతువులను ఆకర్షించేలా ప్లాన్ చేశారు. దీనికి తోడు చుట్టూ కెమెరా ట్రాప్లను పెట్టారు. వన్యమృగాల కదలికలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్డీర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు అధునాతన డ్రోన్లతో తోటలను జల్లెడ పడుతున్నారు. అడవితోపాటు సమీపంలోని సంచార జాతుల పైన కూడా పోలీసులు నిఘా పెట్టారు. డీఎస్పీ తిలక్ స్వయంగా ఈ ఆపరేషన్ పర్యవేక్షిస్తున్నారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి జిల్లా యంత్రాంగం లక్ష రూపాయల రివార్డు ప్రకటించింది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివ్ వార్తలపై పోలీసులు సీరియస్ అయ్యారు. అవాస్తవాలు ప్రచారం చేస్తే లీగల్‌గా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాపు నేతల్లో కాక...

**రాజమండ్రి, జూన్ 19 పెన్ పవర్:** రాజకీయాల్లో కొంతమంది పనితీరుతో రాణిస్తారు. మరికొందరు సెంటిమెంట్ రాజకీయాలు నడిపి రాణిస్తారు. రెండో కోణంలో రాణించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి పై ఉన్న ప్రజాభిమానాన్ని తాను పొందగలిగారు. తండ్రి మాదిరిగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల మనసు గెలవాలని చూసారు. కానీ ప్రజలు మాత్రం జగన్మోహన్ రెడ్డిలో రాజశేఖర్ రెడ్డిని చూసుకోలేదు. మహానేత కుమారుడిగా ఒక్కసారి మాత్రమే ఛాన్స్ ఇచ్చారు. రెండోసారి మాత్రం చాన్స్ ఇవ్వలేదు. అయితే రాజశేఖర్ రెడ్డి చేయలేనంతగా.. కులాలను, వర్గాలను విడదీసి వారి అభిమానాన్ని పొందాలనుకున్నారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఒక్కసారి మాత్రమే అందులో కూడా సక్సెస్ అయ్యారు. రెండోసారి విఫలమయ్యారు.ఏపీలో ఎవరు అధికారంలోకి రావాలన్నా ప్రధాన సామాజిక వర్గంగా ఉన్న కాపులు మద్దతు ఉండాల్సిందే. అయితే ఆ కాపులను 2019 ఎన్నికల్లో టర్న్ చేసుకోవడంలో సక్సెస్ అయ్యారు జగన్మోహన్ రెడ్డి. కాపు రిజర్వేషన్ ఉద్యమం ద్వారా భారీగా లబ్ధి పొందారు. ఇప్పుడు కూడా అటువంటి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి కాపులే కారణమని జగన్మోహన్ రెడ్డి గుర్తించారు. అందుకే వారిలో చీలిక తేవాలని చూస్తున్నారు. కాపుల వేళ్ళతో కాపులను పొడిచే సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. కాపు ఓటు బ్యాంకు ను చీల్చడమే కూటమిని దెబ్బతీసే ఏకైక మార్గం అని బలంగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కాపులు ఆదరించని వైసీపీ కాపు నేతలు చాలామంది ఉన్నారు. వారిని ముందు పెట్టి ఇప్పుడు రాజకీయ క్రీడ మొదలుపెట్టారు.ఒక అంబటి రాంబాబు, పేర్ని నాని, తోట త్రిమూర్తులు, గుడివాడ అమర్నాథ్, కన్నబాబు, బొత్స సత్యనారాయణ.. ఇలాంటి వైసీపీ కాపు నేతలను ముందు పెట్టి కాపుల విషయంలో బలమైన ప్రచారానికి జగన్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. పవన్ కళ్యాణ్ రూపంలో కూటమిలో డిప్యూటీ సీఎం పదవి ఉన్న కాపులకు ఎటువంటి ప్రయోజనం లేదని ప్రచారం మొదలుపెట్టారు. కాపు సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని కోణంలో వ్యతిరేకతను నూరి పోయాలని చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ పై కాపు యువతలో, ఓటర్లలో అసంతృప్తిని పెంచగలిగితే.. ఆ ఓట్లు ఆటోమేటిక్గా తమ వైపు టర్న్ అవుతాయన్నది జగన్ ఆలోచన.అయితే జగన్మోహన్ రెడ్డి కాపు సామాజిక వర్గ ఆలోచనను తక్కువగా అంచనా వేస్తున్నారన్న విశ్లేషణ ఉంది. ఎందుకంటే 2014 నుంచి 2019 మధ్య కాపుల విషయంలో జగన్ అనుసరించిన వైఖరి తెలియంది కాదు. ముఖ్యంగా చంద్రబాబు సర్కార్ ఇచ్చిన ప్రయోజనాలను సైతం రద్దుచేసి కాపులను ఒక ఓటు అస్త్రంగా మార్చుకున్న వైనాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకున్నారు. పైగా ఇదే వైసిపి కాపు నేతలు కాపు సామాజిక వర్గం విషయంలో చేసిన ప్రకటనలు కూడా గుర్తున్నాయి కాపు సామాజిక వర్గానికి. తమ కళ్ళను తమ చేతితో పొడుచుకునేందుకు కాపులు సిద్ధంగా లేరు. తప్పకుండా జగన్ ప్రయత్నం వికటిస్తుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## వైసీపీ ట్రాప్ లో చింతమనేని

**ఏలూరు, జూన్ 19 పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులను రెచ్చగొట్టి మాట్లాడించడం ఒక అలవాటైన విద్య. ఒక విషయాన్ని వివాదాస్పదం చేయడం కూడా ఆ పార్టీకి తెలిసినంతగా మరో పార్టీకి తెలియదు. ఇప్పుడు దెందులూరు నియోజకవర్గం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విషయంలో అలానే చేసింది ఆ పార్టీ. ఆయనను రెచ్చగొట్టి.. రహదారిపైకి వచ్చేలా చేసి.. దానిపై వ్యతిరేక ప్రచారం చేయించి.. రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. అందులో కొంత వరకు సక్సెస్ అయ్యింది కూడా. చింతమనేని ప్రభాకర్ కు వ్యతిరేకంగా లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు తో వైసిపి ఆడిన హైడ్రామా.. నిజంగా పక్కా పొలిటికల్ స్క్రీన్ తో చేసినదే. ప్రెస్మీట్లో లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు చింతమనేని ప్రభాకర్ రావు కుటుంబ సభ్యులకు విమర్శలు చేశారు. నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ.. చింతమనేని లో ఉన్న ఆగ్రహాన్ని బయటకు తీసేలా చేసి రెచ్చగొట్టారు. అనుకున్నది సాధించగలిగారు.దెందులూరు లో గెలిచారు చింతమనేని ప్రభాకర్ రావు వైసీపీ నేత కొఠారు అబ్బయ్య చౌదరిపై. సహజంగానే మాస్ ఇమేజ్ ఉంది చింతమనేని ప్రభాకర్ కు. దానిని దెబ్బతీసేందుకు టిడిపి ముసుగు వేసుకొని ఉన్న లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావును ఆశ్రయించారు. చింతమనేని ప్రభాకర్ ను ఆయనతో తిట్టించారు. చింతమనేని అనుచరులపై లేనిపోని ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా చింతమనేని కుటుంబ సభ్యులు, కుమార్తెలపై కూడా పరోక్ష వ్యాఖ్యలు చేసి ప్రభాకర్ లో ఉన్న ఆగ్రహాన్ని తట్టి లేపారు. ఈ మొత్తం ఒక పొలిటికల్ అజెండాగా సాగించారు అబ్బయ్య చౌదరి. లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు అబ్బయ్య చౌదరితో కలిపి చేసిన రాజకీయాన్ని టిడిపి హై కమాండ్ సైతం గుర్తించింది. అందుకే ఆయనను పార్టీ నుంచి బహిష్కరించింది.మొన్నటి ఎన్నికల్లో దెందులూరు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు చింతమనేని ప్రభాకర్. ఓడిపోయిన అబ్బయ్య చౌదరి ఎలాగైనా నియోజకవర్గంలో నిలదొక్కుకోవాలని చూశారు. కూటమి ప్రభుత్వంతో పాటు చింతమనేని డిఫెన్స్ లో పడేయాలని ఒక లోతైన వ్యూహాన్ని రచించారు. చింతమనేని దెబ్బ కొట్టేందుకు ఆయనకు అత్యంత ఆప్తుడిగా ఉంటూ... లోగుట్లు తెలుసుకున్న ఈడుపుగంటి శ్రీనివాసరావు వాటిని అస్త్రంగా మలుచుకున్నారు. చింతమనేని ఆర్థిక మూలాలను, కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రెస్ మీట్ లు పెట్టడానికి వైసీపీ బ్యాక్ అండ్ సపోర్ట్ తీసుకున్నారు. అలా ఆడిన వ్యవహారంలో చింతమనేని చిక్కుకున్నారు. చింతమనేనిని మానసికంగా దెబ్బతీసేందుకు ఆయన కుటుంబ సభ్యులను సైతం వివాదాల్లోకి లాగారు. అబ్బయ్య చౌదరి తవ్విన గొయ్యిలో చింతమనేని ప్రభాకర్ ఆవేశంతో పడిపోయారు. దీనిని శాంతిభద్రతల సమస్యగా చూపి వైసిపి ప్రచారాస్త్రంగా మార్చుకుంటుంది. కానీ వైసీపీతో చేతులు కలిపిన ఈడుపుగంటి శ్రీనివాసరావును టిడిపి హై కమాండ్ సస్పెండ్ చేసి కొంత దిద్దుబాటు చర్యలకు దిగింది.

## కడపలో కళకళలాడుతున్న స్టేడియం

**కడప, జూన్ 19, పెన్ పవర్:** కడప క్రికెట్ స్టేడియానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాత్రి సమయంలో తీసిన కడప స్టేడియం ఏరియల్ వ్యూ వీడియో కూడా ఆకట్టుకుంటోంది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం దక్కడంతో.. కడప స్టేడియం గురించి అందరికీ తెలిసింది. ఇది దేశంలోనే అత్యంత అందమైన క్రికెట్ స్టేడియాల్లో ఒకటి అని చెబుతున్నారు. ఇంకా డెవలప్ చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షించడానికి వీలుగా స్టేడియం కెపాసిటీని పెంచితే.. ఇక్కడ టెస్టులు, వన్డేలు నిర్వహించొచ్చని సూచిస్తున్నారు.'ఎప్పుడు ఈ రూట్లోనే వెళ్తుంటా.. కానీ ఈ స్టేడియం ఇంత బాగుంటుందని నాకు తెలీదు. ఏరియల్ వ్యూ చాలా బాగుంది' అని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఈ స్టేడియం పక్కనే రైల్వే ట్రాక్ ఉంటుందని.. రైల్లో వెళు తున్నప్పుడు ఈ ప్రదేశాన్ని చూడటం భలే ఉంటుందని మరో నెటిజన్ తన అనుభవాన్ని చెప్పుకొచ్చారు. అంతా బాగానే ఉంది కానీ.. వేసవిలో ఏపీలో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో కడప ఒకటి. ఎండా కాలం ఇక్కడ 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయి, అదొక్కటే కొంచెం ఇబ్బంది అని ఓ నెటిజన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.క్రికెట్‌కు సంబంధించిన అప్డేట్స్‌ను ఎప్పటికప్పుడు ఎక్స్ ద్వారా అందించే జాన్స్ అనే వ్యక్తి ' ఆంధ్రా ప్రీమియర్ లీగ్ వేదిక – కడప' అనే క్యాప్షన్‌తో పోస్టు చేసిన ఫొటోకు కొద్ది గంటల్లోనే 10 వేలకుపైగా లైకులు వచ్చాయి.ఈ క్రికెట్ స్టేడియం కడప నగరానికి 10 కిలోమీటర్ల దూరంలోని పుట్లంపల్లె ఏరియాలో ఉంది. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఈ స్టేడియం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ స్టేడియం నిర్మాణానికి వైఎస్ ఫ్యామిలీ రూ. 50 లక్షలు విరాళం ఇచ్చిందని చెబుతారు. ఈ స్టేడియంను ఇటీవలే ఆధునికీకరించారు. కడప క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కలిసి ఆంధ్రా ప్రీమియర్ లీగ్ కోసం కావాల్సిన వసతులను సిద్ధం చేశాయి. అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ స్టేడియాన్ని జూన్ 17న ప్రారంభించారు.ప్రస్తుతం ఈ స్టేడియంలో 15 వేల మంది ప్రేక్షకులు కూర్చొని మ్యాచ్‌ను వీక్షించొచ్చు. ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు నిర్వహించేలా 85 గజాల బౌండరీ లైన్, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పిచ్‌లను రూపొందించారు. ఇక్కడ ఒక రెసిడెన్షియల్ క్రికెట్ అకాడమీ కూడా ఉంది.ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) విషయానికి వస్తే.. జూన్ 9న ప్రారంభమైన ఈ టోర్నీ ఈ నెలాఖరు వరకు జరగనుంది. మొదటి 11 మ్యాచ్‌లను విశాఖపట్నంలో నిర్వహించగా.. జూన్ 17–21 తేదీల మధ్య కడప స్టేడియంలో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. జూన్ 24–30 తేదీల మధ్య లీగ్ మ్యాచ్‌లతోపాటు క్వాలిఫైయర్స్, ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్‌లు మంగళగిరిలోనే జరుగుతాయి. ఈ లీగ్‌లో మొత్తం ఏడు జట్లు పాల్గొంటున్నాయి.

## పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు చూపు

**తిరుపతి జూన్ 19, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి ఖరీఫ్ సీజన్‌పై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఐఎండీ హెచ్చరించింది. రైతులు పంటల సాగు విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఎల్‌నినో కారణంగా ప్రత్యేక వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో పంటల సాగు విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పంటల మార్పిడికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై సమీక్ష నిర్వహించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని రైతులు పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కీలక సూచనలు చేశారు. జిల్లాలవారీగా నేల స్వభావం, వర్షపాతం అంచనాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యేక పంటల ప్రణాళిక రూపొందించారు. రాయలసీమ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉందంటున్నారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, సజ్జలు, కొర్రలు, రాగుల్లాంటి పంటలు పండించాలని సూచిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రత్యేకంగా వేరుశెనగ, కంది, ఆముదం లాంటి అంతరపంటల విధానాన్ని పాటిస్తే నష్టాలు తగ్గించుకోవచ్చని సలహాలు ఇస్తున్నారు.కోస్తాలోని తూర్పుగోదావరి, కాకినాడ,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ప్రధాన పంటగా వరిని సాగు చేస్తారు. నీళ్లు అందుబాటులో ఉంటేదాన్ని బట్టి స్వర్ణ, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318, బీపీటీ 5204 రకాలు సాగుచేయాలని సూచిస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి, కంది, పెసర, మినుము, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయాలని.. పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో కంది, పత్తి, వేరుశనగ పంటలు.. నెల్లూరు జిల్లాలో కంది, మినుము, అలసంద, పెసర, కొర్రలు, మేతజొన్న సాగు చేయాలంటున్నారు.ఉత్తరాంధ్ర జిల్లాల విషయానికి వస్తే.. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లో వరితో పాటుగా చిరుదాన్యాలైన మొక్కజొన్న, రాగులు, సామలు, కొర్రలు సాగు చేయాలంటున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో నేరుగా విత్తే వరితో పాటుగా పెసర, మినుము, నువ్వులు, రాగులు, సజ్జలు, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ లాంటి పంటలు సాగుచేయాలి. శాస్త్రవేత్తలు చేసిన సూచనల్ని స్థానికంగా ఉండే పరిస్థితుల్ని బట్టి పాటించాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వం చేసే సూచనల్ని కూడా పాటించాలి.

## అనంతకు భారీగా పరిశ్రమలు

**అనంతపురం జూన్ 19, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులపై ఫోకస్ పెట్టింది. అది కూడా ఒక్క జిల్లాకు పరిమితం కాకుండా.. జిల్లాల వారీగా ఓ ప్లాన్ ప్రకారం పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఇటీవల కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు పరిశ్రమలు క్యూ కట్టాయి. పుట్టపర్తి, హిందూపురంతో పాటుగా అనంతపురం ప్రాంతాలకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని ఏపీకి కంపెనీలు ఎందుకు వస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# సీఐ నాగరాజుపై హత్యాయత్నం కేసు



విజయవాడ కృష్ణలంక పోలీసు స్టేషన్ సీఐగా పనిచేసి.. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న నాగరాజుపై విజయవాడ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు.. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీనిలో ప్రధానంగా హత్యాయత్నం కేసు నమోదు చేయడం గమనార్హం. ఇటీవల యువకుడు సాయికృష్ణ అదృశ్యం కేసు అనేక మలుపులు తిరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో సీఐ నాగరాజు తీవ్ర ఆరోపణలు ఎదు ర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ఏకంగా ఈ కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై స్పందించిన ప్రభుత్వం రాజమండ్రి ఎస్పీ కిశోర్‌తో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇంతలోనే ఈ కేసు మరింత తీవ్రతరం కావడం.. రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు.. బాధితుడి ఇంటికి వెళ్లి సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి నుంచి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

ఈ క్రమంలోనే సీఐ నాగరాజుపై విజయలక్ష్మి కీలక వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. --నీ కొడుకును చంపేస్తా. ఫొటోకు దండలు వేసుకో-- అని నాగరాజు బెదిరించినట్టు ఆమె చెప్పారు. దీంతో నాగరాజుపై బీఎన్‌ఎస్ చట్టంలోని సెక్షన్లు.. 127(4), 127(6), 103(1), 238ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు ప్రకటించా రు. వీటిలో 103(1) హత్యాయత్నం సెక్షన్ కావడం గమనార్హం. ఇతర సెక్షన్లు కూడా బలంగానే ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

**ఇవీ సెక్షన్లు..**

బీఎన్ ఎస్ 127(4): 10 రోజులు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఒక వ్యక్తిని అక్రమంగా నిర్బంధించే తీవ్రమైన నేరానికి సంబంధించినది. నిర్ణీత పరిధిలో దీర్ఘకాలం పాటు చట్టవిరుద్ధంగా వ్యక్తిని నిర్బంధించడం. బీఎన్ ఎస్ 127(6): ఒక వ్యక్తిని రహస్యంగా అక్రమ నిర్బంధంలో ఉంచి హింసించడం. ఆ వ్యక్తి నిర్బంధం లేదా ఆ నిర్బంధ స్థలం తెలియకుండా ఉంచడం. ఒక వ్యక్తి కదలికలను చట్టవిరుద్ధంగా నియంత్రించడం. బీఎన్ ఎస్ 103(1): ఒక వ్యక్తిని హత్య చేసేందుకు పురమాయించడం. హత్యాయత్నం. ఇది పాత ఇండియన్ పీనల్ కోడ్ లోని సెక్షన్ 302 కి సమానం. ఇది నిరూపితమైతే.. జీవిత ఖైదు కు దారి తీస్తుంది. బీఎన్ ఎస్ 238: నేరానికి సంబంధించిన సాక్ష్యాలను మాయం చేయడం. నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు సమాచారం ఇవ్వడం.

# కాంగ్రెస్ 'పరశురాముడు'.. రాహుల్ 'అవతారం' వెనుక అసలు కథ ఏంటి?



కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పరశురాముడి రూపంలో చిత్రీకరిస్తూ వెలువడిన ఒక పోస్టర్ దేశవ్యాప్త చర్చకు తెరలేపింది. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఈ చిత్రాన్ని ఆవిష్కరించడం వెనుక ఉన్న వ్యూహకర్తల ఆలోచనలేమిటి? ఇది కేవలం భక్తి భావమా లేక మారుతున్న రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమ అగ్రనేత పుట్టినరోజు సందర్భంగా ప్రఖ్యాత పుణ్యక్షేత్రం వారణాసిలో ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు, పరుశురాముడి రూపంలో ఉన్న రాహుల్ ఫొటోకు పాలాభిషేకం చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటో, వీడియోలు వైరల్ అవ్వగా, సోషల్ మీడియాలో భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

**రాహుల్ ఆధ్యాత్మిక అడుగులు**

గత కొంతకాలంగా రాహుల్ గాంధీ తన రాజకీయ శైలిని మార్చుకుంటూ వస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. శివాలయ సందర్శనలు, హిందూ ఆచారాలపై ఆసక్తి ప్రదర్శించడం వంటి చర్యల ద్వారా రాహుల్ తనలోని ఆధ్యాత్మిక కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నంతోపాటు బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా ఉన్న హిందుత్వ అనుకూల వాదులను ఆకట్టుకునే ఎత్తుగడ అనుసరిస్తున్నారని చెబుతున్నారు. బీజేపీ ప్రభావంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి దూరం జరుగుతున్న హిందూ ఓటర్లను తిరిగి దగ్గర చేసుకోవడానికి, పార్టీ అనుసరిస్తున్న 'సాఫ్ట్ హిందుత్వ' వ్యూహంలో భాగంగానే రాహుల్‌ను ఈ విధంగా చిత్రించారనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**పక్కా వ్యూహమా?**

హిందూ ఓటు బ్యాంకును కాంగ్రెస్ వైపు తిప్పుకోవడానికి ఇది ఒక పక్కా వ్యూహాత్మక అడుగు అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పరశురాముడు హిందూ ధర్మంలో అత్యంత శక్తివంతమైన అవతారంగా చెబుతారు. రాహుల్ గాంధీని ఆ రూపంలో చూపించడం ద్వారా, తాము కూడా హిందూ సంప్రదాయాలకు గౌరవం ఇస్తామనే సంకేతాన్ని కాంగ్రెస్ పంపాలని చూస్తోందని అంటున్నారు. ఇది బిజెపికి ఉన్న 'హిందుత్వ' ఇమేజ్‌కు కౌంటర్ ఇచ్చే ప్రయత్నంలో భాగంగా కూడా చూడవచ్చు అని అంటున్నారు. మరోవైపు, పరశు రాముడిని కేవలం భక్తుడిగానే కాకుండా, అన్యాయం, అసహనం, అవినీతిపై తిరుగులేని పోరాటం చేసే వీరుడికి ప్రతిరూపంగా కూడా చూస్తారు. దేశంలో పెరిగిపోతున్న అసహనం, అవినీతి వ్యవస్థలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోరాడతారని, ఆ పోరాటానికి పరశు రాముడే ప్రతీక అని చెప్పడానికి ఈ చిత్రాన్ని ఎంచుకుని ఉంటారని అంటున్నారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే యోధుడిగా రాహుల్ గాంధీని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది ఈ చిత్ర రూపకర్తల ఆంతర్యం అయి ఉండొచ్చని విశ్లేషిస్తున్నారు. అయితే, ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రతికూలతలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అంటున్నారు. పరశురాముడు తన ఆగ్రహానికి, క్షాత్ర శక్తికి ప్రతీక. కానీ, రాహుల్ గాంధీని ఆ రూపంలో చూపించడంపై భక్తుల నుంచి, రాజకీయ ప్రత్యర్థుల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేవతల రూపాలను రాజకీయ నాయకులకు అన్వయించడం హిందూ ధర్మాన్ని అగౌరవపరచడమేనని కొందరు హిందుత్వవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, గతంలో హిందూ ఆచారాలను విమర్శించిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు ఇలాంటి పనులకు పూనుకోవడం ద్వంద్వ వైఖరి అని, ఇది ఓటర్లలో వ్యతిరేకతను కూడా పెంచవచ్చని రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. మొత్తానికి, రాహుల్ గాంధీని పరశు రాముడిగా చూపించడం ద్వారా కాంగ్రెస్ ఒక సాహసోపేతమైన ప్రయోగానికి తెరలేపిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# ఈ సంవత్సరంలో లాంగెస్ట్ డే. 'విటమిన్-D డే' అసలు కథ ఏంటంటే?



ఈ ఏడాదిలోనే అత్యంత వింతైన, ప్రత్యేకమైన రోజు మన ముందుకు రాబోతోంది. జూన్ 21 (ఆదివారం) ఈ సంవత్సరంలోనే అత్యంత ఎక్కువ సేపు పగలు ఉండే రోజుగా రికార్డు సృష్టించనుంది. దీనిని సైన్స్ భాషలో 'సమ్మర్ సోల్‌స్టిస్' అంటారు. అయితే ఈ రోజుకు ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే.. సూర్యకాంతి ప్రాధాన్యతను గుర్తిస్తూ ఈ రోజును 'విటమిన్-ఊ డే ఆఫ్ ఇండియా'గా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. ఆ వివరాలు చూద్దాం..

**అసలు ఏంటి ఈ 'సమ్మర్ సోల్‌స్టిస్'?:**

ఖగోళ శాస్త్రం ప్రకారం భూమి సూర్యుడి చుట్టూ తిరిగే క్రమంలో తన అక్షంపై 23.5 డిగ్రీల కోణంలో వంగి ఉంటుంది. ఇలా పరిభ్రమిస్తున్న సమయంలో జూన్ 21న భూమి యొక్క ఉత్తర అర్ధగోళం సూర్యుడికి అత్యంత దగ్గరగా వస్తుంది. ఇక లాటిన్ భాషలో 'సోల్‌స్టిస్' అంటే 'సూర్యుడు నిశ్చలంగా ఉన్నాడు' అని అర్థం. ఈ ప్రత్యేకమైన పొజిషన్ వల్లే ఆ రోజు మనకు పగటి సమయం చాలా ఎక్కువగా ఉంటుంది.

**13 గంటలకు పైగా పగటి వెలుతురు:**

సాధారణంగా రోజుకు 12 గంటల పగలు, 12 గంటల రాత్రి ఉంటుంది కదా! కానీ ఈ జూన్ 21న మాత్రం ఏకంగా 13 గంటల 10 నిమిషాల పాటు పగటి వెలుతురు ఉంటుంది. అంటే ఆ రోజు రాత్రి చాలా చిన్నదిగా, పగలు చాలా పెద్దదిగా ఉంటుందన్నమాట. ఇక మన దేశంతో పాటు ఉత్తర అర్ధగోళంలో ఉన్న అన్ని దేశాల్లోనూ ఇదే ఖగోళ వింత కనిపిస్తుంది.

**'విటమిన్-D డే'గా ఎందుకు ప్రకటించారు?:**

ఈ పొడవైన రోజును కేవలం ఒక ఖగోళ వింతగానే కాకుండా, ప్రజల ఆరోగ్యం కోసం వాడుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భావించింది. మన శరీరానికి ఎంతో అవసరమైన

విటమిన్-D సహజంగా సూర్యరశ్మి నుంచే లభిస్తుంది. ప్రస్తుతం చాలామంది ఇళ్లకే పరిమితమై విటమిన్-ఊ లోపంతో బాధపడుతున్నారు. అందుకే సూర్యకాంతి వల్ల కలిగే హెల్త్ బెనిఫిట్స్‌పై అందరికీ అవగాహన కల్పించడానికి ఈ రోజును 'విటమిన్-D డే'గా

పిలవాలని IMA నిర్ణయించింది. ప్రకృతి మనకు ఉచితంగా ఇచ్చే సూర్యకాంతిని సరిగ్గా వాడుకుంటే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు. ఈ జూన్ 21న వచ్చే 'లాంగెస్ట్ డే' మనకు ఈ విషయాన్నే గుర్తు చేస్తోంది. మరి ఇంకెందుకు ఆలస్యం.. ఈ సండే కాస్త ఎక్కువ సేపు ఎండలో గడుపుతూ, ప్రకృతి వింతను ఎంజాయ్ చేస్తూ మీ బాడీకి కావలసినంత విటమిన్ Dని ఫ్రీగా పొందేయండి.

# 'స్వామి, మా అత్త చనిపోయేలా చూడు'.. రూ.20 నోటుపై దేవుడికి వింత విన్నపం!




అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం, పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల జరిగిన ఒక ఘటన భక్తులను, ఆలయ అధికారులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా భక్తులు దేవుడి హుండీలో తమ కష్టాలు తీరాలని, కుటుంబం సుభిక్షంగా ఉండాలని కానుకలు సమర్పించుకుంటారు. కానీ, హుండీని లెక్కిస్తుండగా బయటపడిన ఒక రూ.20 నోటు అందరినీ అవాక్కయ్యేలా చేసింది. ఆ నోటుపై ఎవరో అజ్ఞాత భక్తుడు తన ఆవేదనను తెలియజేస్తూ ""స్వామీ.. నా అత్త వేధింపులు తట్టుకోలేకపోతున్నాను. దయచేసి ఆమె త్వరగా చనిపోయేలా చూడు" అని కోరుతూ తన మనోవేదనను దేవుడి దృష్టికి తీసుకెళ్లారు.

**మౌనంగా సాగిన ఆక్రందన**

ఈ ఘటన వినడానికి వింతగా అనిపించినా, దీని వెనుక ఉన్న ఆవేదన చాలా లోతైనదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎదుటివారు చనిపోవాలని దేవుడిని ప్రార్థించారంటే, ఆ వ్యక్తి ఎంతటి నరకం అనుభవిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చని కొందరు అంటున్నారు. మౌనవేదనను భరించలేక, దేవుడు తప్ప తనను ఎవరూ కాపాడలేరనే నిస్సహాయతతోనే ఆ వ్యక్తి ఇలాంటి 'వెరైటీ' మార్గాన్ని ఎంచుకున్నాడని అభిప్రాయపడుతున్నారు. అత్త వేధింపులు భరించలేని అల్లుడు లేదా కోడలు తన కష్టాల నుంచి బయటపడే మార్గం కోసం దేవుడిని ఆశ్రయించడం తీవ్ర చర్చనీయాంశమైంది.

**అసహనానికి నిదర్శనం**

మానవ సంబంధాలలో చిచ్చు రేగితే ఎంతటి దారుణమైన ఆలోచనలకు దారితీస్తుందో చెప్పడానికి ఈ ఘటన ఒక నిదర్శనం. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోలేని స్థితిలో ఉన్న మనిషి, దేవుడినే అపకారం చేయమని అడగడం నేటి సమాజంలో పెరుగుతున్న అసహనానికి ప్రతిరూపమని విశ్లేషకులు భావిస్తున్నారు. హుండీ లెక్కిస్తున్న సిబ్బంది ఆ నోటును చూసి షాక్ తినడమే కాకుండా, "ఇదేం కోరికరా బాబూ!" అని అవాక్కవ్వడం వారి వంతైంది. ఒక వ్యక్తి తన ఇంట్లో పడుతున్న వేదనకు ఇది అద్దం పడుతోంది.

అత్తాకోడళ్లు లేదా అల్లుడు అత్త మధ్య ఉండాల్సిన అనుబంధం ఇలాంటి ఘోరమైన స్థాయికి దిగజారడం బాధాకరం. అది ఆస్తి సమస్య కావచ్చు, లేదా వ్యక్తిగత ఆధిపత్య పోరు కావచ్చు.. కానీ ఒక మనిషి మరొకరి మరణాన్ని కోరుకోవడం మానవత్వానికే మచ్చ. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు లేదా పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరించుకోవాలి తప్ప, ఇటువంటి విపరీతమైన మార్గాలను ఎంచుకోవడం సరైనది కాదు. ఈ సంఘటన ఆ వ్యక్తి వేదనను బయటపెట్టింది నిజమే కానీ, దేవుడిని ఇలాంటి పనులకు ఆశ్రయించడం సమంజసమా అని ఎవరికి వారు ఆలోచించుకోవాలి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సదరు భక్తులకు, వారి అత్తకు మంచి బుద్ధిని ప్రసాదించి, ఆ కుటుంబంలో శాంతిని నెలకొల్పాలని ఆశిద్దాం.

# తెలంగాణలో జనసేన సరికొత్త ప్రస్థానం : మణికొండలో పార్టీ కార్యాలయం ప్రారంభం




తెలంగాణ రాజకీయాల్లో తన ఉనికిని చాటుకోవాలని ప్రయత్నిస్తున్న జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా, హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. కొంతకాలంగా తెలంగాణలో పార్టీ విస్తరణపై దృష్టిపెట్టిన పవన్ ముందుగా రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించి యుద్ధానికి సిద్ధమని ప్రత్యర్థులకు సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. ప్రధానంగా కొద్ది రోజులుగా పవన్ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు విపక్షంలోని బీఆర్ఎస్, టీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అయినప్పటికీ పవన్ వెనక్కి తగ్గకుండా తెలంగాణలో తన పట్టు నిరూపించుకునేందుకు ముందడుగు వేశారని వ్యాఖ్యానిస్తున్నారు.

**కార్యాలయంతో కొత్త ఉత్సాహం**

శుక్రవారం ఉదయం మణికొండలో నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకలో పార్టీ ముఖ్య నేతలు, రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనసైనికులు, వీరమహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పవన్ కళ్యాణ్ తెలంగాణ తల్లికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపింది. గతంలో కార్యాలయం లేకపోవడంతో సమావేశాలకు ఇబ్బందులు పడిన పరిస్థితి నుంచి, ఇప్పుడు సొంత కార్యాలయంతో క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసే దిశగా జనసేన కీలక అడుగు వేసిందని అంటున్నారు.

**జీహెచ్ఎంసీ ఎన్నికలే లక్ష్యమా?**

ఏపీలో వంద శాతం స్ట్రైక్ రేట్ విజయంతో చరిత్ర సృష్టించిన డిప్యూటీ సీఎం పవన్ అనూహ్యంగా తెలంగాణ రాజకీయాల్లో యాక్టివ్ అవ్వాలని కోరుకోవడంపై విస్తృత చర్చ జరుగుతోంది. ప్రధానంగా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో కూడా పార్టీ చురుకైన పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. 336 వార్డుల్లో పోటీ చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకును నిర్మించుకోవడంపై పార్టీ దృష్టి పెట్టిందని అంటున్నారు. ఇక రాష్ట్ర కార్యాలయం అందుబాటులోకి రావడంతో రాష్ట్ర కమిటీలు, నియోజకవర్గ స్థాయి సమన్వయం వేగవంతం కానుందని చెబుతున్నారు. తెలంగాణ గడ్డపై పుట్టిన పార్టీగా, ఇక్కడి ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ప్రకటించారు. ఏ పార్టీ కలిసి వచ్చినా, రాకపోయినా ఒంటరిగానైనా బరిలోకి దిగేందుకు జనసేన సిద్ధంగా ఉందని అధినేత సంకేతాలు ఇవ్వడంతో రాజకీయ విశ్లేషకులు దీనిని ఆసక్తిగా గమనిస్తున్నారు. కాగా, తెలంగాణలో జనసేన కార్యాలయం ప్రారంభం ఆ పార్టీ రాజకీయ ప్రయాణంలో ఒక కీలక మలుపుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఏపీలో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, తెలంగాణలో పార్టీని సొంతంగా నిలబెట్టాలనే పవన్ పట్టుదల స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు. ముఖ్యంగా సెటిలర్లు, యువత ఎక్కువగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో జనసేన ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# పాత ఫోన్ అమ్ముతున్నారా? మీ పర్సనల్ డేటా లీకయ్యే ఛాన్స్.. సర్వేలో షాకింగ్ నిజాలు



భారతదేశంలో సెకండ్ హ్యాండ్ స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు జోరందుకుంటున్న.. ప్రజల్లో డేటా సేఫ్టీ గురించి భయాలు ఇంకా పోలేదు. తాజాగా జరిపిన ఒక సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 8వేల మందిపై జరిపిన ఈ సర్వే ప్రకారం.. చాలామంది పాత ఫోన్లను అమ్మడానికి వెనుకాడుతున్నారు. అందులో 69% మంది పాత ఫోన్లను అసలు అమ్మడం లేదు. కారణం.. వారి వ్యక్తిగత సమాచారం బయటకు ఎక్కడ లీక్ అవుతుందోననే భయం. 74% మంది ఫోన్ అమ్మిన తర్వాత వాళ్ళ పర్సనల్ డేటా దుర్వినియోగం అవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. అయిన.. 56.6% మంది ఇప్పటికే పాత ఫోన్లను అమ్మడం లేదా ఎక్స్ఛేంజ్ చేయడం చేశారు.

**డేటా సేఫ్టీకే ఫస్ట్ ప్రయారిటీ**

ఇంతకుముందు ఫోన్ అమ్మేటప్పుడు ఎక్కువ ధర ఎక్కడ వస్తే అక్కడ అమ్మేసేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. 45.3% మంది డేటా సేఫ్టీకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం 29.5% మంది మాత్రమే మంచి ధర వస్తే అమ్మేందుకు ఇంపార్టెన్స్ ఇస్తున్నారు.

**ఫ్యాక్టరీ రీసెట్ చేస్తే డేటా పోతుందా**

చాలామంది ఫోన్ అమ్మేముందు ఫ్యాక్టరీ రీసెట్ చేస్తే సరిపోతుందని అనుకుంటారు. కానీ అది నిజం కాదు. 83.3% మంది ఫోన్ అమ్మే ముందు ఫ్యాక్టరీ రీసెట్ చేస్తున్నారు. కానీ, అందులో 41.1% మందికి ఫ్యాక్టరీ రీసెట్ చేసినా డేటా శాశ్వతంగా డిలీట్ అవ్వదనే విషయం తెలుసు. సర్వేలో పాల్గొన్నవారిలో 31% మంది డిలీట్ అయిపోయిన డేటాను రికవరీ టూల్స్ ద్వారా మళ్లీ వెనక్కి తెప్పించగలిగారు కూడా.

**ఫ్యాక్టరీ రీసెట్ వేరు, సెక్యూర్ డిలీషన్ వేరు.**

ఫ్యాక్టరీ రీసెట్ చేసినప్పుడు కేవలం యాప్స్, ఫైల్స్ పైకి కనిపించకుండా పోతాయి

అంతే. కానీ ఆ డేటా అంతా ఫోన్ హార్డ్‌వేర్‌లోనే ఉంటుంది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల సాయంతో దానిని మళ్లీ బ్యాకప్ చేసి దొంగిలించవచ్చు. అదే 'సెక్యూర్ డేటా డిలీషన్'లో అయితే, డేటాపై పదే పదే వేరే సమాచారాన్ని ఓవర్‌రైట్ చేస్తారు. దీనివల్ల పాత డేటాను తిరిగి బ్యాక్ అప్ చేయడం అసాధ్యం.

# క్రెడిట్ కార్డ్ పోయిందా? వెంటనే ఈ పని చేయకపోతే చిక్కుల్లో పడతారు జాగ్రత్త..




ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి జేబులోనూ క్రెడిట్ కార్డ్ కామన్‌గా మారిపోయింది. షాపింగ్ నుంచి రోజువారీ ఖర్చుల వరకు అన్నింటికీ ఇదే దిక్కు చాలా మందికి. అంతగా ఉపయోగపడే క్రెడిట్ కార్డ్ ఎక్కడైనా పోతే మాత్రం గుండె ఆగినంత పనవుతుంది. కార్డ్ పోయిందని తెలియగానే చాలామంది కంగారుపడి ఏం చేయాలో తెలియక సమయాన్ని వృథా చేస్తుంటారు. అయితే ఆ సమయంలో ఎంత అలర్ట్‌గా ఉంటే అంత సేఫ్ లేదంటే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. కార్డ్ పోయిందని తెలిసిన మరుక్షణమే ఏమాత్రం ఆలస్యం చేయకుండా మొదటిగా చేయాల్సిన పని దాన్ని బ్లాక్ చేయడటమే. బ్యాంక్ మొబైల్ యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఎస్ఎంఎస్ సర్వీస్ లేదా కస్టమర్ కేర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి వెంటనే కార్డ్‌ను లాక్ చేయవచ్చు. ఇలా చేయడం వల్ల మీ కార్డ్ వేరే ఎవరి చేతికి చిక్కినా.. దాని నుండి ఎలాంటి లావాదేవీలు జరగకుండా అడ్డుకోవచ్చు. తప్పుడు పనులకు వాడకటాన్ని అడ్డుకోవచ్చు.

**ట్రాన్సాక్షన్ హిస్టరీ చెక్..**

కార్డ్ బ్లాక్ చేసిన తర్వాత.. మీ అకౌంట్‌కు సంబంధించిన ఇటీవలి లావాదేవీలను చాలా జాగ్రత్తగా పరిశీలించండి. మీ అనుమతి లేకుండా, మీకు తెలియకుండా ఏవైనా అనుమానాస్పద పేమెంట్స్ జరిగాయేమో చూసుకోండి. ఒకవేళ మీ దృష్టికి రాకుండా ఏదైనా మోసం జరిగినట్లు గుర్తిస్తే.. వెంటనే ఆ విషయాన్ని బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లి 'డిస్ప్యూట్ రిజల్యూషన్' కోసం రిపోర్ట్ చేయాలి.

**బ్యాంకుకు అధికారికంగా సమాచారం..**

కార్డ్ బ్లాక్ చేయడంతో పాటు, మీ క్రెడిట్ కార్డ్ పోయిన విషయాన్ని బ్యాంకుకు అధికారికంగా తెలియజేయడం చాలా ముఖ్యం. దీంతో మీ ఫిర్యాదును రికార్డుల్లో నమోదు చేయడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా తదుపరి ప్రక్రియలో మీకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బ్యాంక్ సిబ్బంది గైడ్ చేస్తారు. కొత్త రీప్లేస్‌మెంట్ కార్డ్ కోసం ప్రాసెస్ స్టార్ట్ చేయడానికి వాళ్లు హెల్ప్ చేస్తారు.

పాత కార్డ్ పూర్తిగా బ్లాక్ అయిన తర్వాత.. కొత్త క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాంకులు పాత నంబర్‌తో కాకుండా, పూర్తి భద్రత కోసం సరికొత్త నంబర్, సీవీవీతో కొత్త కార్డును జారీ చేస్తాయి. కొత్త కార్డ్ కోర్టు అప్లై చేసిన కొన్ని రోజుల్లోనే ఈ కొత్త కార్డ్ మీ ఇంటికి డెలివరీ చేయబడుతుంది.

**కొత్త కార్డ్ వచ్చినా ఇవి గమనించండి..**

కార్డ్ బ్లాక్ చేసి కొత్తది తీసుకున్నంత మాత్రాన మీ బాధ్యత తీరిపోలేదు. భద్రత కోసం మీ క్రెడిట్ స్కోర్ లేదా క్రెడిట్ రిపోర్టును క్రమం తప్పకుండా చెక్ చేస్తూ ఉండాలి. మీ కార్డ్ వివరాలను ఉపయోగించి ఎవరైనా భవిష్యత్తులో మోసాలకు పాల్పడినా లేదా ఆలస్యంగా ఏవైనా తప్పుడు ఎంట్రీలు జరిగినా క్రెడిట్ రిపోర్ట్ ద్వారా సులభంగా పట్టుకోవచ్చు. సమయానికి స్పందించి మీ ఆర్థిక భద్రతను కాపాడుకోవచ్చు.

# సెబీ ముందుకు జియో మెగా ఐపీఓ: అంబానీ కీలక ప్రకటన.. మార్కెట్లోకి 27 కోట్ల కొత్త షేర్లు




దేశ కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత భారీ ఐపీఓకి తెరలేచింది రిలయన్స్ ఇండస్ట్రీస్. దేశీయ టెలికాం దిగ్గజం 'జియో ప్లాట్‌ఫార్మ్స్ లిమిటెడ్' పబ్లిక్ ఇష్యూకి వెళ్లేందుకు రిలయన్స్ బోర్డు అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మెగా ఐపీఓ ద్వారా రూ.10 ఫేస్ వ్యాల్యూ కలిగిన 27 కోట్ల కొత్త షేర్లను మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. సెబీ దగ్గర (జూన్ 19)ఇవాళే ప్రాస్పెక్టస్( దాఖలు చేయనున్నట్లు ముఖేష్ అంబానీ ప్రకటించారు. రిలయన్స్ 49వ వార్షిక ఏజీఎంలో ముఖేష్ అంబానీ మాట్లాడుతూ.. ధీరూభాయ్ అంబానీ వారసత్వాన్ని తాను ముందుకు తీసుకెళ్లినట్లే.. జియో ఐపీఓ ప్రక్రియను ఆకాష్, ఇషా, అనంత్ అంబానీలు విజయవంతంగా నడిపిస్తున్నారని తెలిపారు. ఈ ఐపీఓ ద్వారా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలను, గ్లోబల్ వాల్యూను భారత్ సృష్టించగలదని ప్రపంచానికి నిరూపిస్తామన్నారు. 10 ఏళ్ల క్రితం డేటా ఖరీదైన సమయంలో ఉచిత వాయిస్ కాల్స్, చౌకైన హై-స్పీడ్ డేటాతో జియో డిజిటల్ విప్లవాన్ని తెచ్చిందని, ఇప్పుడు జియో తన తర్వాతి పెద్ద మిషన్‌కు సిద్ధమవుతోందని అన్నారు. జియో ఐపీఓ విలువ దాదాపు రూ.35వేల కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా. జెఫెరీస్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అంచనా ప్రకారం రిలయన్స్ జియో మార్కెట్ విలువ ఏకంగా 180 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రస్తుతం 52.4 కోట్ల మంది వినియోగదారులతో జియో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌గా నిలిచింది. చైనా తర్వాత ఒకే ఒక టెలికాం కంపెనీ నిర్వహిస్తున్న అతిపెద్ద 5+ నెట్‌వర్క్ జియోనే కావడం ఇక్కడ విశేషం.జియో 5+ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 27 కోట్లకు చేరిందని ఆకాష్ అంబానీ తెలిపారు. గడిచిన ఏడాదిలోనే 7.7 కోట్ల మంది కొత్తగా 5+ నెట్‌వర్క్‌లోకి వచ్చారని వెల్లడించారు. 2030 నాటికి వినియోగదారులందరినీ 5+కి మార్చడమే జియో లక్ష్యమన్నారు. అలాగే జియో ఎయిర్‌ఫైబర్ ద్వారా ఇప్పటికే కోటి 30 లక్షల ఇళ్లకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ ఇచ్చారు. ప్రతిరోజూ దాదాపు 60వేల కొత్త ఇళ్లు జియో ఎయిర్‌ఫైబర్ నెట్‌వర్క్‌లో చేరుతున్నాయి. దీనితో పాటు వినియోగదారులకు స్మార్ట్ ఎక్స్‌పీరియన్స్ అందించడానికి ఏఐ సాంకేతికతను జియో వేగంగా జోడిస్తోంది.

నేలపైనే కాకుండా, ఇప్పుడు ఆకాశం నుండి కూడా భారత్‌ను కనెక్ట్ చేసేందుకు జియో సిద్ధమైంది. ఇందులో

భాగంగా సొంతంగా 'లో ఎర్త్ ఆర్బిట్' శాటిలైట్ కాన్స్టెలేషన్‌ను అభివృద్ధి చేయాలని జియో ప్లాన్ చేస్తోంది. ఒకవిధంగా ఇది స్టార్ లింక్ మాదిరిగా పనిచేసే వ్యవస్థ అనమాట. సరిహద్దు ప్రాంతాలు, గిరిజన గ్రామాలు, ద్వీపాలకు శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడానికి దేశీయంగా గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాలను జియో నిర్మిస్తోంది. భూమిపై సృష్టించిన డిజిటల్ సంచలనాన్ని ఇకపై అంతరిక్షంలోనూ రిపీట్ చేసేందుకు జియో అడుగులు వేస్తోంది.

## హైదరాబాద్‌లో పోర్షే హంగామా.. దేశంలోనే అతిపెద్ద లగ్జరీ షోరూం ఏర్పాటు




ప్రముఖ లగ్జరీ కార్ల బ్రాండ్ 'పోర్షే ఇండియా'.. ఈవీఎం ప్రీమియం కార్స్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో సరికొత్త షోరూమ్‌ను అధికారికంగా ప్రారంభించింది. నగరంలో పోర్షే బ్రాండ్‌కు ఇది రెండవ సేల్స్ పాయింట్. సుమారు 2,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన పోర్షే సెంటర్ హైదరాబాద్.. దేశంలోనే అత్యంత భారీ ఫెసిలిటీగా రికార్డు సృష్టించింది. ఇక్కడ సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్ సేవలు అన్నీ ఒకే చోట లభిస్తాయి.

హైదరాబాద్‌లోని ప్రముఖ బిజినెస్ డిస్ట్రిక్ట్స్‌కు అత్యంత సమీపంలో ఈ కేంద్రాన్ని వ్యూహాత్మకంగా ఏర్పాటు చేశారు. బెంగళూరు, చెన్నై తర్వాత సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్ కలిపి ఉన్న మూడవ కంబైన్డ్ ఫెసిలిటీ ఇదే. అధునాతన డెస్టినేషన్ పోర్షే షోరూమ్ డిజైన్ కాన్సెప్ట్‌తో దీనిని రూపొందించారు. ఇది కార్ల ప్రియులకు కేవలం అనుభవాన్ని మాత్రమే కాకుండా.. ఒక లగ్జరీ లైఫ్‌స్టైల్ వాతావరణాన్ని అందిస్తుంది.

ఈ సందర్భంగా పోర్షే ఇండియా హెడ్ అశుతోష్ దీక్షిత్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో వ్యాపార రంగం, లగ్జరీ మైండ్‌సెట్ వేగంగా ఎదుగుతున్నాయని, అందుకే తమ పూర్తి సేవలను ఇక్కడ విస్తరిస్తున్నట్లు చెప్పారు. గత పదేళ్లకు పైగా పోర్షే భాగస్వామిగా ఉన్న ఈవీఎం ప్రీమియం కార్స్ డీలర్ ప్రిన్సిపల్ సాబు జానీ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టెక్నికల్ నైపుణ్యంతో హైదరాబాద్ కస్టమర్లకు బెస్ట్ సర్వీస్ అందిస్తామన్నారు.

## 60 సెకన్లలోనే ఫుల్ బాడీ స్కానింగ్.. 'మిడ్‌జర్నీ' సంచలన ఆవిష్కరణ!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఇమేజ్ జనరేషన్ టూల్స్‌తో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన 'మిడ్‌జర్నీ' సంస్థ, వైద్యరంగంలోకి సంచలన రీతిలో ప్రవేశించింది. కేవలం 60 సెకన్ల వ్యవధిలో పూర్తి శరీరాన్ని స్కాన్ చేసి, అంతర్గత అవయవాల చిత్రాలను అత్యంత స్పష్టంగా అందించే వినూత్న 'ఫుల్ బాడీ అల్ట్రాసౌండ్ స్కానర్'ను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా 'మిడ్‌జర్నీ మెడికల్' అనే విభాగాన్ని సైతం ఆ సంస్థ ప్రారంభించింది.'అల్ట్రాసోనిక్ సీటీ' లేదా 'మిడ్‌జర్నీ స్కానర్'గా పిలిచే ఈ పరికరాన్ని వినియోగించే విధానం చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఒక స్పా తరహా వాతావరణంలో, నీటితో నిండిన చిన్న కొలనులో వ్యక్తిని ఉంచి ఈ స్కానింగ్ నిర్వహిస్తారు. ఆ కొలను చుట్టూ అమర్చిన లక్షలాది సూక్ష్మ అల్ట్రాసౌండ్ సెన్సర్లు పంపే శబ్ద తరంగాలు.. శరీరంలోని కండరాలు, అవయవాలు, ఎముకల 3ఐ మ్యాప్‌ను సిద్ధం చేస్తాయి. ఎంఆర్ఐ లేదా సీటీ స్కాన్‌ల తరహాలో రేడియేషన్ లేదా శక్తివంతమైన అయస్కాంత క్షేత్రాల అవసరం లేకుండానే ఈ పరికరం పనిచేయడం విశేషం.

భవిష్యత్తులో ఆరోగ్య పరీక్షలను మరింత సరళతరం చేయడమే తమ లక్ష్యమని మిడ్ జర్నీ వ్యవస్థాపకుడు, సీఈఓ డేవిడ్ హోల్జ్ పేర్కొన్నారు. ఈ స్కానర్ ద్వారా లభించే చిత్రాలు ఎంఆర్ఐ ఫలితాలతో సమానమైన స్పష్టతను కలిగి ఉంటాయని, పైగా వంద రెట్లు వేగంగా ఫలితాలను అందిస్తాయని ఆయన వివరించారు. ప్రాథమిక దశలో ఈ స్కానర్లను వెల్‌నెస్, బాడీ కంపోజిషన్ మ్యాపింగ్ కోసం వినియోగించనున్నారు. 2027 నాటికి శాన్ ఫ్రాన్సిస్కోలో తొలి 'మిడ్‌జర్నీ స్పా'ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంస్థ వెల్లడించింది.ఈ సరికొత్త సాంకేతికతపై వైద్య నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నప్పటికీ, కొన్ని పరిమితులను ప్రస్తావిస్తున్నారు. సాధారణ ఆరోగ్య పరీక్షలకు ఈ పరికరం ఉపయుక్తంగా ఉన్నప్పటికీ, మెదడు వంటి సున్నిత భాగాల స్కానింగ్‌లో ఎంఆర్ఐ స్థాయిని ఇది అందుకోలేకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు.అలాగే, పూర్తి శరీర స్కానింగ్‌లో తప్పుడు ఫలితాలు వచ్చే అవకాశం ఉందని, దీనివల్ల రోగుల్లో అనవసర ఆందోళన కలగడమే కాకుండా అదనపు పరీక్షల భారం పడుతుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సాంకేతికత పరిశోధనా దశలోనే ఉంది. దీనిని రోగ నిర్ధారణ ప్రక్రియల్లో అధికారికంగా వినియోగించాలంటే ఎఫ్‌డీఏ వంటి నియంత్రణ సంస్థల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉంటుంది.

## ఉద్యోగులకు డబుల్ ధమాకా: పీఎఫ్ ఖాతాల్లోకి వడ్డీ డబ్బులు.. ఇకపై UPI, ATM ద్వారా కూడా విత్‌డ్రా!

దాదాపు 7.8 కోట్లకు పైగా ఉన్న ఈపీఎఫ్ఓ సబ్ స్క్రయిబర్స్ కోసం కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే వార్త చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ డిపాజిట్లపై 8.25% వడ్డీ ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనితో పాటు జూన్ చివరిలోగా 'ఐుూఖీూ 2.0' అనే కొత్త డిజిటల్ వ్యవస్థను తీసుకురాబోతోంది. దీని ద్వారా భవిష్యత్తులో ఏటీఎం లేదా యూపీఐ ద్వారా కూడా ఈజీగా డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చు.కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా నేతృత్వంలోని బోర్డు ప్రతిపాదించిన 8.25% వడ్డీ రేటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నెల చివరి నాటికి దీనికి సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ రానుంది. సమాచారం ప్రకారం.. ఈ జూన్ నెలలోనే ఉద్యోగుల అకౌంట్లో వడ్డీ డబ్బులు జమ కావడం ప్రారంభమవుతుంది. కొత్త డిజిటల్ సిస్టమ్ వల్ల గతంలో కంటే చాలా వేగంగా మీ అకౌంట్లలో వడ్డీ డబ్బులు చేరుతాయి. ఉద్యోగులకు వరుసగా మూడో ఏడాది కూడా 8.25% వడ్డీ రావడం విశేషం.

**ఏటీఎం, యూపీఐ ద్వారా డబ్బుల విత్‌డ్రా**

పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకోవడం ఇకపై మరింత ఈజీ కాబోతోంది. జూన్ చివరిలో ప్రారంభం కానున్న 'ఐుూఖీూ 2.0'లో భాగంగా.. మీ పీఎఫ్ డబ్బుల్లో 75% వరకు నేరుగా ఏటీఎం లేదా యూపీఐ ద్వారా మీ బ్యాంక్ అకౌంట్లోకి విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ సదుపాయం 'భీమ్ యాప్' ద్వారా అందుబాటులోకి వస్తుంది. ఆన్‌లైన్‌లో పీఎఫ్ క్లెయిమ్ పెట్టుకోవడం కష్టంగా భావించే సామాన్యులకు, ఉద్యోగులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటనిస్తుంది.

**మారిన పీఎఫ్ విత్‌డ్రా రూల్స్**

డబ్బులు త్వరగా చేతికి అందేలా చేయడం కోసం ఐుూఖీూ ఇప్పటికే పాత నిబంధనలను మార్చింది. గతంలో ఉన్న 13 రకాల విత్‌డ్రా కేటగిరీలను కేవలం 3 కేటగిరీలకు కుదించింది. వీటిలో....లిఅత్యవసర అవసరాలు అంటే అనారోగ్యం కోసం హాస్పిటల్ ఖర్చులు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు...లిఇంటి అవసరాల కోసం అంటే ఇల్లు కొనడం లేదా కట్టుకోవడం కోసం...లిప్రత్యేక పరిస్థితులు అంటే ఇతర అత్యవసర సమయాల్లోఉపయోగపడేందుకు.. దీనివల్ల మీరు పెట్టుకునే పీఎఫ్ క్లెయిమ్‌లు చాలా వేగంగా అప్రూవ్ అవుతాయి.

**తగ్గని వడ్డీ రేటు..**

నిజానికి పీఎఫ్ వడ్డీ రేటును 8.10% కి తగ్గించాలని ఆర్థిక శాఖ అలాగే ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ సూచించాయి. ఒకవేళ వడ్డీ రేటును 8.25%గా ఉంచితే బోర్డుకు సుమారు రూ.944.06 కోట్ల లోటు వస్తుందని లెక్కగట్టారు. అయిన.. ప్రభుత్వం వేతన ఉద్యోగుల ప్రయోజనాలకే పెద్దపీట వేసింది. లోటు వచ్చినా పర్వాలేదు, లక్షలాది మంది ఉద్యోగుల పదవీ విరమణ జీవితానికి భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో పాత వడ్డీ రేటు (8.25%)నే కొనసాగించాలని నిర్ణయించింది.

# ఉదయాన్నే తిన్నారనుకోండి..!



శీతాకాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఫైబర్, ఐరన్ లాంటి ముఖ్య పోషకాలతో నిండి ఉంటుంది. కీళ్ల నొప్పులు, అలసట, జలుబు లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. శీతాకాలంలో ఎండు ఖర్జూరం తినొచ్చా.? లేదా.? ఇది అందరిలోనూ ఉండే ప్రశ్న. ఈ వింటర్ సీజన్‌లో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. ఎండు ఖర్జూరం ఎముకలను బలంగా మార్చడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరిచడంలో సహాయపడుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా చలికాలంలో కొన్ని ప్రత్యేకమైన డ్రై ఫ్రూట్స్ తీసుకుంటే శరీరానికి మరింత శక్తి, రోగనిరోధక శక్తి లభిస్తాయి. అలాంటి వాటిలో ఎండు ఖర్జూరం ఒకటి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, పొటాషియం, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి లాంటి కీలక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా చలికాలంలో వచ్చే ఎముకల నొప్పులు, జీర్ణ సమస్యలు, అలసట లాంటి సమస్యలకు ఎండు ఖర్జూరం మంచి ఔషధంలా పనిచేస్తుంది. చలికాలంలో చాలామందికి నడుము నొప్పి, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇలాంటి సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు ఎండు ఖర్జూరం చాలా ఉపయోగపడుతుంది. రాత్రి ఒక గ్లాసు నీటిలో రెండు ఎండు ఖర్జూరాలు, ఒక చెంచా మెంతులు నానబెట్టి ఉంచి.. ఉదయం లేచిన వెంటనే ఖర్జూరాలను నమిలి తిని, ఆ నీటిని వడగట్టి తాగాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే శరీరంలోని నొప్పులన్నీ క్రమంగా తగ్గుతాయి. ఎప్పుడూ అలసటగా ఉండటం, శరీరంలో శక్తి లేకపోవడం లాంటి సమస్యలు ఉంటే ఎండు ఖర్జూరం మంచి పరిష్కారం. రాత్రి పూట లేదా ఉదయం ఎండు ఖర్జూరం తినడం వల్ల శరీరానికి ఎనర్జీ వస్తుంది. అలాగే ఐరన్ అధికంగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య ఉన్నవారికి ఇది ఎంతగానో ఉపయోగకరం. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడి, రక్తహీనత లక్షణాలైన అలసటను తగ్గిస్తుంది. చలికాలంలో ఛాతిలో కఫం చేరడం, దగ్గు, జలుబు లాంటి శ్వాస సంబంధిత సమస్యలు సర్వసాధారణం. రెండు ఎండు ఖర్జూరాలను బాగా నమిలి తిని, తర్వాత కొద్దిగా గోరువెచ్చని నీరు తాగితే కఫం కరిగి బయటకు రావడంలో సహాయపడుతుంది. తద్వారా శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, మెగ్నీషియం అధికంగా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థ బలపడుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. క్రమం తప్పకుండా ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల పేగులు ఆరోగ్యంగా పనిచేస్తాయి. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ఎండు ఖర్జూరం కీలకపాత్ర పోషిస్తుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె పనితీరును బలోపేతం చేస్తుంది. అలాగే, రోగనిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్ల జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల నుంచి శరీరం రక్షణ పొందుతుంది. చలికాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం శరీరానికి చాలా మంచిది. రోజు పరిమిత మోతాదులో తీసుకుంటే శక్తి, ఆరోగ్యం రెండు మెరుగవుతాయి. అయితే, మధుమేహం ఉన్నవారు మాత్రం వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవడం మంచిది.



# ఏ టిఫిన్ బాక్స్ ఆరోగ్యానికి మంచిది..?

మీ ఆరోగ్యాన్ని కాపాడటానికి సరైన టిఫిన్ బాక్స్‌ను ఎంచుకోవడం ముఖ్యం. ప్లాస్టిక్ బాక్స్‌లు హానికరమైన రసాయనాలను విడుదల చేసి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. కాబట్టి మంచి టిఫిన్ బాక్సులు ఎంచుకోవడం బెటర్. సాధారణంగా మనం ఆరోగ్యంగా ఉండాలని పోషకాలున్న ఆహారాన్ని వండుకుంటాం. కానీ ఆ ఆహారాన్ని దేనిలో తీసుకెళ్తున్నాం అనే విషయాన్ని మాత్రం పట్టించుకోం. మార్కెట్‌లో దొరికే రంగురంగుల డిజైన్లు, తక్కువ ధర చూసి మనం ఎంచుకునే టిఫిన్ బాక్స్‌లు మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా భారతీయ ఇళ్లలో ఎక్కువగా కనిపించే స్టీల్ టిఫిన్లే అత్యంత సురక్షితమైనవి. ఇవి రసాయన రహితం, మన్నికైనవి, తేలికగా ఉంటాయి. ఆహారం రుచిని, పోషకాలను ఇవి మార్చవు. వీటిని మైక్రోవేవ్‌లో పెట్టలేము. ద్రవ పదార్థాల కోసం లీక్-ప్రూఫ్ మూతలు ఉన్న వాటినే ఎంచుకోవాలి. స్కూలుకు వెళ్లే పిల్లలకు, ఆఫీసులకు వెళ్లే వారికి ఇది అత్యంత ఉత్తమమైన ఎంపిక. ఆధునిక జీవనశైలిలో గాజు టిఫిన్ల వినియోగం పెరుగుతోంది. గాజు రసాయన రహితమైనది. ఆహారం వాసన రాకుండా ఉంటుంది. ఆఫీసుల్లో నేరుగా మైక్రోవేవ్‌లో వేడి చేసుకోవడానికి ఇది వీలుగా ఉంటుంది. ఇవి బరువుగా ఉంటాయి. కింద పడితే విరిగిపోయే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా వాడగలిగే పెద్దలకు, ఆఫీసు ఉద్యోగులకు ఇది మంచిది. పాత కాలంలో ఇత్తడి పాత్రలనే వాడేవారు. దీని వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. ఇత్తడిలో ఆహారం ఉంచడం వల్ల శరీరానికి అవసరమైన ఖనిజాలు అందుతాయి. ఇది బాక్టీరియా పెరగకుండా చూస్తుంది. నిమ్మకాయ, టమోటా వంటి అమ్ల ఆహారాలతో ఇత్తడి ప్రతిచర్య జరుపుతుంది. అలాగే వీటిని శుభ్రం చేయడం, మెరిసేలా చూసుకోవడం కాస్త కష్టమైన పని. ఇంట్లో ఉండేవారికి, చిన్న ప్రయాణాలు చేసే వారికి ఇది అనుకూలం. చౌకగా దొరుకుతాయని ప్లాస్టిక్ బాక్సుల వైపు వెళ్లడం ఆరోగ్యానికి చేటు. బరువు తక్కువ, రంగురంగుల డిజైన్లలో లభిస్తాయి. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్‌లో ఉంచినప్పుడు అది హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. ఇది దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. అత్యవసరమైతే తప్ప ప్లాస్టిక్ వాడకపోవడమే మంచిది.

## పొద్దుతిరుగుడు సూపర్ బెనిఫిట్స్..




మహిళల హార్మోన్ల సమతుల్యత, ఋతుక్రమ నొప్పుల ఉపశమనానికి పొద్దుతిరుగుడు విత్తనాలు అద్భుత ఔషధం. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. చిరాకు, కోపాన్ని తగ్గించి, క్యాన్సర్, గుండె జబ్బుల నుండి రక్షణ కల్పిస్తాయి. ఎముకల బలోపేతానికి, డయాబెటిస్ నియంత్రణకు కూడా సహాయపడతాయి. మహిళల శరీరంలో హార్మోన్ల సమతుల్యతలో అనేక హెచ్చుతగ్గులు ఉంటాయి. వయసు పెరిగే కొద్దీ ఈ మార్పులు వారిని చాలా ఇబ్బంది పెట్టడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా వారు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. మహిళలు తరచుగా చిరాకుగా కనిపిస్తుంటారు. చిన్న విషయాలకే కోపంగా ఉండటం ప్రారంభిస్తారు. దీంతో పాటు పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపు, వెన్నునొప్పి సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది మహిళలకు ఎక్కువ రోజుల ముందుగానే పీరియడ్స్ నొప్పులు రావడం ప్రారంభిస్తాయి.. అలాంటి మహిళలు సమస్యను ఎలా వదిలించుకోవాలో తెలియక చాలా ఆందోళన చెందుతారు. కానీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. ఎందుకంటే..అటువంటి పరిస్థితుల్లో కొన్ని విత్తనాలు మీకు ఆరోగ్యానిస్తాయి. అందులో ఒకటి పొద్దుతిరుగుడు. పొద్దుతిరుగుడు విత్తనాలు చాలా శక్తివంతమైనవి. దీనిలో ప్రోటీన్, కొవ్వు మంచి పరిమాణంలో ఉంటుంది. అంతేకాదు.. అనేక రకాల విటమిన్లు, జింక్, మాంగనీస్, రాగి, మెగ్నీషియం, ఇనుము, పాంతోతేనిక్ ఆమ్లం వంటివి సమృద్ధిగా లభిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇతర విత్తనాల కంటే ఎక్కువ విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అంతేకాదు..క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. థైరాయిడ్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు కూడా పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవాలి. ఇది ఎముకలను బలపరుస్తుంది. కణాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఈ విత్తనంలో సరైన మొత్తంలో అయోడిన్, సెలీనియం ఉంటాయి. ఇది థైరాయిడ్ హార్మోన్‌ను సమతుల్యం చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలను క్రమం తప్పకుండా తీసుకుంటే అనేక రకాల క్యాన్సర్‌ల నుండి రక్షించుకోవచ్చు. ఈ విత్తనాల్లోని విటమిన్ ఇ క్యాన్సర్ నిరోధకమే కాకుండా గుండెను బలంగా చేయడంలో కూడా చాలా శక్తివంతమైనది. ఇది గుండె నుండి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుంది. ట్రైగ్లిజరైడ్‌లను కూడా తగ్గిస్తుంది. గుండెలో మంటను నివారిస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో అనేక రకాల ఖనిజాలు ఉంటాయి. వాటిలో మెగ్నీషియం, పాంటోథెనిక్ ఆమ్లం ఉన్నాయి. ఇవి కండరాల నొప్పులను తగ్గిస్తాయి.



## ప్రతి రోజూ టమోటా తింటే ఏమవుతుంది?

టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? అన్ని కూరగాయల్లో కెల్లా టమాటాది ప్రత్యేక స్థానం. ఎందుకంటే.. వంట ఏదైనా సరే.. టమాటా లేనిదే అసంపూర్ణం అని చెప్పాలి. వివిధ రకాల కూరగాయలు, సలాడ్‌లతో సహా అనేక వంటలలో ఉపయోగిస్తారు. టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం, చర్మం, జీర్ణవ్యవస్థకు ఇవి ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో పేరుకుపోయిన మలినాలు బయటకు పోతాయి. రోజూ పచ్చి టమాటా తింటే బీపీ తగ్గడంతో పాటు కొలెస్ట్రాల్ లెవెల్స్ కంట్రోల్ లో ఉంటాయి. ఇమ్యూనిటీ కూడా పెరుగుతుంది. టమాటాలో విటిన్ సి ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరగడానికి ఇది చాలా కీలకం. టమాటా యాంటీ ఆక్సిడెంట్ లా కూడా పని చేస్తుంది. బాడీ సెల్స్ డ్యామేజ్ కాకుండా అడ్డుకుంటుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. స్కిన్ ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. టమాటాతో జీర్ణ శక్తి పెరుగుతుంది. అందుకు కారణం ఏంటంటే..టమాటాలో ఫైబర్ అధికంగా ఉంటుంది. టమాటాలో విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను బలంగా ఉంచుతుంది. బ్లడ్ క్లాటింగ్ లేకుండా చూస్తుంది.

## వంటగదిలో ఈ తప్పులు చేస్తున్నారా..!



హిందూ ధర్మశాస్త్రం ప్రకారం.. ఇల్లు కేవలం నివాసం మాత్రమే కాదు.. అది శక్తి నిలయం. ముఖ్యంగా ఇంట్లోని వంటగది అత్యంత పవిత్రమైన ప్రాంతం. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఐశ్వర్యం, శ్రేయస్సుకు మూలమైన అన్నపూర్ణేశ్వరి దేవి కొలువయ్యే స్థానం ఇది. అయితే మనం తెలియకుండా చేసే కొన్ని చిన్న తప్పులు వంటగదిలో వాస్తు దోషాలను కలిగించి, తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు, కుటుంబ కలహాలకు దారితీస్తాయని వాస్తు నిపుణులు హెచ్చరిస్తున్నారు. మురికి పాత్రలు: చాలామంది రాత్రి పూట భోజనం చేసిన తర్వాత పాత్రలను కడగకుండా సింక్‌లోనే వదిలేసి, ఉదయాన్నే శుభ్రం చేస్తుంటారు. వాస్తు ప్రకారం ఇది అత్యంత ప్రమాదకరం. రాత్రంతా ఉండే మురికి పాత్రలు ప్రతికూల శక్తిని పెంచుతాయి. ఇది లక్ష్మీదేవి రాకను అడ్డుకోవడమే కాకుండా, ఇంట్లో అనవసర ఖర్చులను పెంచుతుందని వాస్తు శాస్త్రం చెబుతోంది. అగ్ని - నీరు: వంటగదిలో స్టవ్, సింక్ లేదా వాటర్ ట్యాప్ ఒకదానికొకటి చాలా దగ్గరగా లేదా ఒకే వరుసలో ఉండకూడదు. అగ్ని, నీరు విరుద్ధ అంశాలు కావడం వల్ల ఇవి దగ్గరగా ఉంటే దంపతుల మధ్య గొడవలు, అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మందులు-విరిగిన పాత్రలు: వంటగదిని కేవలం ఆహారానికి మాత్రమే పరిమితం చేయాలి. వంటగదిలో మెడికల్ కిట్‌లు లేదా మందులు ఉంచడం అశుభం. ఇది ఇంట్లోని వారు తరచూ అనారోగ్యం పాలయ్యేలా చేస్తుంది. పగిలిన పాత్రలు ఆర్థిక నష్టానికి, పేదరికానికి సంకేతం. వాటిని వెంటనే తొలగించాలి. స్టవ్ పైన లేదా వంటగదిలో అద్దం, దేవతల ఫోటోలు ఉంచడం వాస్తు విరుద్ధం. శుభప్రదమైన దిశలు: వంట చేసేటప్పుడు ఎల్లప్పుడూ తూర్పు వైపు ముఖం ఉంచడం శ్రేయస్కరం. దక్షిణం వైపు తిరిగి వంట చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. వాస్తు ప్రకారం వంటగది ఆగ్నేయ మూలలో ఉండటం అత్యంత శుభప్రదం. వంటగదిలోకి చెప్పులు ధరించి రావడం వల్ల ఆహార స్వచ్ఛత దెబ్బతింటుంది. వంటగదిని ఎల్లప్పుడూ శుభ్రంగా, గాలి వెలుతురు వచ్చేలా ఉంచుకోవాలి. ప్రతిరోజూ సాయంత్రం వంటగదిలో ఒక చిన్న దీపం లేదా వెలుగు ఉండేలా చూసుకోవడం వల్ల ఇంట్లో సిరిసంపదలు వృద్ధి చెందుతాయని వాస్తు పండితులు సూచిస్తున్నారు.

# ఇటీవల పెరుగుతున్న కొత్త అనారోగ్యం!



సోషల్ మీడియాలో నిమగ్నమైనప్పుడో, వీడియోలు స్క్రోల్ చేస్తున్నప్పుడో ఒక్కసారిగా తలతిరగడం, వికారం, తలనొప్పి వంటి సమస్యలు మీలో తలెత్తుతున్నాయా? అయితే అది సైబర్ సిక్‌నెస్ వల్ల కావచ్చు! అంటున్నారు నిపుణులు. డిజిటల్ పరికరాలను అతిగా ఉపయోగించడంవల్ల వచ్చే మోషన్ సిక్‌నెస్ రకాల్లో ఇదొకటి. మొబైల్, కంప్యూటర్, వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్ వంటివి ఉపయోగిస్తున్నప్పుడు, హెడ్‌సెట్ ధరించి వర్చువల్ ప్రపంచంలో మోషన్ (కదలిక) అనుభవిస్తున్నప్పుడు తలెత్తుతుంది. ఎందుకంటే కళ్లు వర్చువల్‌లో రన్నింగ్, ఫ్లయింగ్ వంటి కదులుతున్న దృశ్యాలను చూస్తుంటాయి. కానీ శరీరం నిజంగా స్థిరంగా ఉంటుంది. ఈ పరిస్థితి మెదడుకు విజువల్ (కళ్లు) అండ్ వెస్టిబ్యులర్ (ఇన్నర్ ఇయర్ బ్యాలెన్స్) సిగ్నల్స్ మధ్య అసమతుల్యతకు, అసమంజసత్వానికి కారణం అవుతుంది. దీనినే స్నరీ కాన్‌ఫ్లిక్ట్ అంటారు.నిజానికి కొవిడ్ మహమ్మారి సమయంలో లాక్ డౌన్, భౌతిక దూరం వంటి కారణాలతో రిమోట్ వర్క్, ఆన్‌లైన్ సోషలైజేషన్ పెరిగింది. దీంతో సహజంగానే స్క్రీన్ టైమ్ కూడా పెరిగింది. ఈ పరిస్థితి సైబర్ సిక్‌నెస్‌ను కూడా మరింత ఎక్కువ చేసింది. మొదట వర్చువల్ రియాలిటీలో గుర్తించబడిన ఈ సమస్య, కళ్లు చూసే విజువల్ మోషన్, శరీరం అనుభవించే స్థిరత్వం మధ్య అసమంజసత్వం వల్ల వస్తుంది. ఈ సందర్భంగా నిపుణులు కనుగొన్నారు. దీనినే సెన్సరీ కాన్ఫ్లక్ట్ థియరీగా పేర్కొన్నారు. అయితే ఇది మరీ కొత్తదేమీ కాదు. పురాతన కాలంలో కూడా మరో రూపంలో మోషన్(కదలిక) సిక్‌నెస్ ఉండేది. ఉదాహరణకు సముద్ర అనారోగ్యం 800 ఃఅఇ నాటిది, కానీ నేటి డిజిటల్ యుగంలో ఇది సోషల్ మీడియా స్క్రోలింగ్, గేమింగ్ వంటి కార్యకలాపాల్లో కనిపిస్తోంది. ఇది నిజమైన కదలిక లేదా స్థానచలనం లేని పరిస్థితుల్లో, కళ్లు మాత్రమే వర్చువల్‌గా కదలికలను చూస్తూ ఉన్నప్పుడు మెదడు గందరగోళానికి గురవుతుంది. దీంతో తలనొప్పి, తల తిరగడం, వికారం వంటివి తలెత్తుతాయి. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లలో నిమగ్నమై పోవడం, సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం ఇందుకు కారణం అవుతున్నదని నిపుణులు చెబుతున్నారు. లాంగ్ స్క్రీన్ టైమ్, ఫాస్ట్ మూవింగ్ కంటెంట్, అలాగే మోషన్ సిక్‌నెస్ హిస్టరీ ఉన్నవారిలో ఈ సమస్య మరింత అధికం అవుతుంది.తలనొప్పి, తల తిరగడం, కళ్లు తిరగడం, కళ్లపై ఒత్తిడి లేదా అలసట, శరీరంపై చెమటలు పట్టడం, వికారం, కొన్నిసార్లు వాంతింగ్స్ అవడం వంటివి సైబర్ సిక్‌నెస్ లేదా మోషన్ సిక్‌నెస్ లక్షణాలుగా పేర్కొనవచ్చు. ఇవి స్క్రీన్ చూడటం ఆపేసిన తర్వాత కూడా కొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చు. సాధారణంగా స్క్రీన్‌టైమ్ తగ్గించడం లేదా లక్షణాలు తగ్గే వరకు డిజిటల్ పరికరాలు, స్క్రీన్‌లకు దూరంగా ఉండటంవంటి నివారణ చర్యలతో సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సైబర్‌సిక్‌నెస్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏదీ లేదు. ఆన్‌లైన్‌లో లేదా సోషల్ మీడియాలో తరచుగా నిమగ్నమయ్యేవారు ప్రతీ 20 లేదా 30 నిమిషాలకు బ్రేక్ తీసుకోవాలి. లేదా 20-20-20 రూల్ ఫాలో కావాలి. అంటే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 20 సెకన్లు బ్రేక్ తీసుకొని, 20 అడుగుల దూరంలో పరిసరాలను చూడాలి. ముఖ్యంగా స్క్రీన్ టైమ్ తగ్గించంచడం, సరైన దూరం పాటించడం, స్క్రీన్ సెట్టింగ్స్‌లో బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్ తగ్గించడం, మోషన్ స్మూత్‌నెస్ పెంచడం వంటివి నివారణలో భాగమని చెప్పవచ్చు. అలాగే నీళ్లు ఎక్కువగా తాగడంవల్ల బాడీ హైడ్రేటెడ్‌గా ఉండి సిక్‌నెస్ లక్షణాల ప్రభావాన్ని తగ్గిస్తుంది.

# విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై ఆర్‌సీబీ సీఈవో క్లారిటీ.. ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్

**కోహ్లీ మరో 3-4 ఏళ్లు ఆడతాడని స్పష్టం చేసిన రాజేశ్ మీనన్**

**ఆర్‌సీబీ, విరాట్ ఒకే నాణేనికి రెండు వైపులని అభివర్ణించిన వైనం**

**కోహ్లీలో సత్తా, ఫిట్‌నెస్ తగ్గలేదని.. అతని ఆకలి చావదని ప్రశంస**

**రిటైర్మెంట్ తర్వాత కూడా కోహ్లీ ఆర్‌సీబీతోనే ఉంటాడని వెల్లడి**

**ఐపీఎల్ 2026లో అద్భుత ఫామ్‌తో జట్టుకు టైటిల్ అందించిన కోహ్లీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ భవిష్యత్తుపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సీఈవో రాజేశ్ మీనన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విరాట్ కోహ్లీ కనీసం మరో మూడు, నాలుగేళ్లు ఆర్‌సీబీ తరఫున ఆడతాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోహ్లీలో ఆట పట్ల ఆకలి, ఫిట్‌నెస్ ఏమాత్రం తగ్గలేదని, అతని రిటైర్మెంట్ ఇప్పట్లో ఉండబోదని స్పష్టం చేశారు. అంతేకాదు, ఆటగాడిగా కెరీర్ ముగిసిన తర్వాత కూడా కోహ్లీ ఆర్‌సీబీతోనే తన ప్రయాణాన్ని కొనసాగిస్తాడని చెప్పడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.
సీఎన్‌బీసీ టీవీ18తో మాట్లాడుతూ రాజేశ్ మీనన్ ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. “ఆర్‌సీబీ, విరాట్ ఒకే నాణేనికి రెండు వైపుల వంటివారు. ఒకవేళ ఆటగాడిగా కోహ్లీ కెరీర్ ముగిసిన తర్వాత కూడా అతడు లేని ఆర్‌సీబీని ఊహించుకోలేను. అయితే, రాబోయే మూడు, నాలుగేళ్ల పాటు అతను కచ్చితంగా ఆడతాడు. అతడు చాలా ఫిట్‌గా ఉన్నాడు. అతనిలోని ఆకలి ఎప్పటికీ చావదు. ఈ ఐపీఎల్ సీజన్‌లో మీరు అతని ఎనర్జీ, పరుగులు, దూకుడు అన్నీ చూశారు. కాబట్టి మరో నాలుగు సంవత్సరాలు ఆడటంలో ఎటువంటి సందేహం లేదు” అని మీనన్ పేర్కొన్నారు.
రాజేశ్ మీనన్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ ఐపీఎల్ 2026 సీజన్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌ను కనబరిచాడు. ఈ టోర్నీలో 675 పరుగులతో నాలుగో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా తన ఐపీఎల్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా 165.84 స్ట్రైక్ రేటును నమోదు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అత్యంత కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో 75 పరుగులతో అజేయంగా నిలిచి, ఆర్‌సీబీ వరుసగా రెండోసారి టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో వరుసగా రెండు టైటిళ్లు గెలిచిన మూడో జట్టుగా ఆర్‌సీబీ చరిత్ర సృష్టించింది.
ఐపీఎల్ ప్రారంభమైన 2008 నుంచి విరాట్ కోహ్లీ ఆర్‌సీబీకి మూలస్తంభంలా నిలిచాడు. ఈ లీగ్ చరిత్రలో అత్యధిక పరుగులు (9,336), అత్యధిక సెంచరీలు (8) చేసిన ఆటగాడిగా తిరుగులేని రికార్డులను నెలకొల్పాడు. 2016లో ఒకే సీజన్‌లో 973 పరుగులు చేసి అసాధారణ ఫీట్‌ను అందుకున్నాడు.
కేవలం ఐపీఎల్‌లోనే కాదు, అంతర్జాతీయ క్రికెట్‌లోనూ విరాట్ కోహ్లీ తనదైన ముద్ర వేశాడు. తన దూకుడైన కెప్టెన్సీ, నిలకడైన బ్యాటింగ్, ఉన్నతమైన ఫిట్‌నెస్ ప్రమాణాలతో భారత క్రికెట్ స్వరూపాన్నే మార్చేశాడు. ఐసీసీ టెస్టు, వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో ఏకకాలంలో నంబర్ వన్ స్థానంలో నిలిచిన ఏకైక భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ నేపథ్యంలో కోహ్లీ భవిష్యత్తుపై ఆర్‌సీబీ సీఈవో చేసిన వ్యాఖ్యలు ఫ్రాంచైజీకి అతనిపై ఉన్న నమ్మకాన్ని, గౌరవాన్ని తెలియజేస్తున్నాయి.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి యువరాజ్ సింగ్ ఎంట్రీ?.. ఐపీఎల్ 2027కు భారీ ప్లాన్స్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఖ్రూా 2027) రాబోయే సీజన్‌కు ముందే ఒక బిగ్గెస్ట్ అప్‌డేట్ క్రికెట్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. టీమిండియా లెజెండరీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ (బజతీఖుయ వాఱఅస్త్రష్ట్ర) మెంటార్/కోచ్ అవతారం ఎత్తబోతున్నాడు. ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్ (ఐవశ్రీష్ట్రఱ ఋుజూఘ్ఖుశ్రీం) జట్టు.. తమ తొలి ట్రోఫీ లక్ష్యంగా యువరాజ్ సింగ్‌ను కోచింగ్ స్టాఫ్‌లోకి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. యువీకి ప్రొఫెషనల్ క్రికెట్‌లో ఇదే మొదటి కోచింగ్ కావడం విశేషం.

**లేట్‌గా వచ్చినా.. లేటెస్ట్‌గా వస్తున్న యువీ:**

టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. ఢిల్లీ క్యాపిటల్స్ సీనియర్ ప్రతినిధి ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు. యువరాజ్ సింగ్ లాంటి లెజెండ్ డగౌట్‌లో ఉండాలని ఎవరు కోరుకోరు?.. ఆయన కోచింగ్ రేసులోకి కాస్త లేట్‌గా వచ్చి ఉండొచ్చు, కానీ అతనికి యువ ఆటగాళ్లను ఎలా గైడ్ చేయాలో బాగా తెలుసు.. అతను కేవలం ఫోన్లలో సలహాలు ఇచ్చే టైప్ కాదు.. ఎండనక, వాననక గంటల తరబడి నెట్స్ వెనుక నిలబడి ప్లేయర్ల తప్పులను సరిదిద్దే హ్యాండ్స్-ఆన్ మెంటార్.. అతని రాక ఢిల్లీ టీమ్‌కు కొండంత బలాన్ని ఇస్తుందని వెల్లడించాడు.

**దాదాతో జతకట్టనున్న సిక్సర్ల కింగ్:**

ఐపీఎల్‌లో జరిగిన అంతర్గత ఒప్పందం ప్రకారం.. రాబోయే రెండేళ్ల పాటు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బాధ్యతలను జీఎంఆర్ గ్రూప్ చూసుకోనుంది. జీఎంఆర్ క్రికెట్ డైరెక్టర్‌గా ఉన్న మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మళ్లీ మెన్స్ టీమ్‌లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నాడు. ఇటీవల సౌతాఫ్రికా T20 (SA20) లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టును ఫైనల్ వరకు తీసుకెళ్లిన దాదాను.. ఢిల్లీ క్యాపిటల్స్ తమ హెడ్ కోచ్‌గా ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. దీంతో గంగూలీ-యువరాజ్ సింగ్ ల సూపర్ హిట్ కాంబినేషన్‌ను మనం మళ్లీ ఢిల్లీ డగౌట్‌లో చూడబోతున్నాం.

**కెప్టెన్ గా కేఎల్ రాహుల్?.. పంత్ వర్సెస్ కుల్దీప్ ట్రేడ్:**

ఈ కోచింగ్ మార్పులతో పాటు ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ మేనేజ్‌మెంట్‌లో మరికొన్ని ఊహించని ట్విస్టులు కూడా ఉన్నాయి. ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ ను నియమించబోతున్నట్లు టాక్ నడుస్తుంది. అలాగే లక్నో సూపర్ జెయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్‌ను మళ్లీ ఢిల్లీలోకి తెచ్చుకుని.. బదులుగా ఢిల్లీ స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను లక్నో టీమ్‌కు ట్రేడ్ చేసేందుకు భారీ స్కెచ్ నడుస్తోందట.

# కోహ్లీ-రోహిత్‌కు 2027 వరల్డ్ కప్ డోర్ క్లోజ్.. బీసీసీఐ సైలెన్స్‌తో పెరిగిన ఉత్కంఠ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో దూసుకుపోతోంది. వచ్చే ఏడాది (2027) జరగబోయే వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా బీసీసీఐ ఇప్పటి నుంచే రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తోంది. అయితే భారత క్రికెట్ అభిమానుల మైండ్‌లో మెదులుతున్న ఒకే ఒక్క బిగ్గెస్ట్ క్వశ్చన్.. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ ఈ మెగా టోర్నీలో ఆడతారా లేదా?.. ఈ హాట్ టాపిక్‌పై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పందించారు. కానీ, ఆయన ఈ ప్లాన్స్‌పై మౌనంగా ఉన్నారు.. ఇవన్నీ బోర్డ్‌రూమ్ సీక్రెట్స్ అంటూ మాట దాటేశారు.

**వ్యూహాత్మక చర్చలు.. బయటకు చెప్పలేం:**

వరల్డ్ కప్ ప్రణాళికలపై దేవజిత్ సైకియా పీటీఐ (గ్రు×) తో మాట్లాడుతూ.. బోర్డులో చాలా అనుభవజ్ఞులైన నిపుణులు, సెలెక్టర్లు ఉన్నారని, నిర్ణయాలన్నీ అందరితో చర్చించి తీసుకుంటామని చెప్పారు. ఇవి వ్యూహాత్మక (క్రొతీఖ్వస్త్రఱఎ) చర్చలు కాబట్టి, వీటిని మీడియా ముందు గానీ, పబ్లిక్‌గా గానీ రివీల్ చేయడానికి తనకు అనుమతి లేదని, ఇలాంటి విషయాలు బోర్డ్‌రూమ్‌లోనే ఉండాలని ఆయన తేల్చి చెప్పారు. ఒకవైపు కోచ్ గౌతమ్ గంభీర్ యంగ్ టీమ్‌ను బిల్డ్ చేయాలని చూస్తుంటే.. రోహిత్, కోహ్లీలు మాత్రం వరల్డ్ కప్ ఆడాలని కసితో ఉన్న తరుణంలో ఈ కామెంట్స్ ఆసక్తికరంగా మారాయి.

**రోహిత్, విరాట్ ఫామ్ కీలకం:**

కెరీర్ చివరి దశలో ఉన్నా.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలలో ఇంకా చాలా క్రికెట్ మిగిలే ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.. కోహ్లీ ఐపీఎల్ 2026 లో అద్భుతమైన ఫామ్‌తో అత్యధిక పరుగులు చేసిన టాప్-4 బ్యాటర్లలో ఒకడిగా నిలిచాడు. గాయం కారణంగా ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌కు దూరమైనప్పటికీ.. త్వరలోనే ఇంగ్లాండ్ సిరీస్ నాటికి టీమ్‌లోకి రీ-ఎంట్రీ ఇవ్వనున్నాడు. మరోవైపు, ఐపీఎల్ 2025 సీజన్ ముంబై ఇండియన్స్ తరఫున రోహిత్‌కు అంతగా కలిసిరాలేదు (9 మ్యాచ్‌ల్లో 283 రన్స్ ). కానీ, ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లోని రెండో మ్యాచ్‌లో 48 రన్స్ కొట్టి మంచి టచ్‌లో కనిపించాడు. వరల్డ్ కప్ లోపు తన పాత ఫామ్‌ను అందుకోవాలని హిట్ మ్యాన్ చూస్తున్నాడు.

# వెంకటేష్ డబుల్ ధమాకా..100 రోజుల్లో 2 సినిమాలు!

విక్టరీ వెంకటేష్ రూటే సపరేట్ ఎలాంటి హడావుడి, ఆర్భాటం లేకుండా సైలెంట్‌గా బాక్సాఫీస్ హిట్లు కొట్టడం ఆయనకు మాత్రమే సాధ్యం. సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లు అందుకుని ఫుల్ ఫామ్‌లో ఉన్న వెంకీ.. ఇప్పుడు తన అభిమానులకు సరికొత్త డబుల్ ట్రీట్ ఇవ్వడానికి రెడీ అయ్యారు. కేవలం 100 రోజుల గ్యాప్‌లోనే రెండు భారీ సినిమాలతో థియేటర్లలో సందడి చేస్తూ బాక్సాఫీస్ వద్ద డబుల్ ధమాకా సృష్టించబోతున్నారు. ఆ వివరాలు చూద్దాం..

**దసరా బరిలో ఆదర్శ కుటుంబం:**

వెంకటేష్ సోలో హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఆదర్శ కుటుంబం' ఒకటి. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది. భారీ తారాగణం, ప్యూర్ ఫ్యామిలీ ఎమోషన్స్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న దసరా మరియు గాంధీ జయంతి కానుకగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. త్రివిక్రమ్ మార్క్ డైలాగులు, వెంకీ టైమింగ్ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానున్నాయి.



**స్టార్‌డమ్ నిర్వచనాలను మారుస్తున్న వర్ధమాన బహుభాషా తార కావ్య థాపర్**

**సంక్రాంతి విందుగా 'వెంకీ - అనిల్' 5వ చిత్రం:**

'ఆదర్శ కుటుంబం' విడుదలైన సరిగ్గా 100 రోజుల గ్యాప్‌తో వెంకటేష్ మరో భారీ సినిమాతో జనం ముందుకు రానున్నారు. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం లో గురువారమే ఘనంగా ప్రారంభ మైన ఈ చిత్రం 2027 సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. ఎఫ్2, ఎఫ్3 లాంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత వీరి కాంబోలో వస్తున్న ఐదో సినిమా ఇది. ఈసారి నందమూరి కళ్యాణ్ రామ్ కూడా తోడవడంతో థియేటర్లలో నవ్వుల పండగ గ్యారెంటీ అనిపిస్తోంది.



**వంద రోజుల్లో 2 మూవీస్ :**

అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో కీర్తి సురేష్, కృతిశెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ కి జీవీ మ్యూజిక్ అందిస్తున్నాడు సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇక వెంకటేష్ నటించిన మూడు సినిమాలు ఒకే ఏడాదిలో విడుదల కావడం, అందులో రెండు సినిమాలు కేవలం వంద రోజుల గ్యాప్‌లో రావడం ప్రత్యేకం.వెంకటేష్ నుంచి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు వస్తుండటంతో అటు ఫ్యాన్స్, ఇటు టాలీవుడ్ థియేటర్ల యజమానులు ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఇక త్రివిక్రమ్ క్లాస్ ఫ్యామిలీ ఎమోషన్స్, అనిల్ రావిపూడి ఊరమాస్ కామెడీ మార్క్.. ఈ రెండూ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తాయో చూడాలి. ఇక ఫుల్ ఫామ్ లో ఉన్న వెంకటేష్, రాబోయే దసరా, సంక్రాంతి సీజన్లను తన సినిమాలతో ఎలా రూల్ చేస్తారో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965